
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

శ్రీ పొట్టిశ్రీరాములు **నెల్లూరు**

శనివారం 5 ఆగస్టు 2017 | 16



వరములీయవే..

వరలక్ష్మీ





భక్తి శ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతం

గృహాలు, ఆలయాల్లో సందడి

2 లో..

నేటి నుంచి

ఎస్జీటీల బదిలీలు

అర్ధరాత్రి వరకు ఎస్ఏల కౌన్సెలింగ్

16వ పేజీలో

కాకి అరుస్తూనే ఉంది.. కారవాడి ఎండిపోతూనే ఉంటుందన్న చందంగా మారింది ప్రభుత్వ భూముల పరిస్థితి. ఏళ్ల తరబడి ప్రభుత్వ భూములు కబ్జారాయుళ్ల గుప్పెట్లో ఉంటున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారు. ఎవరైనా ఫిర్యాదులు చేస్తే అప్పటికప్పుడు సర్వే చేసి, బోర్డులు నాటి చేతులు దులుపుకుంటున్నారు. మనుబోలు మండలంలో సుమారుగా 5వేల ఎకరాలకుపైగా ఆక్రమణకు గురైనట్లు సమాచారం. మండలం మీదుగా ఉండే జాతీయ రహదారి పక్కనే ఒక ఎకరా స్థలం విలువ రూ.40-50లక్షల వరకు ఉంటుంది. ఇక మారుమూల ప్రాంతాల్లో కనీసం రూ.5లక్షల వరకు ఉంటుంది. దీనినిబట్టి చూస్తే ఆక్రమణకు గురైన భూమి విలువ రూ.కోట్లలోనే ఉంటుంది. పేదల ముసుగులో పెద్దలు గద్దల్లా వాలిపోయి ఆక్రమించేస్తున్నారు. వీరికి రాజకీయనాయకుల అండ తోడవడంతో అడ్డూ అదుపు లేకుండా పోయింది. ప్రభుత్వ యంత్రాంగానికి ఇదంతా తెలిసినా చేతులు ముడుచుకుని కూర్చోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

• మనుబోలు 6లో..

బోర్డున్నా బేఖాతర్ : మనుబోలు వద్ద ప్రభుత్వ భూమిలో నిర్మాణాలు



ప్రభుత్వ భూమేగా.. వేసెయ్ పాగా!

- మనుబోలు మండలంలో కబ్జాదారులు
- ఐదు వేల ఎకరాలకుపైగా ఆక్రమణ
- విలువ రూ.కోట్లలోనే..
- చెరువులు, కాలువలు, పోరంబోకు స్థలాలన్నీ హాంఫట్
- రాజకీయ నాయకుల అండదండలు
- ముద్దునిద్రలో ప్రభుత్వ యంత్రాంగం
- బోర్డుల ఏర్పాటు, సర్వేలతోనే సరి



వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పక్కనే ఉన్న ఈయన పేరు నాగూరు నాగార్జునరెడ్డి. ఆ పార్టీ ఎమ్మెల్యేకు ముఖ్య అనుచరుడు. ఇటీవల లోటస్ పాండ్‌కు వెళ్లి జగన్‌కు పరిచయం చేసి ఫొటోలకు ఫోజులిచ్చారు. క్రికెట్ బుకీలు, బెట్టింగ్‌లపై జరిగిన దాడులలో నాగార్జున చిక్కడంతో 6వ నగర పోలీసులు కేసు నమోదు చేసి అరెస్టు చేశారు. ఆయనే కాదు.. జాతీయ బుకీలుగా పోలీసులు గుర్తించిన 9 మందిలో సూళ్లూరుపేటకు చెందిన అల్లూరు అనిల్‌కుమార్‌రెడ్డి, మరో వైసీపీ ఎమ్మెల్యే ముఖ్య అనుచరుడు, పొదలకూరుకు చెందిన మన్నం శ్యాంప్రసాద్ ఒంగోలు వైసీపీ నేతకు సన్నిహితుడిగా ఉన్నారు. ప్రధాన బుకీ కృష్ణసింగ్, ఎస్‌కే షంషేర్‌లు వైసీపీ నేతలతో చట్టాపట్టాలు వేసుకుని మనమంతా ఒకటేనన్న రీతిలో నడుస్తుంటారు. నాడు ఎన్నికల సమయంలో నకిలీ మద్యం సరఫరా చేసి ఇద్దరు వైసీపీ ఎమ్మెల్యేలు ఆ కేసుల్లో చిక్కుకుని సీబీసీఐడీ దర్యాప్తు చేస్తోంది. ఇప్పుడు క్రికెట్ బుకీలు, బెట్టింగ్‌లలో వైసీపీ నేతలే అధికంగా ఉండటం చర్చనీయాంశమైంది.

8

నాడు నకిలీ మద్యం..

నేడు క్రికెట్ బుకీ

- బెట్టింగ్‌లలో వైసీపీ నేతలే ఎక్కువ
- జాతీయ బుకీలలో అత్యధికులు వారే!
- ఎమ్మెల్యే అనుచరులుగా చెలామణి
- పార్టీ కార్యక్రమాలకు ఆర్థిక తోడ్పాటు
- అరెస్టులతో జిల్లాలో చర్చనీయాంశం

డబ్బు కొట్టు.. పోస్టు పట్టు!

- అంగడి సరుకులా షిఫ్ట్ ఆపరేటర్ పోస్టులు
- ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జుల అనుచరులే మధ్యవర్తులు
- విద్యుత్ అధికారులకూ భాగస్వామ్యం
- ఒక్కో ఉద్యోగానికి రూ. 5 లక్షల వరకు డిమాండ్
- అర్హులకు అన్యాయం.. జిల్లాలో 5 సబ్‌స్టేషన్ల నిర్మాణం
- మరో తొమ్మిదింటికి ప్రతిపాదనలు

8 లో..

అవినీతి అధికారుల

జాబితా సిద్ధం!

- మొదట సొంత శాఖపైనే ఎస్పీ దృష్టి
- ఎర్రచందనం, ఇసుక, బెట్టింగ్‌లో భాగస్వామ్యం ఉన్న సీఐల వివరాల సేకరణ
- ఎస్‌బీ ఏఎస్‌ఐలు కూడా.. పూర్తి వివరాలు డీజీ, ఐజీకి అందజేత
- సిద్ధమవుతున్న జీడీలు, పీసీల జాబితా
- ఎవరిపై వేటు పడుతుందోనని పోలీసు వర్గాల్లో ఉత్కంఠ

8 లో..



భారత క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్ కపిల్‌దేవ్ శుక్రవారం కృష్ణపట్నం పోర్టును సందర్శించారు. అక్కడ మొక్కలు నాటి, ఫొటో ప్రదర్శనను తిలకించారు. - మెయిన్‌లో..

ఎంఎల్ఎస్ పాయింట్లలో

బియ్యం బొక్కుతున్నారు!

నెలకు రూ.అరకోటిపైనే స్వాహా..?

'ఈ- పాస్' అమలుకు ముందుకురాని అధికారులు

9వ పేజీలో

రావమ్మా.. మహాలక్ష్మీ రావమ్మా!



నెల్లూరు: రాజరాజేశ్వరిదేవి ఆలయంలో వరలక్ష్మికి పూజలు చేస్తున్న భక్తులు




నెల్లూరు: శబరి శ్రీరామ క్షేత్రంలో వరలక్ష్మి పూజ చేస్తున్న భక్తులు

● భక్తి శ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతం ● గృహాలు, ఆలయాల్లో సందడి

సిరులిచ్చే వరమహాలక్ష్మీ రావమ్మా.. అంటూ జిల్లాలోని మహిళలు శుక్రవారం మహాలక్ష్మీని పూజించి, నైవేద్యాలు సమర్పించారు. భక్తి శ్రద్ధలతో మహాలక్ష్మీ వ్రతం జరుపుకున్నా రు. జిల్లాలోని శివకేశవ ఆలయాలు మహాలక్ష్మీ దుర్గాంశ ఆలయాల్లో సామూహి క వరలక్ష్మీ వ్రతాలు ఎంతో వైభవంగా జరిగాయి. గృహాలు, వ్యాపార సముదాయాల్లో వరలక్ష్మీ వ్రతం జరుపుకొని మహాలక్ష్మీని పూజించారు. జిల్లా వ్యాప్తంగా శ్రావణ శుక్రవారం సందర్భంగా వివాహాలు కూడా భారీగా జరిగాయి. అటు పండుగ, ఇటు పెళ్లిళ్లతో సందడి నెలకొంది. సూళ్లూరుపేట చెంగాళమ్మ, నెల్లూరులోని రాజరాజేశ్వరి, కావలి, పెంచలకోన, జొన్నవాడ, గూడూరు, నాయుడుపేట, ఆత్మకూరు, వెంకటగిరి, తదితర పట్టణాల్లో అమ్మవారికి వరలక్ష్మీ వ్రతాన్ని భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ముత్తైదువులు ఒకరికొకరు వాయినాలు యిచ్చిపుచ్చుకున్నారు. ఈ సందర్భంగా పలువురు ప్రజా ప్రతినిధులు, అధికారులు ఆలయాల్లో అమ్మవార్లను దర్శించుకొని, ప్రత్యేక పూజలు చేశారు.

-నెల్లూరు (సాంస్కృతికం)



నెల్లూరు: అమ్మవారి కలశాలను తీసుకొస్తున్న భవానీ భక్తుడు



రాపూరు: పెంచలకోనలో తిరుచ్చిపై ఊరేగుతున్న ఆదిలక్ష్మి



పెంచలకోన నందనవనంలో సామూహిక వరలక్ష్మీ వ్రతం చేస్తున్న మహిళలు



చిల్లకూరు: తూర్పు కనుమూరులో ప్రత్యేకాలంకారంలో ముత్యాలమ్మ అమ్మవారు



దగదర్తిలో పూజలందుకుంటున్న వరలక్ష్మి



జొన్నవాడ ఆలయంలో భక్తుల రద్దీ



సంగంలో స్వామి, అమ్మవారి విగ్రహాలకు అభిషేకం



కావలిలోని కలుగోళశాంభవి ఆలయంలో సామూహిక వరలక్ష్మీ వ్రతంలో పాల్గొన్న మహిళలు



నాయుడుపేట: గ్రామదేవత పోలేరమ్మకు గాజుల అలంకారం



ఆర్థిక మంత్రి అరుణ్‌జైట్లీకి వినతి పత్రం అందచేస్తున్న ఎమ్మెల్యే రామకృష్ణ, చేనేత కార్మికులు

జీఎస్‌టీ నుంచి
చేనేతను మినహాయించండి

● ఆర్థిక మంత్రి జైట్లీకి కురుగొండ్ల వినతి

నెల్లూరు (సాంస్కృతికం) : చేనేత రంగానికి జీఎస్‌టీ నుంచి మినహాయింపు ఇచ్చి చేనేత కార్మికులను ఆదుకోవాలంటూ వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్‌జైట్లీకి వినతి పత్రం అందచేశారు. ఆయన శుక్రవారం ఢిల్లీలో ఎంపీ కింజరపు రామ్మోహన్‌నాయుడుతో కలిసి జైట్లీని కలిశారు. వెంకటగిరి నియోజకవర్గంలో ఎన్నో కుటుంబాలు చేనేతపై ఆధారపడి జీవిస్తున్నాయన్నారు. జీఎస్‌టీ ప్రభావంతో ఈ రంగం కుదేలై ఇబ్బందులు పడుతున్నారని, పన్ను నుంచి మినహాయింపు ఇవ్వాలని కోరారు.

వ్యవసాయ అధికారులకు
వాహన సదుపాయం కల్పించాలి

● వ్యవసాయాధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరాజు

ఉద్యోగపర్వం



రైతులకు పలు సూచనలు, సలహాలు అందించడానికి నిత్యం గ్రామాల్లో పర్యటించే వ్యవసాయ అధికారులకు ప్రభుత్వం వాహన సదుపాయం కల్పించాలి. ఇందులో ఏవో, ఏడీఏలకు ప్రత్యేకించి ఈ సదుపాయం కల్పించాలి. నెల్లూరు, కోవూరు, బుచ్చి మండలాల్లోని వ్యవసాయ అధికారుల కార్యాలయాలకు సొంత భవనాలు నిర్మించాలి. కోవూరుతో పాటు ఆత్మకూరు, గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి, నెల్లూరు సబ్ డివిజన్ల ఏడీలకు సొంత భవనాలలో కార్యాలయాలు నిర్మించాలి. అదేవిధంగా రైతు శిక్షణ కేంద్రానికి సొంత భవనం నిర్మించాలి.

- నెల్లూరు (వ్యవసాయం)

ఎంసెట్, ఐసెట్ చివరి కౌన్సెలింగ్

- నేడు, రేపు ఎంసెట్
- 6, 7 తేదీలలో ఐసెట్
- 8,9 తేదీల్లో ఫార్మసీ, బయోటెక్నాలజీ వారికి...

నెల్లూరు (క్యాంపస్) : ఇంజనీరింగ్ కళాశాలల్లో ప్రవేశాల కోసం ఎంసెట్ రాసిన విద్యార్థులకు చివరి కౌన్సెలింగ్ ఈనెల 5వతేదీ నుంచి ప్రారంభం కానుంది. ఇప్పటికే రెండు విడతల కౌన్సెలింగ్ పూర్తయినప్పటికీ ఎంసెట్ రాసి కళాశాలల్లో చేరని విద్యార్థుల కోసం చివరి అవకాశాన్ని రాష్ట్ర ప్రభుత్వం కల్పించింది. నెల్లూరు దర్గామిట్టలో ఉన్న బాలికల పాలిటెక్నిక్‌లో, వెంకటేశ్వరపురంలోని బాలుర పాలిటెక్నిక్‌లో శని, ఆదివారాల్లో కౌన్సెలింగ్ జరుగుతుంది. ఈ రెండు కేంద్రాలలో ఏ ర్యాంకు విద్యార్థులైనా కౌన్సెలింగ్‌కు హాజరుకావచ్చని అధికారులు పేర్కొన్నారు.

రేపటి నుంచి ఐసెట్ కౌన్సెలింగ్

ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో చేరేందుకు విద్యార్థులు రాసిన ఐసెట్ చివరి కౌన్సెలింగ్ ఆది, సోమవారాల్లో జరగనుంది. ఇప్పటికే ఒక దఫా కౌన్సెలింగ్ పూర్తయినప్పటికీ సీట్లు పొందని విద్యార్థుల కోసం చివరి కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నారు. ఈనెల 6, 7 తేదీలలో నెల్లూరు దర్గామిట్టలో ఉన్న బాలికల పాలిటెక్నిక్‌లో, వెంకటేశ్వరపురంలోని బాలుర పాలిటెక్నిక్‌లో ఒకటో ర్యాంకు నుంచి చివరి ర్యాంకు వరకు కౌన్సెలింగ్ జరుగుతుంది. ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు కౌన్సెలింగ్ నిర్వహిస్తారు.

ఫార్మసీ, బయో టెక్నాలజీ వారికి 8 నుంచి....

బీ ఫార్మసీ, ఫార్మాడీ, బయోటెక్నాలజీ కోర్సుల్లో ప్రవేశాల కోసం ఎంసెట్ 2017 కౌన్సెలింగ్ ఈనెల 8వ తేదీ నుంచి ప్రారంభం కానుంది. నెల్లూరులోని ప్రభుత్వ బాలికల పాలిటెక్నిక్, వెంకటేశ్వరపురంలోని ప్రభుత్వ బాలుర పాలిటెక్నిక్ కళాశాలల్లో రెండు రోజుల పాటు కౌన్సెలింగ్ జరగనుంది. తొలిరోజు బాలికల పాలిటెక్నిక్‌లో ఉదయం 1వ ర్యాంకు నుంచి 7,500 ర్యాంకు వరకు, మధ్యాహ్నం 15,001 ర్యాంకు నుంచి 22,500 ర్యాంకు వరకు కౌన్సెలింగ్ జరుగుతుంది. బాలుర పాలిటెక్నిక్‌లో ఉదయం 7,501 ర్యాంకు నుంచి 15వేల ర్యాంకు వరకు, మధ్యాహ్నం 22,501 నుంచి 30వేల ర్యాంకు వరకు కౌన్సెలింగ్ జరుగుతుంది. 9వ తేదీ బాలికల పాలిటెక్నిక్‌లో ఉదయం 30,001 నుంచి 40వేల ర్యాంకు వరకు, మధ్యాహ్నం 50,001 నుంచి 60వేల వరకు, బాలుర పాలిటెక్నిక్‌లో ఉదయం 40,001 నుంచి 50వేల ర్యాంకు వరకు, మధ్యాహ్నం 60,001 నుంచి చివరి ర్యాంకు వరకు కౌన్సెలింగ్ జరుగుతుంది. ఎస్టీ విద్యార్థులకు బాలికల పాలిటెక్నిక్‌లో 8వ తేదీ 1 నుంచి 30వేల ర్యాంకు వరకు, 9వ తేదీ 30,001 నుంచి చివరి ర్యాంకు వరకు కౌన్సెలింగ్ జరుగుతుంది.

జగన్‌ను అరెస్ట్ చేయాలి : బీద

నెల్లూరు, (ఆంధ్ర జ్యోతి) : నడిరోడ్డుపై సీఎంను కాల్చిచంపండంటూ ప్రతిపక్ష నాయకుడు జగన్మోహన్‌రెడ్డి మాట్లాడడం చూస్తుంటే ఆయన మానసిక స్థితి ఏవిధంగా ఉందో అర్థం చేసుకోవచ్చని టీడీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర అన్నారు. శృతి మించి మాట్లాడుతున్న ప్రతిపక్ష నాయకుడిని అరెస్ట్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. శుక్రవారం నెల్లూరులోని ఎన్టీఆర్ భవన్‌లో బీద విలేఖర్ల సమావేశంలో మాట్లాడారు. ఒక పార్టీ అధ్యక్షుడిగా, రాష్ట్ర ప్రతిపక్ష నాయకుడిగా ఉన్న జగన్మోహన్‌రెడ్డి తన మాటలతో ప్రజలకు ఏం సందేశం ఇస్తున్నారో తెలియజేయాలన్నారు. హత్యా రాజకీయాలు కలిగిన కుటుంబం జగన్మోహన్‌రెడ్డిదని విమర్శించారు. పరిటాల రవిని పట్టపగలు అనంతపురం టీడీపీ కార్యాలయంలో హత్య చేయించి న ఘనుడు ఆయనేనని ఆరోపించారు. మొద్దు శీనును జైలులో, సూరిని నడిరోడ్డుపై ఎందుకు, ఎవరు చంపారో అందరికీ తెలుసన్నారు. భగవద్గీత, బైబుల్, ఖురాన్‌ల సాక్షిగా పచ్చి అబద్దాలు చెప్పిన ప్రతిపక్ష నాయకుడికి చంద్రబాబును విమర్శించే అర్హత లేదన్నారు. సీఎంపై చేసిన అనుచిత వ్యాఖ్యలకు జగన్ ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కాపులకు, ముస్లింలకు అన్యాయం చేస్తోంది వైసీపీయేనని ఆరోపించారు. నాడు వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, ముద్రగడ పద్మనాభం కలిసి కాపులకు ద్రోహం చేస్తే, ఇప్పుడు ముద్రగడ జగన్‌తో కలిసి మరోసారి అన్యాయం చేస్తున్నారని మండిపడ్డారు. తమ ప్రభుత్వం ఇప్పటికే బీసీ కమిషన్, కాపు కార్పొరేషన్ ఏర్పాటు చేసి చేయుత అందిస్తోందని, కాపులకు రిజర్వేషన్లు కల్పించే అంశంపై ప్రత్యేక కమిషన్ ద్వారా సర్వే చేస్తున్నామని చెప్పారు. ఉద్దానం కిడ్నీ బాధితుల తరపున జనసేన అధినేత పవన్ కల్యాణ్ సీఎం చంద్రబాబును కలిస్తే దాన్ని కూడా రాజకీయం చేయడం వైసీపీ నాయకుల విజ్ఞతకు అద్దం పడుతోందన్నారు. వారికి 2019 ఎన్నికల్లో ప్రజలు తగిన బుద్ధి చెబుతారని, నంద్యాల ఉప ఎన్నికల్లో ఓటర్లు వైసీపీని బ్యాలెట్ తుపాకీతో కాలుస్తారని బీద జోస్యం చెప్పారు. కాగా, క్రికెట్ బెట్టింగ్ వ్యవహారంలో టీడీపీ నాయకులు ఎవరూ లేరని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఆప్‌కాఫ్ చైర్మన్ కొండూరు పాలిశెట్టి, విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి చేజర్ల వెంకటేశ్వర్లు రెడ్డి, మల్లికార్జున యాదవ్, చాట్ల నరసింహారావు, నాయకులు బాలకృష్ణచౌదరి, మొయినుద్దీన్, రంగారావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బీద రవిచంద్ర

బాధిత జేబీ సిబ్బంది కోసం న్యాయపోరాట కమిటీ

కావలిటౌన్: జేబీ అధ్యాపకేతర సిబ్బందిని అర్థాంతరంగా తొలగించినందుకు నిరసనలో భాగంగా వారికి మద్దతుగా శుక్రవారం కారోనేషన్ రీడింగ్ రూమ్‌లో ప్రజా సంఘాల నాయకులు న్యాయ పోరాట కమిటీ ఏర్పాటు చేశారు. కమిటీ సభ్యులు మాట్లాడుతూ ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని, భవిష్యత్ కార్యాచరణ రూపొందించి ముందుకుపోతామన్నారు. వ్యవస్థాపకుడి ఆశయానికి భిన్నంగా ప్రస్తుత యాజమాన్యం విద్యను వ్యాపారంగా మార్చిందన్నారు.. కమిటీ కన్వీనర్‌గా కే భాస్కర్, కో-కన్వీనర్‌గా పీ. పెంచలయ్య, సభ్యులుగా మాల్యాద్రి, డేగా సత్యం, కుందుర్తి శ్రీనివాసులు, జి. వెంకటేశ్వర్లు, ఎన్‌జె వర్మ, సుబ్బయ్య, బ్రహ్మయ్య, ప్రసన్న తదితరులు ఎంపికయ్యారు.

● ఇంటర్వ్యూ



ముద్దాయిలలో సత్ప్రవర్తనకు కృషి

సబ్‌జైల్ డిప్యూటీ జైలర్ ఏడుకొండలు

? : సబ్‌జైల్‌లో ఎన్ని గదులున్నాయి, వాటిలో ఎంత మంది ముద్దాయిలున్నాయి.

! : సబ్‌జైల్‌లో మొత్తం 21 గదులున్నాయి. 57 మంది ముద్దాయిలు ఉండవచ్చు.

? : ముద్దాయిలలో పరివర్తనకు మీరు తీసుకుంటున్న చర్యలు.

! : ముద్దాయిలు సత్ప్రవర్తనతో మెలిగేలా యోగా, ధ్యానం, క్రమం తప్పకుండా వ్యాయామాలు చేయిస్తున్నాం. ఆధ్యాత్మిక గురువులతో ఉపన్యాసాలు ఇప్పిస్తున్నాం.

? : మహిళ ముద్దాయిలను ఉంచేందుకు ప్రత్యేక గదులున్నాయా.

! : మహిళా ముద్దాయిల కోసం ప్రత్యేక గది సదుపాయం ఉన్నప్పటికి మహిళ సిబ్బంది లేని కారణంగా వారిని నెల్లూరు కేంద్ర కారాగారానికి పంపిస్తున్నాం.

? : ముద్దాయికి న్యాయ సహాయం అందిస్తున్నారా.

! : ముద్దాయి ఆర్థిక స్థితిగతులను పరిగణనలోకి తీసుకొని న్యాయస్థానం సూచించిన లీగల్ ఎయిడ్ న్యాయవాదిని ఏర్పాటు చేస్తున్నాం. కేసు పరిష్కారం కోసం ప్రభుత్వ ఖర్చుతోనే న్యాయవాదిని నియమిస్తున్నాం.

? : ముద్దాయిని కుటుంబ సభ్యులు కలుసుకోవడాని షరతులున్నాయా.

! : ప్రతి రిమాండ్ ఖైదీనీ ఆదివారం, జైలు సెలవు దినాలలో తప్ప మిగిలిన అన్ని రోజుల్లో వారానికి రెండు సార్లు జైలు నిబంధనల ప్రకారం కుటుంబ సభ్యులు కలిసి మాట్లాడవచ్చు.

- కావలిరూరల్

భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతం

● కిటకిటలాడిన ఆలయాలు ● ఊరూ-వాడా వెల్లివిరిసిన ఆధ్యాత్మిక శోభ

కావలిటౌన్: వరలక్ష్మీ వ్రతాన్ని శుక్రవారం పట్టణంలో మహిళలు భక్తిశ్రద్ధలతో ఆచరించారు. పలు ఆలయాలో సామూహిక వ్రతంలో పాల్గొనేందుకు వచ్చిన మహిళలు, భక్తులతో కిటకిటలాడాయి. గ్రామదేవత కలుగోళ శాంభవి ఆలయంలో ఉదయం 9 గంటల నుంచి మహిళలు సామూహిక వరలక్ష్మీ వ్రతంలో పాల్గొన్నారు. ఆలయ ట్రస్టీ చైర్మన్ మురళీ, సభ్యులు సతీసమేతంగా పాల్గొన్నారు. బృందావనం కాలనీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో సామూహిక వరలక్ష్మీ వ్రతం జరిగింది. ఆలయ కమిటీ చైర్మన్ శ్రీరామ్ మాల్యాద్రి కార్యక్రమాలను పర్యవేక్షించారు. కొత్త బజారులోని కన్యాకాపరమేశ్వరి అమ్మవారు, వెంగళరావునగర్‌లోని అష్టలక్ష్మీ అమ్మవారి ఆలయాల్లో జరిగిన వరలక్ష్మీవ్రతంలో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. మహిళలు ఉదయాన్నే తల స్నానం చేసి పసుపు, కుంకుమ, తమలపాకులు, వక్కలు, టెంకాయలు, అరటిపండ్లు, పూలు, కలశం చెంబు, రవిక, నూనె, పచ్చి శెనగలు తదితర సామాగ్రితో ఆలయాలకు చేరుకొని సామూహిక వ్రతంలో పాల్గొన్నారు. శుక్రవారం పట్టణంఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది.

కొండాపురం: శ్రావణమాసం రెండో శుక్రవారం కావడంతో వరలక్ష్మీవ్రతాన్ని మండలంలోని మహిళలు భక్తిశ్రద్ధలతో ఆచరించారు. మహిళలు వేకవజామునే తల స్నానం చేసి నూతన వస్త్రాలు ధరించి లక్ష్మీదేవిని పూజించారు. నూరేళ్ళపాటు సమంగళిగా వర్థిల్లాలని ఉపవాసాలుండి అమ్మవారికి వేడుకున్నారు. సాయిపేట పంచాయతీ కొత్తపాలెం మహాలక్ష్మీ అమ్మవారి ఆలయంలో శ్రావణ శుక్రవారం సందర్భంగా మహిళలు విశేష పూజలు చేశారు.

అల్లూరు : శ్రావణ శుక్రవారం సందర్భంగా మండలంలోని అమ్మవార్ల ఆలయాల్లో విశేష పూజలు నిర్వహించారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అల్లూరులోని మహాలక్ష్మమ్మ, కన్యకాపరమేశ్వరి తదితర ఆలయాల్లో మహిళలు ముందుగా గోపూజ చేశారు. అనంతరం సామూహిక వ్రతంలో పాల్గొన్నారు. భక్తులకు ఆలయ అర్చకులు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

కలిగిరి: శ్రావణమాసం రెండో శుక్రవారం సందర్భంగా మండలంలోని పలు ఆలయాల్లో వరలక్ష్మీ వ్రతం ఆచరించారు. ఆలయాల వద్ద నిర్వాహుకులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. మహిళలు అధిక సంఖ్యలో ఆలయాలకు చేరుకొని సామూహిక వరలక్ష్మీ


కావలి బృందావనకాలనీ వేంకటేశ్వర ఆలయంలో వరలక్ష్మీ వ్రతం


కావలి రూరల్: తుమ్మలపెంటలో మహిళల సామూహిక వ్రతం

వ్రతంలో పాల్గొన్నారు. అనంతరం అర్చకులు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

కావలిరూరల్: కావలి రూరల్ మండల గ్రామాల్లోని ఆలయాల్లో శుక్రవారం సామూహిక వరలక్ష్మీ వ్రతం ఆచరించారు. శ్రావణ శుక్రవారం సందర్భంగా అమ్మవారి, శైవక్షేత్రాలు, వైష్ణవ ఆలయాలు పచ్చతోరణాలు, విద్యుత్ దీపాలతో ముస్తాబు చేశారు. అన్నగారిపాలెం పంచాయతీలోని ముందరపొట్టెమ్మ, గౌరవరంలోని పార్వతీసమేత పంచభూతేశ్వరస్వామి ఆలయాలలో విశేష పూజలు చేశారు. తుమ్మలపెంట పట్టపుపాలెంలోని రామాలయంలో సుమారు 200 మంది మత్స్యకార మహిళలు సామూహిక వరలక్ష్మీ వ్రతం ఆచరించారు. భక్తులతో ఆలయాలు కిటకిటలాడాయి. అర్చకులు తీర్థప్రసాదాలు అందజేశారు.

దగదర్తి: మండలంలోని శ్రావణశుక్రవారం సందర్భంగా మహిళలు వరలక్ష్మీవ్రతం ఆచరించారు. దగదర్తి పోలేరమ్మ, దుర్గా భవానిసమేత రామలింగేశ్వరస్వామి ఆలయాలు, కొత్తూరులోని రమణయ్యస్వామి స్వగృహంలో వరలక్ష్మీవ్రతం భక్తి శ్రద్ధలతో పూర్తిచేశారు. అనంతరం భక్తులకు అర్చకులు తీర్థప్రసాదాలు అందజేశారు.

బిట్రగుంట: బోగోలు మండలం బిలకూట క్షేత్ర ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం సామూహిక వరలక్ష్మీ వ్రతం నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకులు వేదగిరి వెంకట లక్ష్మీనరసింహాచార్యులు, కల్యాణాచార్యులు ప్రసన్నమూర్తి ఆధ్వర్యం వహించారు.. ఆలయ ట్రస్టుబోర్డు చైర్మన్ పాశం రవీంద్రబాబు, సభ్యురాలు రాములమ్మ అమ్మవారిని పూజించారు. బోగోలు గంగతిప్పపై వేంచేసిన గంగమ్మ ఆలయంలో జరిగిన వరలక్ష్మీ వ్రతంలో సర్పంచు దొడ్ల రమ్మణమ్మ, అంజయ్య యాదవ్ దంపతులు పాల్గొన్నారు. కోదండరామస్వామి ఆలయంలో వరలక్ష్మీ వ్రతం భక్తిశ్రద్ధలతో ఆచరించారు.


కొండాపురం మండలం సాయిపేటలో..


అల్లూరు కన్యకాపరమేశ్వరి ఆలయంలో..


బిట్రగుంట : కొండబిట్రగుంట ప్రసన్నుడి ఆలయంలో..

ఆర్యవైశ్యులకూ కార్పొరేషన్ ప్రకటన అభినందనీయం

కావలి: వైసీపీ అధికారంలోకి వస్తే ఆర్యవైశ్యులకు కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామని ఆ పార్టీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి నంద్యాలలో ప్రకటించడం అభినందనీయమని ఆ పార్టీ ఫ్లోర్‌లీడర్ కనమర్లపూడి వెంకటనారాయణ పేర్కొన్నారు. కావలి కట్‌పీసెస్ క్లాత్‌మర్చంట్ అసోసియేషన్ కల్యాణమండపంలో శుక్రవారం ఆయన ఆధ్వర్యంలో కొందరు ఆర్యవైశ్యులు సమావేశమై ఆర్యవైశ్య కార్పొరేషన్ ఏర్పాటుపై జగన్ ప్రకటనకు అభినందనలు తెలిపారు. రాజకీయాలకు అతీతంగా ఈ సమావేశం ఏర్పాటు చేశామని నిర్వాహకులు చెప్పినా అక్కడ వైసీపీ మద్దతుదారులు మాత్రమే కనిపించారు. సమావేశంలో నారాయణ మాట్లాడుతూ ఆర్యవైశ్యులు అంటే కుబేరులన్న భావన సమాజంలో ఉందని ఇది నిజం కాదని ఆర్యవైశ్యులలోనూ ఎంతో మంది నిరుపేదలున్నారన్నారు. వారిని ఆర్థికంగా ఆదుకునేందుకు ఇతర కులాలకు ఏవిధంగా కార్పొరేషన్ ఏర్పాటు చేశారో అలాగే ఆర్యవైశ్య పేద కుటుంబాలను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. నేటి వరకూ పాలించిన ప్రభుత్వాలు ఆర్యవైశ్యులకు ఒరగబెట్టిందేమీ లేదని వైసీపీ అధినేత జగన్ అధికారంలోకి వస్తే కార్పొరేషన్ ఏర్పాటు చేస్తారని చెప్పడం హర్షణీయమన్నారు. కార్పొరేషన్ ఏర్పాటు చేస్తే ఆర్యవైశ్య కుటుంబాలు ఆయనకు అండగా ఉంటాయన్నారు. మరొక వైశ్య ప్రముఖుడు తన్నీరు మాల్యాద్రి మాట్లాడుతూ ఆర్యవైశ్యుల్లోనూ పేదవారు ఉన్నారని ప్రభుత్వం వారిని ఆదుకొనేందుకు కార్పొషన్ ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో పాల్గొన్న చెక్కా సుబ్బారావు, చెన్నా సత్యనారాయణ, అమరా సుబ్బారావు, అనుమలశెట్టి శివ తదితరులు జగన్ చేసిన ప్రకటనను స్వాగతిస్తున్నామన్నారు. రాజకీయాలకు అతీతంగా జగన్‌కు ఆర్యవైశ్యులు అభినందనలు తెలిపేందుకు ఏర్పాటు చేసిన సమావేశానికి టీడీపీ ఆర్యవైశ్య నాయకులకుగాని, ఆ పార్టీ అభిమానులుగాని హాజరు కాకపోవడం కొసమెరుపు.


సమావేశంలో మాట్లాడుతున్న కేవీ నారాయణ

నాల్గో తరగతి ఉద్యోగుల సర్వీసు 62 ఏళ్లకు పెంచాలి

కావలి: నాల్గో తరగతి ప్రభుత్వ ఉద్యోగుల సర్వీసు కాలాన్ని 62 ఏళ్లకు పెంచాలని ఆ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు బాల చంద్రరావు కోరారు. కావలి పింఛనర్ల అసోసియేషన్ భవనంలో శుక్రవారం నాల్గో తరగతి ఉద్యోగుల సంఘం సమావేశం జరిగింది. ఈ సమావేశంలో అసోసియేషన్ కావలి శాఖ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎన్‌జీవో కావలి శాఖ అధ్యక్షుడు శివకుమార్, పింఛనర్ల అసోసియేషన్ నాయకులు వీ రమణయ్య, వీ రోశయ్య, తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం

అసోసియేషన్ అధ్యక్షుడిగా కే లక్ష్మయ్య, ప్రధాన కార్యదర్శిగా ఎం సుబ్బారెడ్డి, ఉపాధ్యక్షుడిగా జీ ఏసుపాదం, వీ మాలకొండయ్య, బీ శ్రీనాధ్‌రెడ్డి, కార్యదర్శిగా కే మాల్యాద్రి, ప్రచార కార్యదర్శి షేక్ రషీద్, కోశాధికారిగా ఎం వెంకయ్య, వీ చంద్రశేఖర్, ఏ పుష్పలత, గౌరవాధ్యక్షుడిగా షేక్ బాష ఎంపికయ్యారు.

సినిమాగైడ్

కావలి

మానస :	నక్షత్రం
లత ఏ/సీ :	వార్‌ఫర్‌ది ప్లానెట్ ఆఫ్‌ది ఏప్స్
స్రవంతి:	దర్శకుడు
ఎస్వీ వెంకటేశ్వర	ఫిదా

మొక్కలతోనే ఆరోగ్యం

తోటపల్లిగూడూరు : మొక్కలు పెంచితే వాతావరణ కాలుష్యాన్ని నివారణ, సంపూర్ణ ఆరోగ్యం లభిస్తాయని వెలుగు ఏరియా కోఆర్డినేటర్ శ్రీనివాసులు పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని ఇస్కపాళెం నుంచి పాపిరెడ్డిపాళెం గ్రామం వరకు మొక్కల పెంపకం కార్యక్రమాన్ని ఆయన చేపట్టారు.

నేడు ఆక్వా రైతులకు సాగు పత్రాల పంపిణీ

కావలిరూరల్: కావలి రూరల్ మండల పరిధిలోని ఆక్వా రైతులకు శనివారం సాయంత్రం మూడు గంటలకు ఎంపీడీవో కార్యాలయంలో మత్స్యశాఖ ఆధ్వర్యంలో సాగు పత్రాలు అందజేయనున్నట్లు మత్స్యకార నాయకులు తెలిపారు. ఆక్వా రైతులకు సాగు ధ్రువీకరణలు, బోట్ల డ్రైవర్లకు లైసెన్స్ ట్రైనింగ్ సర్టిఫికెట్లను సీఆర్‌డీఏ సభ్యుడు బీద మస్తాన్‌రావు ద్వారా అందజేస్తామని కావలి మండల ఆ క్వాఫార్మర్స్ అసోసియేషన్ నాయకులు తెలిపారు. అర్హులు తప్పక ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారన్నారు.

పెచ్చులూడిన విద్యుత్ స్తంభాలు


పెచ్చులూడిన స్తంభం

కొండాపురం: మండలంలోని రేణమా ల గ్రామంలో విద్యుత్ స్తంభాలు పెచ్చులూడి ప్రమాదకరంగా తయారయ్యాయ ని గ్రామస్థులు ఆందోళన చెందుతున్నా రు. కొద్దిరోజులుగా అవి గాలికి ఊగుతూ ఎప్పుడు కూలుతాయో తెలియని దుస్థితి ఉన్నప్పటికీ విద్యుత్ శాఖ అధికారులు ప ట్టించుకోలేదని వారు ఆరోపిస్తున్నారు. సాయిపేట పంచాయతీ మక్కెనవారిపాలెం గ్రామంలో స్తంభాలు ఒరిగి తీగలు వేలాడుతున్నాయని గ్రామస్థులు విద్యుత్‌శాఖ అధికారులకు తెలిపారు. నెలరోజులయినా ఆ శాఖ అధికారుల నుంచి స్పందన లేదని వారు విమర్శిస్తున్నారు. మండల పరిధిలోని ప లుగ్రామాలలో విద్యుత్ సమస్యలు ఉన్నప్పటికీ పరిష్కరించడంలో ఆ శాఖ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ప్రజలు ఫిర్యాదు చేస్తున్నారు.

పెద్దారంలో తాగునీటి కష్టాలు


పైపులైన్ లీకేజీతో వృథా అవుతున్న నీరు

కావలిరూరల్: కావలి రూరల్ మండలం చలంచర్ల పంచాయతీలోని పెద్దారంలో 150 కుటుంబాలుంటున్నాయి. వర్షాభావంతో బావులు అడుగంటాయి. చేతిపంపులకు నీరందడంలేదు. ఎస్టీ కాలనీలో బోరు నుంచి గ్రామానికి డైరెక్ట్ పంపింగ్ ద్వారా తాగునీరు సరఫరా చేస్తారు. కాలనీలో వాల్వ్ పైపుల లీకేజీతో నీరు వృథాగా పోతోంది. ఈ విషయాన్ని అనేకమార్లు సర్పంచుకి, కార్యదర్శికి విన్నవించినా పట్టించుకోలేదని కాలనీ వాసులు అంటున్నారు. ఉన్నతాధికారులైనా స్పందించి సమస్య వెంటనే పరిష్కరించాలని వారు కోరుతున్నారు.

పగలే వెన్నెల


నిరంతరం వెలిగే వీధిదీపం

కావలిరూరల్: కావలిరూరల్ మండలం కొనదిన్నె, ఆముదాలదిన్నె గ్రామాల్లో వీధిదీపాలు పగలు, రాత్రి తేడా లేకుండా నిరంతరం వెలుగుతున్నాయి. ప్రభుత్వం పొదుపు మంత్రం జపిస్తుంటే స్థానిక అధికారులు మాత్రం పగలే వెన్నెలగా వ్యవహరిస్తున్నారు. దీంతో పంచాయతీలకు బిల్లుల మోత, బల్బుల కాలపరిమితి తగ్గిపోవడం జరుగుతూ ఉంది. అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి పగటి పూట వీధిదీపాలు వెలగకుండా చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

జనం జగన్‌ను ఉరి తీస్తారు : టీడీపీ


జగన్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న తెలుగు తమ్ముళ్లు

బిట్రగుంట: పలు కేసుల్లో నిందితుడైన వైసీపీ అధినేత జగన్మోహన్‌రెడ్డి కడప ఫ్యాక్షనిజాన్ని గుర్తు చేస్తూ నంద్యాలలో సీఎం చంద్రబాబుపై చేసిన వ్యాఖ్యలు సరికాదని, మరల అలాగే మాట్లాడితే జనం అతడిని ఉరి తీస్తారని మండల యువత అధ్యక్షుడు పైడి హర్ష, కావలి ఏఎంసీ డైరెక్టర్ ఎస్‌కె మన్నన్ బాష పేర్కొన్నారు. బోగోలు బజారు కూడలిలో శుక్రవారం జగన్ వ్యాఖ్యలను ఖండిస్తు జగన్ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ అవినీతి బురద చల్లి ఐఏఎస్ అధికారులు, మంత్రులను జైలుకు పంపిన ఘనత ఆ తండ్రి కొడుకులకే దక్కుతుందని, రాష్ట్ర అభివృద్ధికి పాటుపడుతున్న సీఎం చంద్రబాబును కాల్చి చంపినా పాపం లేదు అనడం జగన్‌లోని ఫ్యాక్షనిజానికి బహిర్గతం చేసిందన్నారు. నోరు అదుపులో పెట్టుకొని మాట్లాడితే జనం మనిషిలా చూస్తారని, లేదంటే ఉరితీస్తారని వారన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మాలెపాటి నాగేశ్వరావు, పాశం రవీంద్రబాబు, సాతుపాటి ఉదయకుమార్, దేవరకొండ భాస్కర్, కడియాల చినగోవిందు, సమీవుల్లా, రమణయ్య, కాంద్ర వెంకటరమణయ్య, తదితరులు పాల్గొన్నారు.

అప్రజాస్వామికం

కలిగిరి: ప్రతిపక్షనాయకుడు జగన్‌మోహన్‌రెడ్డి సీఎం చంద్రబాబుపై చేసిన వ్యాఖ్యలు అప్రజాస్వామికమని టీడీపీ కలిగిరి మండల నాయకులు పేర్కొన్నారు. ప్రతిపక్షనాయకుడంటే రాష్ట్రాభివృద్ధికి దోహదపడాలని అలాకాకుండా ఒక ఫ్యాక్షనిస్టులా సీఎం స్థాయి వ్యక్తిని కాల్చి చంపుతాననడం ఆయన నైజాన్ని బహిర్గతం చేస్తోందన్నారు. ఎన్నికల సమయంలో అభివృద్ధి చూపుతామని ఓట్లడగాలి కాని అడ్డొచ్చినవారిని కాల్చిచంపుతామని, నరికి పాతేస్తామని ప్రజల్లోకి పోతే వారే తగిన గుణపాఠం చెబుతారన్నారు.

ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు చీమల తాతయ్య, బిజ్జం వెంకటకృష్ణారెడ్డి, ఊసా మధు, గంగవరపు మధన్‌కుమార్, మాలెపాటి వెంకట సుబ్బయ్య పాల్గొన్నారు.

వీఆర్వోలపై పోలీసు చర్య అనైతికం

కలిగిరి: పసుపు కొనుగోళ్ల విషయంలో విచారణ పేరుతో పోలీసులు వీఆర్వోలపై తీసుకుంటున్న చర్యలు అనైతికంగా ఉన్నాయని కలిగిరి మండల వీఆర్వోలు ధ్వజమెత్తారు. స్థానిక తహసీల్దారు కార్యాలయం వద్ద శుక్రవారం వారు మాట్లాడుతూ వీఆర్వోలు కూడా ప్రభుత్వ ఉద్యోగులేనన్న విషయాన్ని మరిచి స్టేషన్లలో పోలీసులు వీఆర్వోలపై ప్రవర్తిస్తున్న తీరు బాధాకరం అన్నారు. కేసు విషయంలో విచారణకు వీఆర్వోలు సహకరిస్తున్నా, వారిని దోషులుగా పరిగణించడాన్ని ఖండిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎం హజరత్తయ్య, సయ్యద్ గులాం, కే మాల్యాద్రి, జీ ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

వెంటనే పక్కా ఇళ్లు నిర్మించుకోవాలి

కొండాపురం: పక్కా ఇళ్లు మంజూరైన లబ్ధిదారులు వెంటనే ఇళ్లు నిర్మించుకోవాలని తహసీల్దార్ ప్రమీల తెలిపారు. ఇళ్ల మంజూరు కోసం శుక్రవారం సత్యవోలు పంచాయతీలో గ్రామసభ నిర్వహించారు. తహసీల్దారు మాట్లాడుతూ గ్రామంలో 133 మంది గతంలో పక్కా ఇల్లు కావాలని దరఖాస్తు చేసుకోగా అందులో 73 మందిని అర్హులుగా గుర్తించామన్నారు. ఇళ్లు కావాలని నూతనంగా మరో 15 మంది దరఖాస్తు చేసుకున్నారన్నారు. నేకునాంపేటలో ఇన్‌చార్జి ఎంపీడీవో గోపీనాథ్, వ్యవసాయ అధికారిణి సుధారాణి గొట్టిగుండాలపాలెం గ్రామంలో సభ నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో సత్యవోలు సర్పంచు జీ. మాలకొండయ్య, మాజీ సర్పంచు గద్దె రాఘయ్య, పంచాయతీ కార్యదర్శి సమీర్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు వరం వైద్య శిబిరాలు

కొండాపురం: వైద్య శిబిరాలు పేదలకు వరమని జన్మభూమి కమిటీ సభ్యుడు వల్లూరు వెంకటేశ్వర్లు అన్నారు. నారాయణ హాస్పిటల్ నెల్లూరు వారు శుక్రవారం మండలంలోని సాయిపేట పంచాయతీ కార్యాలయం వద్ద వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ పేదలకు ఉచితంగా వైద్యసేవలు అందిస్తున్న ఆసుపత్రి యాజమాన్యాన్ని అభినందించారు. శిబిరంలో 150 మందిని వైద్యులు పరీక్షించారు. 70 మందికి శస్త్ర చికిత్స అవసరమని నిర్ధారించారు, వీరిని శనివారం ఆసుపత్రికి తీసుకెళతామని వైద్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆప్తాల్మజిస్ట్ నికిల్, ఆర్థోపెడిక్ సర్జన్ రాజేశ్వరి, జనరల్ సర్జన్ ఎలిజబెత్, జనరల్ వైద్యుడు హనీష, పీఆర్‌వో శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాలు బిడ్డకు ఎంతో శ్రేష్ఠం

కొండాపురం: తల్లిపాలు బిడ్డకు ఎంతో శ్రేష్ఠమని ఐసీడీఎస్ సీడీపీవో విజయలక్ష్మీ అన్నారు. తల్లిపాల వారోత్సవాలలో భాగంగా శుక్రవారం మండలంలోని కొమ్మి పంచాయతీ అంగన్‌వాడీ కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. చిన్నారులకు తల్లిపాల అవసరంపై తల్లులకు అవగాహన కల్పించారు. తల్లిపాలలో ఉండే విటమిన్లు చిన్నారిని పలురకాల వ్యాధుల నుంచి రక్షిస్తాయన్నారు. గ్రామంలోని పలువురు గర్భిణులకు సీమంతం చేశారు. మండలంలో 64 అంగన్‌వాడీ కేంద్రాలలో సగం కేంద్రాలలో తల్లిపాల వారోత్సవాలు జరుగపోవడం ఆ శాఖ పనితీరును ప్రశ్నిస్తోంది.

ఎరువుల పంపిణీపై డీలర్లకు శిక్షణ

కావలిరూరల్: కావలి సబ్‌డివిజన్ పరిధిలోని ఎరువుల డీలర్లకు శుక్రవారం పట్టణంలోని పింఛనుదారుల అసోసియేషన్ భవనంలో ఎరువుల పంపిణీపై శిక్షణ ఇచ్చారు. కావలి సహాయ వ్యవసాయ సంచాలకుడి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఏడీఏలు కన్నయ్య, వీ సుమలత, రాష్ట్ర డీబీటీ సాంకేతిక నిపుణులు ఆర్ రాజవర్ధన్, పీ వేణుగోపాల్ పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ రైతులకు కేంద్ర ప్రభుత్వం రాయితీపై సరఫరా చేస్తున్న రసాయనిక ఎరువులు ఇకపై ఈ-పాస్ యంత్రం ద్వారా మాత్రమే అందజేస్తారన్నారు. రైతులు తమ ఆధార్ నెంబర్‌ను డీలరు వద్ద నమోదు చేసుకొని అవసరమైన ఎరువులు పరిమితి లేకుండా కొనుగోలు చేయవచ్చన్నారు. జిల్లాలో 638 ఎరువుల దుకాణాల్లో ఇప్పటి వరకు 528 దుకాణాలకు ఈ-పాస్ యంత్రాల ద్వారా పంపిణీ చేస్తున్నారన్నారు. వీటిన్నింటిలో ఈ నెల 15వ తేదీ లోపు డీలరు వద్ద ఉన్న స్టాకును తప్పని సరిగా సంబంధిత మండల వ్యవసాయ అధికారి సూచనల ప్రకారం నమోదు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారులు, ఏఈవోలు, ఎంపీఈవోలు, కావలి, బోగోలు, అల్లూరు, దగదర్తి మండలాల డీలర్లు పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం


చికిత్స పొందుతున్న శ్రీకాంత్

కావలి(క్రైం): కావలిమద్దూరుపాడులో శుక్రవారం పుట్టంశెట్టి శ్రీ కాంత్ ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. అతడు ఉరి వేసుకోవడాన్ని గమనించిన కుటుంబసభ్యులు ఉరిని తప్పించి 108 వాహనంలో కావలి ఏరియా వైద్యశాలకు తరలించారు. స్థానికంగా హోటల్‌లో పనిచేసే శ్రీకాంత్ కుటుంబ కలహాలు, అప్పుల బాధతో ఆత్మహత్యకు య త్నించినట్లు స్థానికులు తెలిపారు. బాధితుడి తరపు బంధువులు ఏరియా వైద్యశాల ఆవరణలో బార్య శ్రీలక్ష్మిపై దాడి చేశారు.

చినుకుపడితే చిత్తడే..


రైల్వేరోడ్డులో సీసీ రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు

కావలి: కావలిలో కోట్లాది రూపాయలతో సీసీ రోడ్లు, డ్రైనేజీ కాలువులు నిర్మించారు. అయినప్పటికీ చినుకుపడితే సీసీ రోడ్లపై వర్షపునీరు రోజుల తరబడి నిల్వ ఉండిపోతోంది. పట్టణ శివారు ప్రాంతాల్లోని కచ్చా రోడ్లు చినుకుపడితే చెరువును తలపిస్తున్నాయి. మరికొన్ని చోట్ల రోడ్లకు ఇరువైపుల స్థానికులు ఎత్తుగా మట్టిని తోలుకోవడంతో రోడ్డుపై పడ్డ నీరు కాలువల్లోకి వెళ్లకుండా రోడ్డుపైనే ఉంటుంది. మున్సిపల్ అధికారులు అభివృద్ధి పనులు చేపట్టేటప్పుడు చూపించే శ్రద్ధ వాటి నిర్వహణలో చూపడంలేదు. సీసీ రోడ్డు నిర్మించేప్పుడు సైడు కాలువలు మరిచారు. రైల్వే రోడ్డులో లోకల్ లైబ్రెరీ సమీపంలో రోడ్డుపై వర్షపునీరు రోజుల తరబడి నిలబడి పోతోంది. సినిమా హాలు రోడ్డులో పెదపవని బస్టాండు, లత హాలు ఎదురుగా ఇదే దుస్థితి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రోడ్లపై నీరు నిల్వ చేరకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.


సినిమాహాలు రోడ్డుపై వర్షపు మడుగు



ప్రభుత్వ భూమిలో సాగు చేసిన జామాయిల్ చెట్లు

ప్రభుత్వ భూమేగా..
వేసేయ్ పాగా!

- మనుబోలు మండలంలో కబ్జాదారులు
- ఐదు వేల ఎకరాలకుపైగా ఆక్రమణ
- రాజకీయ నాయకుల అండదండలు
- పట్టించుకోని ప్రభుత్వ యంత్రాంగం

మనుబోలు : మండలంలో కబ్జాదారులు పేట్రేగిపోతున్నారు. ప్రభుత్వ భూమి ఎక్కడున్నా జెండా పాతేస్తున్నారు. మనుబోలు మండలంలో 18 రెవెన్యూ గ్రామాలు ఉండగా 20 మీడియం, 12 మైనర్ చెరువులు ఉన్నాయి. ప్రతి రెవెన్యూ గ్రామంలో చెరువు పోరంబోకు, కాలువ పోరంబోకు, గ్రామ పోరంబోకు స్థలాలు ఉంటాయి. ఇవి కాక ప్రభుత్వ స్థలాలు ఎంతోకొంత ఉండనే ఉంటాయి. వీటితోపాటు కొండూరు సత్రం వద్ద దేవాదాయశాఖకు చెందిన 20ఎకరాల వరకు సత్రం భూములు ఉన్నాయి. మనుబోలు నుంచి గురవిందపూడి వరకు జాతీయరహదారి పక్కనే అక్కడక్కడా ప్రభుత్వ భూములు ఉన్నాయి. ఈ భూములపై కబ్జారాయులు కన్నేసి తమ కబంధ హస్తాల్లో బందించేశారు. మనుబోలు నుంచి గురవిందపూడి వరకు ఉన్న ప్రభుత్వ, దేవాదాయ భూములు 50 శాతం వరకు ఆక్రమణకు గురయ్యాయి. సాగు చేస్తున్న భూములలో ఇవి ప్రభుత్వ భూములని బోర్డులు పెట్టి అధికారులు చేతులు దులుపుకుంటున్నారే తప్ప ఆక్రమణల సాగును తొలగించడం లేదు. ఇక గ్రామీణ ప్రాంతాల్లో ఏకంగా చెరువులను, కాలువలను ఆక్రమించేశారు. పలుకుబడి కలిగిన రైతులు పెద్దల అండ చూసుకుని పోరంబోకు భూములను పక్కనే ఉన్న పట్టా భూముల్లోకి హద్దులు ఏర్పాటు చేసుకుని తమదేనని ఆక్రమించేస్తున్నారు. కొలనుకుదురు గ్రామ సర్వే నెంబరు 521-సిలో 2500ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. ఇందులో వంద నుంచి 200ఎకరాల లోపే సైనికులకు, పేదలకు ప్రభుత్వం పంపిణీ చేసింది. మిగిలిన భూమినంతా సమీప గ్రామస్థులు, ఇతర జిల్లాల వాసులు,రాజకీయ నాయకులు, వ్యాపారవేత్తలు, సంస్థలు రొయ్యలు గుంతలు చేసి ఆక్వాసాగు చేస్తున్నారు.

సర్వేలు, బోర్డులతోనే సరి..

రెవెన్యూ గ్రామాల్లో ప్రభుత్వ భూములు ఎంత మేర ఉన్నాయి, వాటిలో మిగులు భూములు ఎంత, ఎన్ని ఎకరాలు పేదలకు పంచారు, ఇతర భూముల స్వభావం తెలపాలని గతంలో మండల అధికారులను జిల్లా ఉన్నతాధికారులు ఆదేశించారు. ఇందుకోసం సర్వేలు చేసి, ప్రభుత్వ భూములు గుర్తించి బోర్డులు పెట్టాలని సూచించారు. అప్పట్లో ఉన్న తహసీల్దారు, వీఆర్వోలు, సర్వేయర్లు కొలనుకుదురులోని 521-సిలో ఉన్న 2500ఎకరాల ప్రభుత్వ భూములు సర్వే పేరుతో వారాల తరబడి క్షేత్ర పరిశీలన చేశారే తప్ప ఒక్క ఎకరా కూడా ఆక్రమణ తొలగించ లేదు. అలాగే మనుబోలు, బండేపల్లి గ్రామాల్లోని ప్రభుత్వ భూములను గుర్తించి నాలుగు చోట్ల బోర్డులు పెట్టి చేతులు దులుపుకున్నారు.

ఆక్రమణలు ఇలా..

● మనుబోలులోని సర్వే నెం.31-3లో 2ఎకరాల 05 సెంట్ల ప్రభుత్వ భూమిలో మనుబోలుకు చెందిన ఓ వ్యక్తి ఓ ఆశ్రమం పేరుతో ఆక్రమించి గుడిసెలు వేశాడు. ఇది తెలిసినా అధికారులు మిద్దెలు, మేడలు కట్టలేదు కదా అని ఊరుకున్నారు. కొద్దిరోజులకు అదే స్థలంలో మరో రెండు నిర్మాణాలు చేపట్టాడు. జాతీయరహదారి పక్కనే లక్షల రూపాయలు విలువ చేసే స్థలాన్ని ఆక్రమించినా అధికారులు పట్టించుకోలేదు. ఇదే స్థలంలో డంపింగ్ యార్డు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఇక్క ఆశ్రమం ఉండటంతో ఆక్రమణలు తొలగించలేక అధికారులు మరోచోట డంపింగ్ యార్డుకు స్థలం కేటాయించారు.



కాలువ పక్కన ఆక్రమణలు

● మనుబోలులోని సర్వే నెం 1-3(ఏ) 2ఎకరాల05 సెంట్లు, 26-1(ఏ)లో 4ఎకరాల 48సెంట్లు ప్రభుత్వ భూమి ఉంది. ఈ భూమిలో అధికారులు గుర్తించి బోర్డులు పెట్టేనాటికే ఆక్రమణదారులు జామాయిల్ సాగు చేస్తున్నారు. అధికారులు బోర్డులు పెట్టి మమ అనిపించారే తప్ప ఇప్పటివరకు ఆక్రమణదారుడిని అక్కడి నుంచి పంపలేదు.

● కొమ్మలపూడిలోని సర్వే నెం1, 6 తదితర నెంబర్లలో 50ఎకరాల ప్రభుత్వ భూమిని 4 దశాబ్దాల క్రితం కొమ్మలపూడి గిరిజనులకు పంపిణీ చేశారు. 2010లో అప్పటి కలెక్టర్, జేసీలు గిరిజనుల నుంచి ఆ భూమిని స్వాధీనం చేసుకున్నారు. ఇప్పటికీ గిరిజనులకు ప్రత్యామ్నాయ భూములు చూపలేదు. అయితే ఆ భూమిలో కొంత ఆక్రమణకు గురైంది.

● సర్వే నెం.359లో ప్రభుత్వ భూమి వివాదంలో ఉంది. దీని కోసం దళితులు, గిరిజనులు పలు దఫాలుగా రెవెన్యూ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ఈ క్రమంలో వివాదంలో ఉన్న భూమి పక్కనే ఉన్న నెల్లూరుకు చెందిన పట్టాదారుడు, ఓ వ్యాపార వేత్త కొంత భూమిని ఆక్రమించి సాగు చేసుకుంటున్నాడు.

● బండేపల్లిలోని సర్వే నెం.592లో 9ఎకరాలకుపైగా ప్రభుత్వ భూమి ఉంది. ఇక్కడ జా మాయిల్ సాగు చేస్తుండటంతో తహసీల్దార్ వెంకటనారాయణమ్మ గుర్తించి బోర్డు పెట్టారు. కొద్ది రోజులకే ఆ బోర్డును తొలగించారు.

● బండేపల్లిలోనే చెరువు స్థలం ఆక్రమణలకు గురైంది. ఓ ప్రభుత్వ ఉద్యోగి తనదని, మరో ప్రైవేటు వ్యక్తి తనకు హక్కు ఉందంటూ చెరువు స్థలం కోసం కోర్టుల చుట్టూ తిరుగుతున్నారు. ఆక్రమణకు గురైన చెరువులకు, ప్రభుత్వ స్థలాలకు ఎక్కడా కంచె ఏర్పాటు చేయడం లేదా సర్వే చేయడం జరగలేదు.

ఆక్రమణలపై చర్యలు తీసుకుంటాం



చాలా చోట్ల ప్రభుత్వ భూములు ఆక్రమణలు చేసి ఉన్నారని నా దృష్టికి వచ్చింది. ప్రస్తుతం ల్యాండ్ ప్యూరిఫికేషన్ పనుల్లో బిజీగా ఉన్నాం. ఇవి పూర్తయిన తరువాత పూర్తి స్థాయిలో ఆక్రమణల వివరాలు తెలుస్తాయి. తరువాత సిబ్బందిచే విచారణ చేయించి ఆక్రమణదారులను తొలగిస్తాం.

- లీలారాణి, తహసీల్దార్

ఇలా చెప్పుకుంటూ పోతే ప్రతి గ్రామంలో 50 నుంచి 100ఎకరాల వరకు ప్రభుత్వ, పోరంబోకు, గ్రామకంఠం భూములు కబ్జారాయుళ్ల చెరలో ఉన్నాయి. గడిచిన మూడేళ్లుగా 7వ విడత భూ పంపిణీ జరగనేలేదు. దీంతో పేదలు జీవనోపాధి కోసం చెరువులు, కాలువల పక్కన దొరికనచోటల్లా రాళ్ళు నాటుకుని సాగు చేసుకుంటున్నారు. దీంతోపాటు పెద్దలు ప్రభుత్వ స్థలాలను కాజేస్తున్నారు.ఇలా చేయడంతో ప్రభుత్వ భవనాలు, నిర్మాణాలకు స్థలం లేక ఏళ్లతరబడి ప్రతిపాదనలు ఆగిపోతున్నాయి. సరిపడినంత స్థలం లేకనే మనుబోలు మినీ స్టేడియం, ఇళ్ళ స్థలాల పంపిణీ జరగనేలేదు.

పసుపు సూత్రదారుల కోసం గాలింపు

- నేతలపై క్రిమినల్ కేసులు ● అజ్ఞాతంలో నేతలు
- అరెస్టు చేసేందుకు పోలీసుల యత్నం
- బృందాలుగా విడిపోయి పోలీసుల గాలింపు

ఉదయగిరి: ఉదయగిరి పసుపు దందాలో క్రిమినల్ కేసులు నమోదైన నేతల కోసం పోలీసులు ముమ్మరంగా గాలింపు చర్యలు చేపడుతున్నారు. ఈ దందాలో 40 మందికిపైగా వేటుపడిన సంగతి అందరికి తెలిసిందే. ఇందులో కాంగ్రెస్, టీడీపీ, వైసీపీ నాయకులు సూత్రధారులు కాగా అధికారులు పాత్రధారులుగా ఉన్నారు. వీరందరూ కలిసి రూ.14 కోట్లకు పైగా తిన్నారన్న ఆరోపణలు వెల్లువెత్తాయి.

స్టేట్‌మెంట్లు రికార్డు: పసుపు దందాలో సస్పెండ్ అయిన ఉద్యోగుల నుంచి పోలీసులు గత రెండు రోజులుగా విచారించి స్టేట్‌మెంట్లు రికార్డు చేస్తున్నారు. వీరిపై కేసులు నమోదు చేసేందుకు పోలీసులు కసరత్తు ప్రారంభించారు. మార్క్‌ఫెడ్ మేనేజర్ రమాదేవితోపాటు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి మోహన్, మరో నలుగురు సిబ్బందిని విచారించారు. ఉదయగిరి మండలం కృష్ణంపల్లి వీఆర్వో రవీంద్రబాబు, శకునాలపల్లి వీఆర్వో డి.కేశవరావు, జీ.అయ్యవారిపల్లి వీఆర్వో దయానందం, ఉదయగిరి-1 వీఆర్వో నాగరాజు, జీ.అయ్యవారిపల్లి-1 వీఆర్వో షేక్ ఖాజావలిలను విచారించి స్టేట్‌మెంట్లు రికార్డు చేశారు. అలాగే సస్పెండ్‌కు గురైన వరికుంటపాడు మండలం విరువూరు వీఆర్వో లక్ష్మినారాయణ, జడదేవి వీఆర్వో కె.వెంగయ్య, కాంచెరువు వీఆర్వో జాఫర్‌సాహెబ్, దుత్తలూరు మండలం కొత్తపేట వీఆర్వో సుధాకర్, దుత్తలూరు వీఆర్వో డి.మనోహర్‌కుమార్, సీతారామపురం మండలం అయ్యవారిపల్లి వెంకటేశ్వర్లు, గుండుపల్లి వీఆర్వో బాబురావు, సీతారామపురం-2 వీఆర్వో ఖాజామొహీద్దీన్, బసినేనిపల్లి వీఆర్వో డి.రాజశేఖర్‌రెడ్డి, సీతారామపురం వీఆర్వో వెంకటరత్నం, మర్రిపాడు మండలం చిలకపాడు వీఆర్వో డి.చిన్నయ్య, పడమటినాయుడుపల్లి వీఆర్వో షేక్ మాలకొండయ్య, ఆత్మకూరు మండలం మహిమలూరు వీఆర్వో కృష్ణయ్య, వింజమూరు-2 వీఆర్వో పరిశుద్ధరావులను పోలీసులు విచారించనున్నారు. అలాగే క్వాలిటీ కంట్రోల్ అధికారులను సైతం పోలీసులు విచారించేందుకు సమాయత్తమవుతున్నారు.

సూత్రధారుల కోసం గాలింపు: పసుపు దందాలో సూత్రధారులుగా వ్యవహరించిన 17 మంది టీడీపీ, వైసీపీ, కాంగ్రెస్ నేతలపై క్రిమినల్ కేసుల నమోదయ్యాయి. వారిని రెండు రోజుల్లో అరెస్టు చేయాలని జిల్లా ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు అందడంతో సమాచారం తెలుసుకొన్న తెలుసుకొన్న సూత్రధారులు అజ్ఞాతంలోకి జారుకొన్నారు. వీరు పసుపు దందా విషయంలో నుంచి బయట వేయాలని నేతలపై తీవ్ర వత్తిడి తెస్తూ విశ్వప్రయత్నాలు సాగిస్తున్నట్లు సమాచారం. అయితే అరెస్టుకు గడువు దగ్గర పడుతుండడంతో వరికుంటపాడు, దుత్తలూరు, ఉదయగిరి పోలీసులు బృందాలుగా ఏర్పడి హైదరాబాదు, అమరావతి తదితర ప్రాంతాల్లో గాలిస్తూ వారి సమాచారం సేకరించేందుకు ప్రయత్నాలు సాగిస్తున్నారు.

పోలీసుల అదుపులో కాంగ్రెస్ నేత: పసుపు కుంభకోణం కేసులో ఉదయగిరి మండలానికి చెందిన కాంగ్రెస్ నేత పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. పోలీసుల విచారణలో పలువురి కొత్త పేర్లు వెలుగులోకి వచ్చినట్లు సమాచారం. వీరిపై ఒకట్రెండు రోజుల్లో కేసులు నమోదు చేసే అవకాశాలున్నట్లు సమాచారం. దీంతో ప్రమేయం ఉన్న పలువురు వ్యక్తులు తమను ఎక్కడ అరెస్టు చేస్తారన్న భయంతో హడలిపోతున్నారు. పసుపు క్వాలిటీ కంట్రోల్‌కు చెందిన మరో ఐదుగురిని పోలీసులు విచారించేందుకు అదుపులోకి తీసుకొన్నట్లు సమాచారం.

గిరిజన మహిళ అనుమానాస్పద మృతి



మృతదేహం వద్ద విలపిస్తున్న భర్త, సోదరి

జలదంకి: జలదంకి మండలం రామవరప్పాడులో గిరిజన మహిళ పోట్లూరు అలివేలు(30) అనుమానాస్పదంగా మృతి చెందిన ఘటన గురువారం రాత్రి జరిగింది. గురువారం భర్త కృష్ణ కావలికి పనినిమిత్తం వెళ్లడంతో ఆమె మేకలను మేతకు పొలాల్లోకి తోలుకువెళ్లింది. పొలంలో అదే గ్రామానికి చెందిన నీలం సుజాత తన భర్తతో అక్రమసంభందం పెట్టుకుందనే అనుమానంతో అలివేలుపై నానాదుర్భాషలాడి దాడిచేసింది. అంతటితో ఆగక సాయంత్రం అలివేలు ఇంటికి వెళ్లి భర్త కృష్ణతో నా భర్తతో నీ భార్య అక్రమ సంభందం నెరపుతోందని, తగదని హెచ్చరించి వెళ్లింది. మేకలు తోలుకుని వచ్చిన అలివేలు భర్త ఎదుట కన్నీటి పర్వంతమై జరిగిన ఘటనను వివరించింది. భర్త కృష్ణ గ్రామంలో బంధువులకు ఈ విషయాన్ని చెప్పేందుకు వెళ్లి ఇంటికి తిరిగి వచ్చే చూస్తే భార్య మృతదేహం కనిపించింది. అలివేలు మృతివెనుక కారణాలు తెలియరాలేదు. సోలీసులు శుక్రవారం మృతదేహాన్ని పరిశీలించి భర్త కృష్ణ నుంచి ఫిర్యాదు తీసుకున్నారు. అనంతరం అలివేలు మృతదేహాన్ని కావలి ఏరియా వైద్యశాలకు తరలించారు.

రేపు జూనియర్ సివిల్ జడ్జిల
నమూనా పరీక్ష

నెల్లూరు (లీగల్) : త్వరలో జరగనున్న జూనియర్ సివిల్ జడ్జిల నియామక పరీక్షకు హాజరవుతున్న న్యాయవాదుల కోసం ఆదివారం నమూనా పరీక్ష జరగనుంది. ఆలిండియా లాయర్స్ యూనియన్ (ఐలు) ఆధ్వర్యంలో ఉదయం 10 గంటలకు నెల్లూరులోని సర్వోదయ కళాశాలలో ఈ పరీక్ష నిర్వహిస్తున్నట్లు ఐలు జిల్లా ప్రధాన కార్యదర్శి అంకయ్య ఓ ప్రకటనలో పేర్కొన్నారు. నమూనా పరీక్షకు హాజరు కావాలనుకునే వారు ముందుగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

7 నుంచి
పోలీసు అభ్యర్థులకు శిక్షణ

నెల్లూరు (క్రైం) : పోలీసు కానిస్టేబుల్ నియామకాలు - 2017 బ్యాచ్ భర్తీకి సంబంధించి జిల్లాకు ఎంపికైన 243 సివిల్, 39 ఏఆర్ అభ్యర్థులకు ఈనెల 7వతేదీ నుంచి శిక్షణ ప్రారంభిస్తున్నట్లు ఎస్పీ పీహెచ్‌డీ రామకృష్ణ ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపికైన అభ్యర్థులలో సివిల్, ఏఆర్ పురుష అభ్యర్థులు ఈనెల 5వతేదీ మధ్యాహ్నం ఒంటి గంటకు నెల్లూరులోని పోలీసు కవాతు మైదానంలో హాజరు కావాలన్నారు. మహిళా అభ్యర్థులు 6వతేదీ ఉదయం 8 గంటలకు అదే మైదానంలో హాజరు కావాలని సూచించారు. అభ్యర్థులందరూ పోలీసు యూనిఫాం, కిట్ ఆర్టికల్స్ తీసుకునేందుకు సంబంధిత తేదీలలో తప్పక హాజరు కావాలన్నారు. అలాగే అభ్యర్థులంతా శిక్షణ కేంద్రంలో మెస్ చార్జీల నిమిత్తం రూ. 4వేలు, పాస్ పోర్టు సైజు ఫొటోలు, ఒక బకెట్, తల దిండు, పూర్తి లగేజీతో తరలిరావాలన్నారు. తొమ్మిది నెలలు ట్రైనింగ్ పూర్తి చేసుకునేందుకు సంసిద్ధమై హాజరు కావాలని సూచించారు.

బ్యాంకింగ్‌పై అవగాహన కల్పించడమే ఆర్థిక అక్షరాస్యత

వావిలాల రవిశంకర్, కౌన్సిలర్, జ్ఞానజ్యోతి ఆర్థిక అక్షరాస్యత కేంద్రం



? ఆర్థిక అక్షరాస్యత అంటే ఏమిటి.

! ప్రజలందరికీ, ముఖ్యంగా సమాజంలో అట్టడుగున ఉన్న వారికి బ్యాంకుల సేవలపై అవగాహన కల్పించడమే ఆర్థిక అక్షరాస్యత. పొదుపు పెట్టుబడుల, నగదు రహిత లావాదేవీలపై ప్రజలకు అవగాహన కల్పించడం జరుగుతుంది. రుణాలను సకాలంలో తిరిగి బ్యాంకులకు చెల్లించడం వలన కలిగే లాభాలను వివరిస్తారు.

? ఆర్థిక అక్షరాస్యత కేంద్రాల పాత్ర ఏమిటి.

! భారతీయ రిజర్వు బ్యాంకు ఆదేశానుసారం ప్రతి బ్యాంకు ఆర్థిక అక్షరాస్యత ట్రస్ట్‌లను నెలకొల్పింది. ఈ కేంద్రాల ద్వారా గ్రామ స్థాయి, బ్లాక్ స్థాయి, పట్టణ స్థాయిలో ఆర్థిక అక్షరాస్యత కార్యక్రమాలు చేపట్టి ప్రజలకు అవగాహన కల్పించడం జరుగుతుంది. లబ్ధిదారులు ఏవిధమైన రుణం కోరుకుంటున్నారో తెలుసుకుని వారి అవసరాలకు అనుగుణంగా ప్రభుత్వం విడుదల చేస్తున్న పథకాలను వివరించడం జరుగుతుంది.

? జిల్లాలో ఆర్థిక అక్షరాస్యత కేంద్రం ఎప్పుడు ఏర్పడింది.

!. ఆర్థిక అక్షరాస్యత కేంద్రం జిల్లాలో 2011లో ఎస్సీ కార్పొరేషన్ వింగ్‌లో ఏర్పడింది. లీడ్ బ్యాంక్ అయిన సిండికేట్ బ్యాంకుకు అనుసంధానంగా దీనిని ఏర్పాటు చేయడం జరిగింది. ఎప్పటికప్పుడు వస్తున్న బ్యాంకుల సమాచారాన్ని లీడ్ బ్యాంక్ ద్వారా తీసుకుని ప్రజలకు వివరిస్తారు.

- నెల్లూరు (వేదాయపాళెం)

జనం లేక వెలవెల



ప్రజలు లేక వెలవెలబోతున్న రిజిస్ట్రార్ కార్యాలయం

- ● బోసిపోయిన రిజిస్ట్రేషన్ కార్యాలయాలు
- ● విలువల పెంపే కారణం
- ● లక్ష్యాలు నెరవేరేనా ?

నెల్లూరు(కలెక్టరేట్): భూములు, స్థలాల మార్కెట్ విలువల పెంపుతో జిల్లాలో రిజిస్ట్రేషన్‌లు చేయించుకొనేవారు కరువయ్యారు. దీంతో రిజిస్ట్రేషన్ కార్యాలయాలు వెలవెలబోతున్నాయి. ఈ క్రమంలో ఆ శాఖ లక్ష్యాలు నెరవేరేనా..? అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

● విలువల పెంపుతో ఇబ్బందులు

ఈ నెల ఒకటో తేదీ నుంచి పెరిగిన భూములు, స్థలాలు, అపార్టుమెంట్ల మార్కెట్ విలువలు అమలులోకి వచ్చాయి. మొదలే రిజిస్ట్రేన్‌లు జరక్క ఇబ్బందులు ఎదుర్కొంటున్న జిల్లా రిజిస్ట్రేషన్ శాఖకు మార్కెట్ విలువల పెంపుతో ఇబ్బందికర పరిస్థితులు ఏర్పడ్డాయి. దస్తా వేజుల రిజిస్ట్రేషన్‌లు చేయించుకొనే వారు లేక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు వెలవెల బోతున్నాయి. జిల్లా రియల్ వ్యాపారం పూర్తిగా దెబ్బతినింది. ఇళ్ల స్థలాలను వ్యవసాయ భూములుగా మార్చి సాగు చేసుకొంటున్నారు. 2008-09, 2011-12 సంవత్సరాలలో తప్ప మిగిలిన సంవత్సరాలలో రిజిస్ట్రేషన్ శాఖ నిర్ధేశిత లక్ష్యాలను అధిగమించలేక పోయింది. ఇందుకు కారణం రియల్ ఎస్టేట్ వ్యాపారం పూర్తిగా పడిపోవటమే.

● తగ్గుతున్న లక్ష్యాలు

2016-17లో జిల్లాకు రిజిస్ట్రేషన్ శాఖ రూ. 280.32 కోట్ల లక్ష్యాన్ని నిర్దేశించింది. అయితే జిల్లాలోని ఈ శాఖ రూ.185.71 కోట్ల లక్ష్యాన్ని మాత్రమే అధిగమించింది. ఆ సంవత్సరం లక్ష్య సాధన 87.44 శాతంగా ఉంది. దీంతో రిజిస్ట్రేషన్ శాఖ 2017-18లో 230.17 శాతం లక్ష్యాన్ని నిర్ధేశించింది. 2016-17తో పోలిస్తే రూ. 50 కోట్ల లక్ష్యాన్ని తగ్గించింది. లక్ష్యాన్ని తగ్గించినా ఇచ్చిన లక్ష్యాన్ని పూర్తి చేయలేని స్థితిలో ఆ శాఖ ఉంది.

లక్ష్యాలు అధిగమించే ప్రయత్నం



జిల్లాలో రియల్ ఎస్టేట్ వ్యాపారం మందకొడిగా ఉంది. అయినా రిజిస్ట్రేషన్ శాఖ నిర్ధేశించిన లక్ష్యాలను అధిగమించే ప్రయత్నం చేస్తున్నాం.

- జగన్మోహన్‌రావు, సబ్‌రిజిస్ట్రార్

ఆ ఇంజనీర్లు ఎవరు...?

● ఉన్నతాధికారుల ఆరా ● ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

నెల్లూరు (వ్యవసాయం) : పంచాయతీరాజ్, జలవనరులశాఖల్లో అవినీతికి పాల్పడుతూ కమీషన్ సొమ్మును బంధువుల ఖాతాలకు మళ్లించే ఆ.. ఇంజనీర్లు ఎవరని ఆ శాఖల ఉన్నతాధికారులు ఆరా తీస్తున్నారు. మండలాల వారీగా ఏఈ, డీఈల ప్రవర్తనను రహస్యంగా గమనిస్తున్న అధికారులు జరుగుతున్న పనులు, బిల్లుల చెల్లింపుల్లో వారి వ్యవహార శైలిపై దృష్టిసారించారు. మరోపక్క ఏసీబీ అధికారులు సైతం లోతైన ఆధారాల కోసం ఇంజనీర్లపై కన్నేసినట్లు సమాచారం. జలవనరులశాఖ, పంచాయతీరాజ్‌లలో ఇంజనీర్లు కమీషన్ సొమ్ము కోసం బంధువుల బ్యాంకు ఖాతాలను వినియోగిస్తున్నారంటూ గురువారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన పరిశోధనాత్మక కథనం అవినీతి పరులైన ఇంజనీర్లలో గుబులు రేపింది. ఈ అంశంపై కలెక్టర్ ముత్యాలరాజు కూడా శాఖాధిపతులపై ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది.

ఇరిగేషన్‌లో ఆ.. ఏఈపై ఆరా..?:

జలవనరులశాఖ నెల్లూరు సబ్‌డివిజన్‌లో ఏఈగా పనిచేస్తున్న వ్యక్తి పనుల నిర్వహణ, బిల్లులు చెల్లింపుల్లో ఏకంగా 28 శాతం కమీషన్ తీసుకోవడంపై జిల్లా ఉన్నతాధికారులు ఆరా తీస్తున్నారు. ఆయనకు సహకరిస్తున్న రాజకీయ నేతలెవరు....? చేయూతనిస్తున్న మాజీ మంత్రి ఎవరని ఆరా తీస్తున్నట్లు సమాచారం. ఇప్పటివరకు ఆయన గుత్తేదారుల వద్ద ఎంతెంత వసూళ్లు చేశారని కొందరు అధికారులు నివేదిక సిద్ధం చేస్తున్నట్లు సమాచారం. అటు ఏసీబీ అధికారులు సైతం ఆ ఏఈపై నిఘా ఉంచినట్లు తెలుస్తోంది.

9న రాజీవ్ జ్యోతి సద్భావనా యాత్ర

నెల్లూరు (సిటీ) : మాజీ ప్రధాని స్వర్గీయ రాజీవ్‌గాంధీ జ్యోతి సద్భావనా యాత్ర ఈ నెల 9న నెల్లూరులో జరుగుతుందని డీసీసీ అధ్యక్షుడు పనబాక కృష్ణయ్య తెలిపారు. ఇందిరాభవన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీని 1991 మే 21న తమిళనాడులోని శ్రీపెరంబదూర్‌లో హత్య చేసిన విషయం అందరికీ తెలిసిందేనన్నారు. అప్పటి నుంచి ప్రతి ఏడాది దేశ సమగ్రత, శాంతి సందేశంతో రాజీవ్ జ్యోతి సద్భావనా యాత్ర శ్రీపెరంబదూర్ నుంచి 150 మంది కాంగ్రెస్ శ్రేణులతో ప్రారంభమై దేశమంతా తిరిగి ఢిల్లీకి చేరుతోందన్నారు. ఇందులో భాగంగా ఈనెల 9న శ్రీపెరంబదూర్‌లో ప్రారంభమయ్యే రాజీవ్ జ్యోతి యాత్ర ఆ రోజు ఉదయం 11గంటలకు సూళ్లూరుపేట, 12గంటలకు నాయుడుపేట, 2.30గంటలకు గూడూరు చేరుకుని మధ్యాహ్నం 3.30గంటలకు నెల్లూరు నగరానికి వస్తుందన్నారు. ఆ యాత్రకు కాంగ్రెస్ శ్రేణులు ఘన స్వాగతం పలకాలని పిలుపునిచ్చారు. నెల్లూరు నుంచి యాత్ర ఒంగోలుకు వెళుతుందని చెప్పారు. ఈ సమావేశంలో పీసీసీ నాయకులు సీవీ శేషారెడ్డి, చేవూరు దేవకుమార్‌రెడ్డి, చెంచలబాబు యాదవ్, నగర అధ్యక్షుడు ఉడతా వెంకట్రావు యాదవ్, నాయకులు పత్తి సీతారాం బాబు, రఘురాం ముదిరాజ్, భవానీ నాగేంద్ర ప్రసాద్, అనురాధ రెడ్డి, లతారెడ్డి, శివాచారి, బాలసుధాకర్, ఫయాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక కట్టడికి కఠిన చర్యలు : ఎస్పీ

తడ: ఇసుకను అక్రమంగా తరలిపోకుండా కఠిన చర్యలు తీసుకుంటున్నామని ఎస్పీ రామకృష్ణ వెల్లడించారు. శుక్రవారం తడ పోలీస్‌స్టేషన్‌ను ఆకస్మిక తనిఖీ చేసి రాష్ట్ర సరిహద్దును పరిశీలించారు. భీములవారిపాళెం చెక్‌పోస్టు రవాణా కార్యాలయాన్ని, ఇసుక చెక్‌పోస్టును తనిఖీ చేశారు. విలేఖర్లతో మాట్లాడుతూ ఇసుక అక్రమ రవాణా గతంలో కంటే ఇప్పుడు చాలా వరకు తగ్గిపోయిందన్నారు. జూలైలో జిల్లా వ్యాప్తంగా 22 కేసులు నమోదయ్యాయన్నారు. అక్రమార్కులు ఇకనైనా ఈ రవాణాను నిలుపుకోవాలని హెచ్చరించారు. 1,460 వాహనాలకు సరైన పత్రాలు లేకుండా అనుమతులు లేకున్న ఉండటంతో వాటిని సీజ్ చేశామని తెలిపారు. అలాగే రహదారి భద్రత కోసం 15 బృందాలను నియమించామని చెప్పారు. సరాసరిన నెలకు 50 మంది ప్రమాదాలలో మృతి చెందేవారని తమ బృందాలు నిత్యం చేస్తున్న తనిఖీల వల్ల గత నెలలో 28 మంది మాత్రమే ప్రమాదాల్లో చనిపోయారని చెప్పారు. ప్రజల పట్ల పోలీసులు స్నేహపూర్వకంగా ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని ఆయన తెలిపారు. సూళ్లూరుపేట సీఐ కిషోర్‌బాబు, ఎస్ఐ సురేష్‌బాబు, తదితరులు ఉన్నారు.




మాట్లాడుతున్న ఎస్పీ రామకృష్ణ

ఇరిగేషన్ ఎస్ఈకి 'సోమశిల' బాధ్యతలు

- ● టీజీపీ ఎస్ఈకి ఒంగోలు ఇరిగేషన్ బాధ్యతలు
- ● బాధ్యతల నుంచి శారద తొలగింపు

నెల్లూరు (వ్యవసాయం) : జలవనరులశాఖతో పాటు తెలుగు గంగ ప్రాజెక్టులో ఉన్నతాధికారులను మార్చుతూ ఆ శాఖ రాష్ట్ర ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఒంగోలు జలవనరులశాఖ ఎస్ఈగా పనిచేస్తున్న శారదకు నెల్లూరు సోమశిల ప్రాజెక్టు ఎస్ఈ బాధ్యతలను అదనంగా అప్పగించిన విషయం తెలిసిందే. ఆమెపై అవినీతి ఆరోపణలు రావడంతో ఒంగోలు జలవనరులశాఖ ఎస్ఈగా బాధ్యతల నుంచి తప్పించారు. ఒంగోలు ఎస్ఈ బాధ్యతల నుంచి తప్పించడంతో సోమశిల బాధ్యతల నుంచి కూడా ఆమెను తప్పించినట్లయింది. ఈ నేపథ్యంలో ఒంగోలు జలవనరుల శాఖ ఎస్ఈగా టీజీపీకి ఎస్ఈగా వ్యవహరిస్తున్న నెల్లూరు ఈఈ వెంకటరమణకు, సోమశిల ప్రాజెక్టు బాధ్యతలను ప్రస్తుతం జిల్లా జలవనరులశాఖ ఇన్‌చార్జి ఎస్ఈగా పని చేస్తున్న బీవీఎస్ ప్రసాద్‌కు అప్పగించారు.



నాడు నకిలీ మద్యం..
నేడు క్రికెట్ బుకీ

● బెట్టింగ్‌లలో వైసీపీ నేతలే ఎక్కువ

● ఎమ్మెల్యే అనుచరులుగా చెలామణి

నెల్లూరు, (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : పోలీసులు అరెస్టు చేసిన క్రికెట్ బుకీలలో వైసీపీకి చెందిన వారే అధికంగా ఉన్నారు. 2014లో జరిగిన సార్వత్రిక ఎన్నికలలో గెలుపుపై ఎంతో ధీమాతో ఉన్న వైసీపీ నేతలు మద్యంతో ఓట్లు కొల్లగొట్టాలని ప్రయత్నించారు. గోవా నుంచి నకిలీ మద్యం తాగిన ఓటర్లు అస్వస్థతకు గురికావడం, ఒకరిద్దరు మృత్యువాత పడ్డారు. దీనిపై గవర్నర్ విచారణకు ఆదేశించి ఆ మద్యాన్ని సీజ్ చేశారు. అనంతరం టీడీపీ ప్రభుత్వం ఆ నకిలీ మద్యం కేసులను సీఐడీకి అప్పగించగా, విచారణలో సర్వేపల్లి ఎమ్మెల్యే కాకాణి గోవర్ధన్‌రెడ్డి, కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డిలు ప్రధాన నిందితులుగా పేర్కొంటూ కేసులు నమోదు చేశారు. ప్రస్తుతం ఈ కేసులపై చార్జిషీట్‌లు వేసి కోర్టుకు సమర్పించారు. ఇది మరువక ముందే జిల్లాలో క్రికెట్ బెట్టింగ్‌లు, పేకాటలపై పోలీసులు దాడులు నిర్వహించారు. నెల రోజులుగా పోలీసులు జరిపిన దాడుల్లో 115 మందిని అరెస్టు చేశారు. వీరిలో జాతీయ బుకీలుగా తొమ్మిది మంది, సహాయ బుకీలుగా 21 మంది, మరో 85 మందిని ఫైనాన్షియర్లు, ఆటగాళ్లుగా పేర్కొంటూ కేసులు నమోదు చేసి గురువారం అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు. గత పదేళ్లుగా జిల్లాలో క్రికెట్ బెట్టింగ్‌లు, పేకాటలు జోరుగా సాగుతూ వచ్చేవి. బుకీలు ఆర్థికంగా బలపడగా, బెట్టింగ్ రాయుళ్లు చితికిపోయారు. ఎన్నో కుటుంబాలు రోడ్డున పడి చివరకు ఆత్మహత్య చేసుకునే పరిస్థితులు నెలకొన్నాయి. గత నెలలో ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన పీహెచ్‌డీ రామకృష్ణ ఈ బెట్టింగ్‌లపై ఉక్కుపాదం మోపుతూ దాడులు నిర్వహించిన సంగతి తెలిసిందే. అరెస్టయిన బుకీలు, బెట్టింగ్ రాయుళ్లలో అత్యధికులు వైసీపీ నాయకులే ఉండటం విశేషం. ఇలాంటి బెట్టింగ్‌లలో పాల్గొంటున్న నేతలు అత్యధికంగా వైసీపీ వారే ఉండటంతో రాజకీయ వర్గాల్లో కలకలం మొదలైంది.

● వీరే కీలకం..

గురువారం అరెస్టు చేసిన జాతీయ బుకీలలో ప్రధాన పాత్ర కృష్ణసింగ్, ఎస్‌కే షంషేర్‌లు ఉన్నారు. వీరు వైసీపీ నేతలతో ఎంతో సన్నిహితంగా మెలుగుతుంటారు. ఏదైన అవసరమైతే వైసీపీ నేతలే సహాయ సహకారాలు అందిస్తున్నట్లు పోలీసు విచారణలో వెల్లడైంది.



మన్నం శ్యాంప్రసాద్



అనిల్‌కుమార్‌రెడ్డి

సూళ్లూరుపేట వైసీపీ నేత అల్లూరు అనిల్‌కుమార్ రెడ్డి వైసీపీ ఎమ్మెల్యేకు అత్యంత సన్నిహితంగా ఉంటూ ఆ నియోజకవర్గంలో జరిగే పార్టీ కార్యక్రమాలకు ఆర్థిక సహాయం చేస్తూ వస్తున్నారు. ఇటీవల జగన్‌ను కలిసిన ఆయన నియోజకవర్గానికి పెద్ద దిక్కుగా వ్యవహరిస్తున్నారని చెప్పుకున్నట్లు సమాచారం. నెల్లూరులో కాపురం ఉన్నా సూళ్లూరుపేట వైసీపీ రాజకీయాల్లో అన్నీ తానై వ్యవహరిస్తూ ఆ పార్టీ నేతల కనుసన్నల్లోనే మెలుగుతుంటారు. పొదలకూరుకు చెందిన మన్నెం శ్యాంప్రసాద్ ప్రకాశం జిల్లాలోని ఓ వైసీపీ నేతకు ముఖ్య అనుచరుడిగా ఉంటున్నారు. పొదలకూరులో జరిగే వైసీపీ కార్యక్రమాలకు ఆర్థిక సహకారం అందిస్తూ వైసీపీ ఎమ్మెల్యేతో సఖ్యతగా ఉంటారని పోలీసులు పేర్కొంటున్నారు. కిన్నెర రమేష్‌కుమార్, ఉటుకూరు వెంకట రమేష్, నంద్యాల అరుణ్‌కుమార్, దాసరి సుశాంత్ తదితరులు వైసీపీ నేతలతోనే సన్నిహిత సంబంధాలు కొనసాగిస్తున్నారు. కావలికి చెందిన గుర్రం వెంకటేశ్వర్లు ఓ టీడీపీ నేతకు దగ్గరగా ఉంటారని ప్రచారం జరుగుతోంది. సబ్ బుకీలలో అరెస్టయిన వారిలో లేబూరు శ్రీధర్‌రెడ్డి (ఎల్‌ఎస్‌ఆర్) అందరివాడుగా క్రికెట్ బెట్టింగ్‌లలో కీలకంగా వ్యవహరిస్తున్నట్లు ప్రచారం సాగుతోంది. నెల్లూరులోని తుంగా ఇంధూదర్‌రెడ్డి, నాగూరు నాగార్జున రెడ్డి, ఆనందకుమార్, పోలుబోయిన రూప్‌కుమార్‌యాదవ్, గడ్డం సునీల్‌కుమార్‌రెడ్డి, మావిళ్లపాటి రవికుమార్ కూడా వైసీపీలో కీలక వ్యక్తులుగా చెలామణి అవుతున్నారు. పోలీసులు అరెస్టు చేసిన వారు, పరారీలో ఉన్న వారిని పరిగణలోకి తీసుకుంటే 90 శాతం వైసీపీ నేతలు కాగా, పది శాతం టీడీపీ నాయకులు ఉన్నట్లు పోలీసు వర్గాలు పేర్కొంటున్నాయి. ప్రశాంతమైన జిల్లాలో ఇలాంటి బెట్టింగ్‌లు, పేకాటలు ఇకనైనా ప్రోత్సహించకుండా అన్ని పార్టీలు సహకరించాలని ప్రజలు కోరుతున్నారు.

అవినీతి అధికారుల జాబితా సిద్ధం!

● మొదట సొంత శాఖపైనే ఎస్పీ దృష్టి ● పూర్తి వివరాలు డీజీ, ఐజీకి అందజేత

నెల్లూరు (ఆంధ్రజ్యోతి) : జిల్లా ఎస్పీగా పీహెచ్‌డీ రామకృష్ణ బాధ్యతలు చేపట్టిన నెల రోజులకే ఇద్దరు డీఎస్పీలు, ఇద్దరు సీఐలపై వేటు పడింది. మున్ముందు ఎలా ఉండబోతుందో? ఇంకెంత మంది ఎర్రచందనం, ఇసుక, బెట్టింగ్, అక్రమ రవాణా.. తదితర వాటిపై అన్ని వర్గాల నుంచి ప్రభుత్వానికి ఫిర్యాదులు గంపగుత్తగా వెళ్లాయి. ఇదే సమయంలో ఇంటెలిజెన్స్ కూడా జిల్లాలో పరిస్థితులు బాగోలేవని నివేదిక సమర్పించినట్లు తెలిసింది. వీటన్నిటిని దృష్టిలో పెట్టుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్వయంగా జోక్యం చేసుకొని ఎస్పీగా పీహెచ్‌డీ రామకృష్ణను నియమించినట్లు పోలీసు ఉన్నతాధికారులు చెబుతున్నారు. కాగా, జిల్లాలో అడుగుపెట్టకముందే జిల్లా పరిస్థితిని పూర్తిగా తెలుసుకున్న ఆయన ఇక్కడకు వచ్చిన వెంటనే తన ప్రణాళికను అమలు చేయడం ప్రారంభించారు. అందులో భాగమే బెట్టింగ్ ముఠా గుట్టురట్టు. ఈ కేసులో సంబంధం ఉన్న సొంత శాఖ అధికారులపైనే పూర్తిస్థాయిలో విచారణ జరిపి ఆ వివరాలను రాష్ట్ర ఉన్నతాధికారులకు అందజేశారు. మిగిలిన మాఫియాలపై కూడా ఇదే తరహాలో వ్యవహరిస్తున్నట్లు తెలిసింది. బెట్టింగ్‌కు సంబంధించిన వివరాలను డీజీ, ఐజీలకు వివరించేందుకు విజయవాడకు వెళ్లిన ఆయన ఆ సమయంలో తాను సేకరించిన వివరాలను వారికి సమర్పించారు. ఈ నివేదికలో బెట్టింగ్‌తో సంబంధం ఉన్న పోలీసు సిబ్బందితోపాటు ఎర్రచందనం, ఇసుక మాఫియా వంటి వాటి లో కీలక పాత్ర పోషించిన వారి పేర్లను కూడా అందజేసినట్లు తెలిసింది.

● మరో ఆరుగురు సీఐలు?

ఎర్ర చందనం, ఇసుక మాఫియా, బెట్టింగ్ ముఠాలతో చేతులు కలిపిన వారందరిని ఎస్పీ గుర్తించడం ప్రారంభించారు. అత్యంత రహస్యంగా సేకరించిన వివరాలను ఆయనే స్వయంగా జాబితా తయారు చేశారు. ఇందులో 8 మంది సీఐల పేర్లు ఉన్నట్లు విశ్వసనీయ సమాచారం. ఇప్పటికే బెట్టింగ్ మాఫియాతో సంబంధం ఉన్న ఇద్దరు సీఐలు వీఆర్‌కు బదిలీ అయ్యారు. అలానే నెల్లూరుకు చెందిన మరో ఇద్దరు సీఐలు కూడా జాబితాలో ఉన్నట్లు తెలిసింది. కాగా ఇసుక, ఎర్రచందనం మాఫియాలో భాగస్వాములైన వారిపై వేటు పడాల్సి ఉందన్న ప్రచారం జరుగుతోంది. వీరిలో ప్రస్తుతం లా అండ్ ఆర్డర్‌లో ఉన్నవారు, వీఆర్‌లో ఉన్నవారు ఉన్నట్లు సమాచారం. ప్రస్తుతం గూడూరు సబ్ డివిజన్‌లో పనిచేస్తూ ఎర్రచందనం ఎక్కువగా లభ్యమయ్యే ప్రాంతంలో పనిచేస్తున్న సీఐ కూడా తెలిసింది. అలానే ఇదే సబ్‌డివిజన్‌లో పని చేస్తున్న మరో సీఐ అవినీతి వ్యవహారాలు కూడా ఎస్పీ దృష్టికి వచ్చినట్లు సమాచారం. ఇక గూడూరు సబ్ డివిజన్‌లో ప్రస్తుతం వీఆర్‌లో ఉన్న ఓ సీఐ కూడా ఎస్పీ జాబితాలో ఉన్నట్లుగా సమాచారం. ఈయన గత డీఎస్పీకి అత్యంత సన్నిహితుడిగా ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. అదే విధంగా ఉదయగిరి నియోజకవర్గంలో గతంలో పని చేసిన ఓ సీఐ ఎర్రచందనం అవినీతి వ్యవహారాలను కూడా ఎస్పీ గుర్తించినట్లు సమాచారం. వీరితో పాటు స్పెషల్ బ్రాంచిలో పనిచేస్తున్న ముగ్గురు ఏఎస్ఐల కూడా ఎర్రచందనం, బెట్టింగ్, ఇసుక మాఫియాలతో చేతులు కలిపినట్లు పేర్కొంటూ ఆధారాలతో సహా డీజీ, ఐజీలకు నివేదికలను అందజేసినట్లుగా విశ్వసనీయ సమాచారం. రెండో దశలో వీరందరిపై చర్యలు ఉండే అవకాశం ఉన్నట్లు పోలీసు శాఖలో ప్రచారం జరుగుతోంది.

● జీడీల జాబితా కూడా సిద్ధం?

జనరల్ డ్యూటీ (జీడీ)లు అంటే వసూలు చేసుకొచ్చే వ్యక్తులు అన్న విధంగా పోలీసు శాఖలో మారిపోయారన్న విమర్శలు ఉన్నాయి. ఆయా డీఎస్పీ నుంచి ఎస్ఐ వరకు అందరికీ వీరే అన్నీ చూసుకుంటారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.నగరానికి చెందిన ఓ పోలీసు ఉన్నతాధికారి వద్ద జీడీగా పనిచేస్తున్న ఓ వ్యక్తి ఆ అధికారికి అన్నీ చక్కదిద్దారని తెలుస్తోంది. బెట్టింగ్ కేసులో ఈ జీడీని కూడా ఎస్పీ విచారించినట్లు సమాచారం. అలానే గతంలో ఇదే స్థాయి అధికారుల వద్ద జీడీగా పనిచేసి ప్రస్తుతం సీసీఎస్‌లో ఉన్న మరో వ్యక్తి కూడా ఆ అధికారికి అనధికార జీడీగా వ్యవహరించేవారన్న విమర్శలున్నాయి. క్రికెట్ బెట్టింగ్ కేసులో ఇతడిని విచారించడానికి ఎస్పీ సిద్ధమవగా ఆయన పరారీలో ఉన్నట్లు తెలుస్తోంది. ఇలా జిల్లావ్యాప్తంగా జీడీలపై అవినీతి ఆరోపణలు వెల్లువెత్తడంతో ఎస్పీ రామకృష్ణ.. ఈ జాబితాను కూడా సిద్ధం చేసినట్లు సమాచారం. ఎవరైతే చర్యలు తీసుకునే స్థాయిలో అవినీతికి పాల్పడ్డారో వారందరి పేర్లను ఇప్పటికే గుర్తించినట్లు తెలిసింది. మాఫియాలతో సంబంధాలున్న సిబ్బంది వివరాలను కూడా ఎస్పీ తేల్చినట్లు సమాచారం. వీరందరిపై చర్యలు తీసుకునే అధికారం ఎస్పీ స్థాయిలోనే ఉండడంతో ఈ జాబితాను ఉన్నతాధికారులకు అందజేయలేదని తెలిసింది. అయితే త్వరలోనే వీరందరిపై వేటు వేసి పోలీసు శాఖను గాడిలో పెట్టేందుకు ఎస్పీ సిద్ధమవుతున్నట్లు సమాచారం.

డబ్బు కొట్టు..
పోస్టు పట్టు!

● అంగడి సరుకులా షిఫ్ట్ ఆపరేటర్ పోస్టులు

● ఒక్కో ఉద్యోగానికి రూ.5 లక్షల వరకు డిమాండ్

నెల్లూరు, (ఆంధ్రజ్యోతి) :

"నా చేతిలో డబ్బు పెట్టు.. నీ చేతిలో ఉద్యోగం పెడతా.." ఇదీ ప్రస్తుతం విద్యుత్ ఉపకేంద్రాల్లో షిఫ్ట్ ఆపరేటర్ల పోస్టుల భర్తీలో సాగుతున్న దందా. ఒక్కో ఉద్యోగం రేటు రూ.3లక్షల నుంచి రూ.5 లక్షల వరకు పలుకుతోంది. ఇందులో కొందరు ఎమ్మెల్యేలు, వారి ప్రధాన అనుచరులు, పలువురు అధికారులు పాత్రధారులుగా ఉన్నారు. దీంతో అర్హత ఉన్నా పేదలకు అన్యాయం జరుగుతోంది.



మనుబోలు మండలం కట్టువపల్లిలో కొత్తగా నిర్మిస్తున్న విద్యుత్ సబ్ స్టేషన్

● ఐదు స్టేషన్ల నిర్మాణం

ప్రస్తుతం జిల్లాలో ఐదు 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌ల నిర్మాణం జరుగుతోంది. కావలి, గూడూరు, మనుబోలు మండలం కట్టువపల్లి, చుట్టుగుంటపాలెం, దగదర్తిలో జరుగుతున్న ఈ నిర్మాణాలు పూర్తి కావచ్చాయి. మరో 9 సబ్ స్టేషన్‌ల నిర్మాణాలకు ప్రతిపాదనలు పంపారు. ఉన్నతాధికారుల ఆమోదం లభించిన వెంటనే ఈ నిర్మాణాలు కూడా ప్రారంభమవుతాయి. కాగా ఒక్కో సబ్‌స్టేషన్‌లో విద్యుత్ సరఫరాను నియంత్రించడానికి షిఫ్ట్ ఆపరేటర్లు ఉండాలి. ఒక్కొక్కరు 8గంటల చొప్పున విధులు నిర్వహిస్తారు. అంటే రోజుకు ముగ్గురవుతారు. మరొకరిని అదనంగా నియమిస్తారు. అంటే ఒక్కో సబ్ స్టేషన్‌కు నలుగురు షిఫ్ట్ ఆపరేటర్లు అవసరమవుతారు. వీరితో పాటు ఒక్కో స్టేషన్‌కు ఒక వాచ్‌మన్‌ను కూడా నియమిస్తారు. అంటే ఇప్పుడు ఐదు సబ్‌స్టేషన్‌లలో కలిపి మొత్తం 20 మంది షిఫ్ట్ ఆపరేటర్లను, ఐదుగురు వాచ్‌మెన్‌లను నియమించాల్సి ఉంది.

● అర్హులని కాదని..

ఈ పోస్టులను విద్యుత్ ఉన్నతాధికారుల పర్యవేక్షణలో భర్తీ చేయాల్సి ఉంది. ఐటీఐ ఎలక్ట్రికల్ చదివిన వారు మాత్రమే ఇందుకు అర్హులు. ముందుగా దరఖాస్తులు ఆహ్వానించి వారిని అన్ని రకాలుగా పరీక్షించి అర్హులను నియమించుకోవాలి. కానీ ప్రస్తుతం ఎక్కడా అలా జరగడం లేదు. అధికారులు భర్తీ చేయాల్సిన పోస్టులు కాస్తా అధికార పార్టీ నాయకుల చేతుల్లోకి వెళ్లిపోయాయి. ఆయా పరిధిలోని సబ్‌స్టేషన్‌లో షిఫ్ట్ ఆపరేటర్ల పోస్టులు భర్తీ చేయాలంటే అందుకు ఆయా ఎమ్మెల్యే, ఇన్‌చార్జి లేక వారి అనుచరుల అనుమతులు తప్పనిసరిగా మారింది. ఈ నేపథ్యంలో కొన్ని చోట్ల విద్యుత్ శాఖ అధికారులు కూడా వారితో కలిసిపోతున్నారు. తిలాపాపం తలాపిడికెడు అన్నట్లు వ్యవహరిస్తున్నారు. ప్రస్తుతం కొత్త సబ్‌స్టేషన్‌ల నిర్మాణాలు పూర్తి కావచ్చాయి. అదే సమయంలో కొత్తవి కూడా త్వరలోనే నిర్మాణాలు చేపట్టబోతున్నాయి. ఈ నేపథ్యంలో ఇక్కడి షిఫ్ట్ ఆపరేటర్ల పోస్టులు అమ్మకానికి వచ్చాయి. ఒక్కో పోస్టును రూ.3 నుంచి రూ.5 లక్షలకు అమ్మకానికి పెట్టినట్లు తెలుస్తోం ది. పలు చోట్ల ఇప్పటికే బేరసారాలు కూడా పూర్తయినట్లు సమాచారం. ఎమ్మెల్యేనో లేక ఇన్‌చార్జ్‌నో ఒప్పుకుంటేనే ఆయా పరిధిలోని పోస్టులు ఇచ్చే పరిస్థితులు ఉండడంతో వారి చుట్టూ ఉన్న కొందరు నాయకులు దీనిని ఆసరాగా చేసుకుంటున్నారు. మా వాడే మీరే ఎలాగైనా ఉద్యోగం ఇప్పించాలి అని చెప్పి వారి వద్ద నుంచి ఉన్నతాధికారులకు సిఫార్సు చేయించుకొంటున్నారు. అప్పటికే వేరొకరి వద్ద బేరం మాట్లాడుకొని వారికి ఆ ఉద్యోగం ఇప్పిస్తున్నారు.

● పర్మినెంట్ అవుతాయనే ఆశతో..

కాగా షిఫ్ట్ ఆపరేటర్ పోస్టులను ప్రస్తుతానికి కాంట్రాక్ట్ కింద తీసుకుంటున్నా భవిష్యత్‌లో అవి రెగ్యులర్ అయ్యే అవకాశాలు ఉన్నాయి. 2008లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ఒకేసారి సుమారు ఏడు వేలకు పైగా కాంట్రాక్ట్ షిఫ్ట్ ఆపరేటర్‌లను రెగ్యులరైజ్ చేస్తూ జూనియర్ లైన్‌మెన్‌లుగా పదోన్నతులు కల్పించింది. దీంతో అప్పటి నుంచి ఈ పోస్టులపై అందరికీ ఆసక్తి ఉంది. ఎప్పటికైనా పర్మినెంట్ అవుతుందన్న ఉద్దేశంతో ఎంతైనా ఇచ్చేందుకు వెనకాడటం లేదు. ఒకవేళ పర్మినెంట్ కాకపోయినా జూనియర్ లైన్‌మెన్ పోస్టుల భర్తీ చేపడితే అందులో ఈ సీనియారిటీకి ప్రాధాన్యం ఇస్తారు.

● నైపుణ్యమేదీ..?

సాధారణంగా షిఫ్ట్ ఆపరేటర్ ఉద్యోగం పొందాలంటే ఐటీఐ విద్యార్హతతో పాటు కరెంటు స్తంభం ఎక్కడం, మీటర్ రీడింగ్ తీయడం తెలియాలి. వీటిపై అవగాహన ఉంటేనే సమస్యలు లేకుండా విధులు నిర్వహించగలుగుతారు. అయితే డబ్బులు కుమ్మరించి రెకమండేషన్‌లతో వస్తున్న చాలా మందిలో కనీస స్కిల్స్ ఉండడం లేదు. ఇది తర్వాత ఇబ్బందిగా మారుతోంది. కొన్ని సందర్భాల్లో వీరు పైఅధికారులను కూడా లెక్క చేయడం లేదన్న విమర్శలున్నాయి. అయితే దీని గురించి విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు పట్టించుకోవడం లేదు. ఈ కారణంగా పేద కుంటుంబాల్లో చదువుకున్న విద్యార్థులకు అన్యాయం జరుగుతోంది. ఉపాధి కార్యాలయంలో పేర్లు నమోదు చేసుకున్న వారిని ప్రభుత్వ నిబంధనల ప్రకారం పరీక్షిస్తే అర్హులకు న్యాయం జరగడంతో పాటు నైపుణ్యం కలిగిన వారు విద్యుత్ శాఖకు దొరుకుతారు. ఇకనైనా ఈ పోస్టులను అర్హులకు దక్కేలా చూడాలని పలువురు కోరుతున్నారు.

ఎంఎల్ఎస్ పాయింట్లలో బియ్యం బొక్కుతున్నారు..!



- తక్కువ తూకాలతో రేషన్‌షాపులకు సరఫరా
- నెలకు రూ. అరకోటిపైనే స్వాహా..?
- 'ఈ- పాస్'తోనే అడ్డుకట్ట
- అమలుకు ముందుకురాని అధికారులు
- మంత్రికి మొరపెట్టుకున్నా ఫలితం లేదు

ఎంఎల్ఎస్ పాయింట్‌లో రేషన్ బియ్యం

ప్రజాపంపిణీలో అక్రమాలకు తావు లేకుండా వినియోగదారులకు నికరతూకంతో ఈ- పాస్ విధానం ద్వారా చౌకడిపోలకు సరుకులను పంపిణీ చేసే ఎంఎల్ఎస్ పాయింట్ల ఇన్‌చార్జులు బియ్యం బొక్కుతున్నారు. చౌకడిపోలకు తక్కువ తూకాలతో సరఫరా చేస్తూ మోసం చేస్తున్నారు. నెలకు సుమారు రూ.అర కోటికిపైనే స్వాహా చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఆ సొమ్ములో కొందరి అధికారులకూ వాటాలు పంపుతున్నట్టు సమాచారం. డీలర్ల అవకతవకలకు అడ్డుకట్ట వేసేందుకు ప్రవేశపెట్టిన ఈ-పాస్ విధానాన్ని ఎంఎల్‌సి పాయింట్లలో అమలు చేసేందుకు అధికారులు ముందుకు రావడం లేదు. అప్పుడే తూకాల్లో మోసం ఉండదని డీలర్లు సాక్షాత్తు మంత్రి ప్రత్తిపాటి పుల్లారావుకు మొరపెట్టుకున్నా ఫలితం లేదు. ప్రత్యేకంగా కలెక్టర్ ముత్యాలరాజు అయినా దృష్టి సారించాల్సి ఉంది. **- కావలి**

ఎంఎల్ఎస్ పాయింట్ల నుంచి సరుకుల పంపిణీలో జరిగే అవకతవకలను అరికట్టేందుకు ఈ-పాస్ విధానం అమలు జరిగేనా అనే సందేహం వ్యక్తమవుతోంది. చౌకడిపోల నుంచి వినియోగదారులకు రేషన్ సరుకులు సక్రమంగా సరఫరా చేసేందుకు ప్రభుత్వం రెండేళ్ల క్రితం ఈ-పాస్ విధానాన్ని అమలులోకి తెచ్చింది. ఫలితంగా కొంత మేర అవినీతిని అరికట్టారు. ఎంఎల్ఎస్ పాయింట్ నుంచి నికర తూకంతో రేషన్ షాపులకు సరుకులు రాకుండా డీలర్లు ఎలా సక్రమంగా ఇస్తారనే ఆలోచన అధికారులకు రాకపోవడం ఆశ్చర్యమేస్తోంది.



అలంకారప్రాయంగా ఎలక్ట్రానిక్ కాటా

ఎంఎల్‌సి పాయింట్లలో ఈ-పాస్ విధానం అమలు చేస్తే అవినీతిని భారీస్థాయిలో అరికట్టవచ్చు. ఆ విధానం లేకపోవడం వల్ల జిల్లాలోని 15 ఎంఎల్ఎస్ పాయింట్ల నుంచి ఇన్‌చార్జులు నెలకు సుమారు రూ. అరకోటికిపైనే స్వాహా చేస్తున్నట్టు ఆరోపణలున్నాయి. ఈ సొమ్ము జిల్లా అధికారులకూ ముట్టుతున్నట్టు సమాచారం. ఎంఎల్ఎస్ పాయింట్ల ఇన్‌చార్జులు సిండ్‌కేట్‌గా మారి ఈ- పాస్ విధానం అమలు జరగకుండా చూస్తున్నట్లు తెలుస్తోంది. వారికి కొందరు ఉన్నతాధికారుల అండదండలు ఉన్నట్టు విమర్శలు వినవస్తున్నాయి. ఉద్దేశపూర్వకంగానే ఈ-పాస్ మిషన్ల పంపిణీ అడ్డుకుంటున్నట్టు తెలుస్తోంది. ఇప్పటికే ఎంఎల్ఎస్ పాయింట్లకు ఎలక్ట్రానిక్ వేయింగ్ మిషన్లు అందచేసారు. ఈ-పాస్ యంత్రాలు పంపడంలో ఎందుకు జాప్యం చేస్తున్నారో తెలీడం లేదు. ఈ- పాస్‌విధానం అమలు చేసి అవినీతికి అడ్డుకట్ట వేయాలని పలువురు డీలర్లు కోరుతున్నారు. రాష్ట్రస్థాయిలో అసోసియేషన్‌గా ఏర్పడి పోరాటం కూడా చేశారు. ఇటీవల రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు నెల్లూరుకు వచ్చినప్పుడు అసోసియేషన్ నాయకులు కలిసి తమ బాధలను ఏకరువు పెట్టారు. ఎంఎల్ఎస్ పాయింట నుంచి బస్తాకు కిలో నుంచి రెండు కిలోల వరకూ తగ్గించి ఇస్తున్నారని, ఆ మోసాన్ని అరికట్టాలని విజ్ఞప్తి చేశారు. జిల్లాలో సుమారు రూ.8.7లక్షల పాత, కొత్త రేషన్‌కార్డుదారులు ఉన్నారు. వారందరికీ ప్రతి నెలా సుమారు 11 వేల మెట్రిక్ టన్నుల బియ్యం సరఫరా జరుగుతోంది. జిల్లాలోని 15 ఎంఎల్ఎస్ పాయింట్‌ల ద్వారా 1896 రేషన్ దుకాణాలకు సరఫరా చేస్తారు. 50 కిలోల బస్తాకు 1 నుంచి 2 కిలోల వరకూ తూకంలో తక్కువ వస్తోందని డీలర్లు ఆరోపిస్తున్నారు. ఈ లెక్కన 11 వేల మెట్రిక్ టన్నుల బియ్యంలో 220 మెట్రిక్ టన్నులను ఎంఎల్ఎస్ పాయింట్ ఇన్‌చార్జులే బొక్కేస్తున్నారు. వాటి విలువ సుమారు అర కోటి రూపాయలు.

'ఈ- పాస్' అమలుకు ఉత్తర్వులు

ఎంఎల్ఎస్ పాయింట్లలో ఈ- పాస్ విధానం అమలుకు ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు వచ్చాయి. ఈ- పాస్ విధానం కోసం అవసరమైన పరికరాలు కూడా వచ్చాయి. త్వరలో జిల్లాలోని 15 ఎంఎల్ఎస్ పాయిట్లలో వాటిని అమర్చి సెప్టెంబర్ నుంచి అమలయ్యే విధంగా చర్యలు చేపడుతాం.

- యంగప్ప, జిల్లా పౌరసరఫరాల సంస్థ మేనేజర్

● ప్రశ్నిస్తే వేధిస్తున్నారు!

రేషన్ బియ్యం తక్కువగా వస్తున్నాయని ప్రశ్నిస్తే ఉన్నతాధికారుల నుంచి వేధింపులు ఎదురవుతున్నాయని పలువురు డీలర్లు ఆవేదన చెందుతున్నారు. తూకాలపై ప్రశ్నించే డీలర్లపై ఎంఎల్ఎస్ పాయింట్‌ల ఇన్‌చార్జులు విజిలెన్స్ అధికారులకు చెప్పి వారి షాపులపై దాడులు చేయిస్తున్నారన్నారు. దాడుల సమయంలో చిన్న లోపం ఉన్నా ఆ సాకుతో 6 ఏ కేసులు నమోదు చేస్తున్నారని ఆవేదన చెందుతున్నారు. అందువల్ల ఎంఎల్‌సి పాయింట్ల వద్ద తూకాలు తక్కువగా ఇచ్చినా కిమ్మనకుండా ఉండాలనుకుంటున్నామని వాపోయారు.

● మామూళ్లతో సరిపెట్టుకుంటున్నారు..

రేషన్ షాపుల్పై మాదిరిగానే దాడులు నిర్వహించి అవినీతి బట్టబయలు చేయాల్సిన విజిలెన్స్ అధికారలు ఎంఎల్‌సి పాయింట్ల ఇన్‌చార్జులు ఇచ్చే మామూళ్లతో సరిపెట్టుకుంటున్నారు. ఒక వైపున జిల్లా అధికారులకు మామూళ్లు ఇచ్చి పాయింట్ల నుంచి తూకాలు సక్రమంగా ఉండాలంటే ఎలా సాధ్యమని ఎంఎల్ఎస్ పాయింట్‌ల ఇన్‌చార్జులు అంటున్నారు. ఏదేమైనా ఇప్పటికైనా కలెక్టర్ దృష్టి సారించి ఎంఎల్‌సి పాయింట్లలో ఈ-పాస్ విధానం అమలు చేసి తూకాల్లో జరిగే మోసాలకు అడ్డకట్ట వేయాల్సిన అవసరం ఉంది.



సస్పెన్షన్‌కు గురైన డాక్టర్ ఖాలేషా

- ఖంగుతిన్న వైద్య వర్గాలు
- రోగులకు అందుబాటులో లేని డాక్టర్లు
- ప్రభుత్వ చర్యతో కొలిక్కి వచ్చేనా?
- మంత్రులను, అధికారులను లెక్కచేయని వైనం
- డాక్టర్ ఖాలేషాపై వేటుతో పరిస్థితి మారేనా?

జీజీహెచ్‌లో వైద్యుడి సస్పెన్షన్

నెల్లూరు (వైద్యం): దశాబ్దాల కృషి ఫలితంగా ప్రభుత్వ వైద్య కళాశాల జిల్లాకు మంజూరైంది. దీనికి అనుబంధంగా బోధనా ఆసుప్రతి దినదిన ప్రవర్ధమానంగా వెలుగుతుందన్న జిల్లావాసుల ఆశలపై నీళ్లు చల్లేలా ఇక్కడ వైద్యుల తీరు ఉంది. సాక్షాత్తూ సీఎం చంద్రబాబునాయుడుతోపాటు మంత్రులు కామినేని శ్రీనివాసరావు, పొంగూరు నారాయణలు గతంలో వైద్య సేవలపై ఎన్నో హెచ్చరికలు చేశారు. అయితే కొందరు డాక్టర్లు ఆ హెచ్చరికలను పెడచెవిన పెట్టారు. సమయ పాలన పాటించకుండా ఇష్టం వచ్చినప్పుడు ఆసుపత్రికి వచ్చి మొక్కుబడిగా సేవలు అందించి, రోగులకు అందుబాటులో ఉండకుండా పోతున్నారు. దీంతో ప్రజాగ్రహం కూడా వెల్లువెత్తిన సందర్భాలున్నాయి. అయితే వీటిని ఖాతరు చేయని పరిస్థితుల్లో తాజాగా ఆసుపత్రి సివిల్ సర్జన్ డాక్టర్ ఖాలేషా సాహెబ్‌పై సస్పెన్షన్ వేటు పడింది. దీనికి సంబంధించి శుక్రవారం వైద్య ఆరోగ్య శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ పూనం మాలకొండయ్య ఆదేశాలు జారీ చేశారు. దీంతో జీజీహెచ్‌లో కలకలం రేగింది.

● ఇకనైనా మార్పు వచ్చేనా..?

ప్రభుత్వ ఆసుపత్రిలో కొందరు వైద్యుల తీరుపై ఇప్పటికే అనేక విమర్శలున్నాయి. గత ఫిబ్రవరి 16న జీజీహెచ్‌లో విధులకు హాజరు కాకుండా ప్రైవేటు ప్రాక్టీస్‌లో ఉన్న కొందరు వైద్యులను స్వయంగా కలెక్టర్ ముత్యాలరాజు పట్టుకున్నారు. వీరిపై సస్పెన్షన్‌కు సిఫార్సు చేస్తూ ప్రభుత్వానికి నివేదిక అందజేశారు. దీంతో కొందరు వైద్యులు చెలరేగిపోయి, ఏకంగా కలెక్టర్‌పై కూడా విమర్శనాస్త్రాలు గుప్పించారు.

చి'వరి'కి అడుగునీరే!

- అడుగంటుతున్న 'కనిగిరి'
- రైతుల భగీరథయత్నం



పంట కాలువలోని బురదనీరు సైతం పొలాల్లోకే..



నక్కలదిబ్బ దళితవాడ సమీపంలో నేలమట్టమైన వరిపైరు

ప్రకృతిపై రైతుల్లో వింత పరిస్థితి నెలకొనింది. బుచ్చిరెడ్డిపాళెం మండలంలోని పలు గ్రామాల్లో వర్షం కురిస్తే వరిపంట దెబ్బతినే పరిస్థితి ఏర్పడగా.. మరికొన్ని గ్రామాల్లో వర్షం కురవకపోతే వరిపైర్లు ఎండిపోయే వింత పరిస్థితులు నెలకొన్నాయి. మండలంలో జొన్నవాడ, పెనుబల్లి, సాల్మాన్‌పురం, దామరమడుగు, చెల్లాయపాళెం, కాగులపాడు, రేబాల, నాగమాంబాపురం తదితర గ్రామాల్లో విద్యుత్ మోటార్ల కింద రైతులు సుమారు 4 వేల ఎకరాల్లో వరినాట్లు నాటారు. మరో వారంలో కోతలు మొదలుపెట్టే ఈ ప్రాంత రైతులు వర్షం పడకూడదని ప్రార్థిస్తుంటే.. వవ్వేరు, కట్టుబడిపాళెం, పల్లాప్రోలు తదితర గ్రామాలకు చెందిన రైతులు మాత్రం వర్షం ఎప్పుడు కురుస్తాందోనని ఆకాశం వైపు ఎదురుచూస్తున్నారు. కనిగిరి రిజర్వాయర్‌ల్లో ఉన్న అరాకొర నీటిపై ఆధారపడిన ఈ గ్రామ రైతులు రెండు వేల ఎకరాల్లో రెండవ పంట సాగు చేశారు. దీంతో ఈ రెండు ప్రాంతాల రైతులు కలిస్తే ఆసక్తిర చర్చ సాగుతోంది.

- బుచ్చిరెడ్డిపాళెం





ఎండిపోయిన కనిగిరి రిజర్వాయర్, కనిగిరి రిజర్వాయర్‌లో అడుగంటిన నీరు →

కోడ్ భాషలో TROUBLEను ఎలా రాస్తారు?

మెంటల్ ఎబిలిటి

1. ఒక కోడ్ భాషలో LAWYER ను ZHWNEC గా రాశారు. అదే కోడ్‌లో WONDER ను ఎలా రాస్తారు?
ఎ) EHWYST బి) WEYHTS
సి) TUSEWJ డి) ఏదీకాదు
2. ఒక కోడ్ భాషలో NUMBER ను ELXMHU గా రాశారు. అదే కోడ్ భాషలో UNINOR ను ఎలా రాస్తారు?
ఎ) LHLEQK బి) LQLKHE
సి) LELQHK డి) ఏదీకాదు
3. ఒక కోడ్‌లో MASTERను IVGHZNగా రాశారు. అదే కోడ్‌లో TALENTను ఎలా రాస్తారు?
ఎ) GZOGMV బి) GMVOZG
సి) GVOZMG డి) ఏదీకాదు
4. ఒక కోడ్‌లో EXCELను GBIMVగా రాశారు. అదే కోడ్‌లో SMILEను ఎలా రాస్తారు?
ఎ) IPPQT బి) IPTQP
సి) UQOTO డి) ఏదీకాదు
5. ఒక కోడ్‌లో STARను 170 గా రాశారు. అదే కోడ్‌లో UNITను ఎలా రాస్తారు?
ఎ) 92 బి) 108 సి) 126 డి) ఏదీకాదు
6. ఒక కోడ్ భాషలో PRIVATE ను BVHVOPF గా రాశారు. అదే కోడ్ భాషలో TROUBLE ను ఎలా రాస్తారు?
ఎ) CHUSPNL బి) HNCPLHU
సి) CNHUSPL డి) ఏదీకాదు


7 - 10
ఒక కోడ్ ప్రకారం HANDSOME ను 89431052 గాను, NICE ను 4672 గాను రాశారు. పై కోడ్ ఆధారంగా కింది ప్రశ్నలకు సమాధానాలు తెలపండి

7. NOSE కు సరైన కోడ్?
ఎ) 4012 బి) 2041 సి) 1024 డి) ఏదీకాదు
8. AIM కు సరైన కోడ్?
ఎ) 569 బి) 695 సి) 965 డి) ఏదీకాదు
9. MIND కు సరైన కోడ్?
ఎ) 5643 బి) 3456 సి) 5436 డి) ఏదీకాదు
10. HOME కు సరైన కోడ్?
ఎ) 8520 బి) 8052 సి) 5082 డి) ఏదీకాదు
11. 6, 7, 16, 51, ---------
ఎ) 208 బి) 504 సి) 416 డి) ఏదీకాదు
12. 8, 4.5, 5.5, 12.5, 52, ----------
ఎ) 416.5 బి) 418.5 సి) 420.5 డి) ఏదీకాదు
13. 8, 3, 2, 3, 10, --------
ఎ) 49 బి) 64 సి) 86 డి) ఏదీకాదు
14. 5, 4, 6, 15, 56, -------
ఎ) 285 బి) 275 సి) 280 డి) ఏదీకాదు
15. 9, 15, 43, 83, 247, -----------
ఎ) 192 బి) 921 సి) 291 డి) ఏదీకాదు
16. a - bc - ab - cdabc - da - cd - ----
ఎ) abbcdd బి) adbcbd
సి) abcdbd డి) ఏదీకాదు
17. ab - b - cacc - b - a - cb
ఎ) cbaab బి) aabbc
సి) adcab డి) ఏదీకాదు
18. d - dba - a - db - - a - ac
ఎ) bcdbcc బి) bbcccd
సి) bccdbc డి) ఏదీకాదు
19. ప్రకటనలు: అన్ని జిల్లాలు రాష్ట్రాలు
అన్ని రాష్ట్రాలు దేశాలు
సారాంశాలు: 1. కొన్ని దేశాలు జిల్లాలు
2. ఏ జిల్లా రాష్ట్రం కాదు
3. కొన్ని దేశాలు రాష్ట్రాలు కాదు
4. కొన్ని రాష్ట్రాలు జిల్లాలు
ఎ) 1, 4 సరైనవి బి) 1, 2, 4 సరైనవి
సి) 1, 3 సరైనవి డి) ఏవీ సరైనవి కావు
20. ప్రకటనలు: ఏ సెకను నిమిషం కాదు
కొన్ని నిమిషాలు గంటలు
సారాంశాలు: 1. కొన్ని గంటలు సెకన్లు కాదు
2. కొన్ని సెకన్లు నిమిషాలు కాదు
3. కొన్ని గంటలు నిమిషాలు
4. అన్ని సెకన్లు గంటలు
ఎ) 1, 3, 4 సరైనవి బి) 2, 4 సరైనవి
సి) 1, 2, 3 సరైనవి డి) ఏదీకాదు



Panditi Meenakshi Pavan
Senior Faculty

Competitive Exams Special

21. కింది రేఖాచిత్రంలో ఎన్ని త్రిభుజాలు ఉన్నాయి?



ఎ) 20 బి) 22 సి) 18 డి) 14
22. కింది రేఖాచిత్రంలో ఎన్ని దీర్ఘచతురస్రాలు ఉన్నాయి?




ఎ) 8 బి) 9 సి) 10 డి) 11


23 - 25
భిన్నమైనదాన్ని తెలపండి
23. ఎ) షిల్లాంగ్ బి) ఇంఫాల్ సి) అగర్తల డి) భోపాల్
24. ఎ) 4541 బి) 3973 సి) 8167 డి) 6345
25. ఎ) RN బి)SJ సి) FV డి) PH

26 - 30
A + B అంటే A కుమారుడు B
A ÷ B అంటే A భార్య B
A - B అంటే A కుమార్తె B
A X B అంటే A భర్త B
A @ B అంటే A తల్లి B
A $B అంటే A సోదరుడు B
పై సమాచారం ఆధారంగా కింది ప్రశ్నలకు సమాధానాలు తెలపండి
26. A@B$C÷D సమీకరణం ప్రకారం కిందివానిలో ఏది సత్యం?
ఎ) A మేనమామ C బి) C మేనల్లుడు A
సి) D మేనకోడలు A డి) ఏదీకాదు
27. A÷B@CXD సమీకరణం ప్రకారం కింది వానిలో ఏది సత్యం?
ఎ) A మామగారు C బి) D భర్త C
సి)D కుమార్తె B డి) A తండ్రి D
28. A+÷C$D సమీకరణం ప్రకారం కింది వానిలో ఏది సత్యం?
ఎ) A కోడలు C బి) C భార్య B
సి) B భర్త C డి) C మామగారుA
29. A$B@CXD సమీకరణం ప్రకారం కింది వానిలో ఏది సత్యం?
ఎ) D కుమారుడు A బి) D కుమార్తె B
సి) A తండ్రి D డి) D భర్త C
30. A-BXC@D సమీకరణం ప్రకారం కింది వానిలో ఏది సత్యం?
ఎ) D కోడలు B బి) C అత్తగారు A
సి) C తండ్రి D డి) D తండ్రి C
31. SKOHRILC పదంలోని అక్షరాల స్థానాలను మారిస్తే ఒక పానీయం పేరు వస్తుంది. ఆ పేరులోని మొదటి, చివరి అక్షరాలను సమాధానంగా తెలపండి
ఎ) R, I బి) H, S సి) C, R డి) ఏదీకాదు
32. కింది పదాలను నిఘంటువు ప్రకారం రాసిన తరవాత నాలుగో స్థానంలో వచ్చే పదాన్ని తెలపండి?
1. Honey 2. Heart 3. Home
4. Health 5. Help
ఎ) Help బి) Home
సి) Heart డి) Honey
33. ENVIRONMENT పదంలో వర్ణమాల ప్రకారం ఎన్ని జతలు ఉన్నాయి?
ఎ) నాలుగు బి) మూడు సి) ఆరు డి) ఐదు
34. వర్ణమాలలోని బేసి సంఖ్య అక్షరాలను చిన్న అక్షరాలుగాను, సరి సంఖ్య అక్షరాలను పెద్ద అక్షరాలుగాను రాస్తే జనవరి నెల అక్షరాలు ఎలా ఉంటాయి?
ఎ) JaNuaRy బి)JANuary
సి) JAnuARy డి) ఏదీకాదు
35. వర్ణమాలలోని మొదటి సగం అక్షరాలను అపసవ్యదిశలో రాసి రెండో సగం అక్షరాలను సవ్యదిశలో రాశారు. దీని ప్రకారం కుడి నుంచి పదో అక్షరానికి గల అయిదో ఎడమ అక్షరాన్ని తెలపండి?
ఎ)A బి) B సి) O డి) N
36. అచ్చులు తొలగించిన వర్ణమాల ప్రకారం కచ్చితంగా మధ్యలో గల అక్షరం?
ఎ) L బి) M సి) N డి) P

(37-40)



పై డయాగ్రమ్‌లకు కింది పదాల ప్రకారం సరైన దానిని సూచించండి
37. పురుషులు, తండ్రులు, ఉపాధ్యాయులు
38. వైద్యులు, మహిళలు, ఇంజనీర్లు
39. మానవుడు, న్యాయవాది, కుర్చీ
40. గంట, నిమిషం, సెకను
41. కింది డయాగ్రమ్‌ల ఆధారంగా 2 అంకె గల ముఖానికి ఎదురుగా ఉండే ముఖంలోని అంకె?



ఎ) 5 బి) 6 సి) 3 డి) 1
42. సెప్టెంబరు నెలలో ఏ తేదీకి ఏ వారం వస్తుందో అదే తేదీకి అదేవారం వచ్చే తదుపరి నెల?
ఎ) నవంబరు బి) అక్టోబరు
సి) జనవరి డి) డిసెంబరు

సమాధానాలు

1) ఎ	7) ఎ	13) ఎ	19) ఎ	27) సి	35) బి
2) సి	8) సి	14) బి	20) సి	28) ఎ	36) సి
3) బి	9) ఎ	15) సి	21) బి	29) సి	37) బి
4) సి	10) బి	16) బి	22) బి	30) ఎ	38) డి
5) ఎ	11) ఎ	17) ఎ	23) డి	31) బి	39) సి
6) సి	12) బి	18) సి	24) సి	32) బి	40) ఎ
			25) బి	33) సి	41) బి
			26) ఎ	34) ఎ	42) డి

ఉద్యోగాలు

ఐజిఐఎంఎస్

పట్నాలోని ఇందిరాగాంధీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఐజిఐఎంఎస్)- **సీనియర్ రెసిడెంట్/ ట్యూటర్** పోస్టుల భర్తీకి వాక్ ఇన్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తోంది.
మొత్తం ఖాళీలు : 57
విభాగాలవారీ ఖాళీలు: అనెస్థీషియా 2, చెస్ట్ & టిబి 1, డెంటిస్ట్రీ 2, ఫోరెన్సిక్ మెడిసిన్ 1, జనరల్ మెడిసిన్ - ఎమర్జెన్సీ 5, జనరల్ సర్జరీ 1, జనరల్ సర్జరీ - ఎమర్జెన్సీ 1, మైక్రో బయాలజీ 1, ఆప్తల్మాలజీ 1, ఆర్థోపెడిక్స్ 1, ఫార్మకాలజీ 1, పీడియాట్రిక్స్ 3, ఫిజికల్ మెడిసిన్ 1, సైకియాట్రీ 1, రేడియాలజీ 6, కార్డియాలజీ 8, కార్డియో థోరాసిస్ వాస్క్యులర్ సర్జరీ 2, నెఫ్రాలజీ 11, న్యూరో మెడిసిన్ 1, న్యూరో సర్జరీ 3, మెడికల్ అంకాలజీ 1, పీడియాట్రిక్ సర్జరీ 2, యూరాలజీ 1
వయసు: ఆగస్టు 31 నాటికి 35 ఏళ్లు మించరాదు
అర్హత: ఎంసిఐ గుర్తింపు పొందిన సంస్థ నుంచి సంబంధిత విభాగంలో ఎండి/ ఎంఎస్ పూర్తిచేసి ఉండాలి. సెంట్రల్/ స్టేట్ మెడికల్ కౌన్సెల్ గుర్తింపు పొంది ఉండాలి.
దరఖాస్తు ఫీజు: రూ.500
ఇంటర్వ్యూ: ఆగస్టు 21 నుంచి 24 వరకు
వేదిక: Office Chamber of the Director, IGIMS, Patna - 14
వెబ్‌సైట్: www.igims.org

షిప్పింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా

ముంబైలోని షిప్పింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా- **'గ్రాడ్యుయేట్ మెరైన్ ఇంజనీర్స్'** పోస్టుల భర్తీకి ఉద్దేశించిన జిఎంఇ కోర్స్‌కు దరఖాస్తులు కోరుతోంది. ఇందులో భాగంగా ఎనిమిది నెలల జిఎంఇ షోర్ ట్రైనింగ్, పది నెలల షిప్ బోర్డ్ ట్రైనింగ్ ఉంటుంది. కోర్సు పూర్తిచేసుకొన్న అభ్యర్థులకు **'ఎంఇఒ క్లాస్ 4 పార్ట్ బి'** సర్టిఫికెట్ ప్రదానం చేస్తారు.
సీట్లు: 40(జనరల్ వర్గానికి 20, ఒబిసిలకు 11, ఎస్సీలకు 6, ఎస్టీలకు 3 సీట్లు కేటాయించారు)
క్యాంపస్: SCI' Maritime Training Institute, Powai, Mumbai
కోర్సు ఫీజు: రూ.4,50,000
స్టయిపెండ్: నెలకు రూ.15,000 ఇస్తారు
అర్హత: 50 శాతం మార్కులతో బిఇ/ బిటెక్ (మెకానికల్ ఇంజనీరింగ్) ఉత్తీర్ణులు/ ఆఖరు ఏడాది పరీక్షలు రాసి ఆగస్టు 31 నాటికి ఫలితాలు వెలవడే అవకాశం ఉన్న అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. పదోతరగతి & పన్నెండో తరగతి లెవెల్ ఇంగ్లీషు సబ్జెక్టుల్లో 50 శాతం మార్కులు వచ్చి ఉండాలి.
వయసు: అక్టోబరు 1 నాటికి 28 ఏళ్లు మించరాదు
ఎంపిక: ఆల్ ఇండియా ఆన్‌లైన్ టెస్ట్, పర్సనల్ ఇంటర్వ్యూ ద్వారా
ఆన్‌లైన్ టెస్ట్: సెప్టెంబరు 9న
ఆన్‌లైన్ టెస్ట్ వివరాలు: పరీక్ష సమయం రెండు గంటలు. క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్, ప్రొఫెషనల్ నాలెడ్జ్, ఇంగ్లీష్ లాంగ్వేజ్, రీజనింగ్ ఎబిలిటీకి సంబంధించిన మల్టిపుల్ చాయిస్ క్వశ్చన్స్ అడుగుతారు. అభ్యర్థులు ప్రతి విభాగంలో అర్హత సాధించాలి. అర్హులైనవారిని ఇంటర్వ్యూకి షార్ట్‌లిస్ట్ చేస్తారు.
పరీక్ష కేంద్రాలు: ముంబై, న్యూఢిల్లీ, కోల్‌కతా, చెన్నై
దరఖాస్తు ఫీజు: రూ.1000
అభ్యర్థులు ఆన్‌లైన్‌లో పూర్తిచేసిన దరఖాస్తు ఫారాన్ని ఆర్డినరీ పోస్ట్/ కొరియర్/ స్పీడ్ పోస్ట్/ రిజిస్టర్డ్ పోస్ట్ / బై హ్యాండ్ ద్వారా కింది చిరునామాకు పంపాలి.
ఆన్‌లైన్ దరఖాస్తుకు ఆఖరు తేదీ: ఆగస్టు 23
దరఖాస్తు హార్డ్ కాపీ చేరేందుకు ఆఖరు తేదీ: ఆగస్టు 25
చిరునామా: Vice President I/C, Flee Personnel Dept, Third Floor, The shipping Corporation of India, Shipping House 245, Madame Cama Road, Nariman Point, Mumbai- 400021
వెబ్‌సైట్: www.shipindia.com/careers

గుండె జబ్బు చికిత్సలో ఉపయోగించే ఔషధ మొక్క?



ఆర్. సురేష్
సీనియర్ ఫ్యాకల్టీ

జంతు రాజ్యం, మొక్కలు - ఆర్థిక ప్రయోజనాలు


1. క్రికెట్ బ్యాట్ తయారీలో ఉపయోగించే చెట్టు?
ఎ) విల్లో బి) హాల్లీ సి) హాక్‌బెర్రి డి) వెదురు
2. కింది ఏ రంగులను పత్రాల నుంచి సేకరిస్తారు?
ఎ) ఇండిగో బి) హెన్నా సి) క్లోరోఫిల్ డి) పైవన్నీ
3. ఆహారపదార్థాల్లో రంగుగా ఉపయోగించే అన్నెట్టోను ఏ భాగం నుంచి సేకరిస్తారు?
ఎ) వేరు బి) కాండం సి) విత్తనం డి) పత్రం
4. ఏ చెట్టు నుంచి రబ్బరు తయారు చేస్తారు?
ఎ) ఫైకస్ ఎలాస్టికా బి) కాస్టిల్లా ఎలాస్టికా
సి) హివియా బ్రెసిలెన్సిస్ డి) పైవన్నీ
5. కింది ఏ చెట్టు నుంచి గమ్(జిగురు)ను సేకరిస్తారు?
ఎ) ఫైకస్ బి) అకేసియా సి) పైనస్ డి) పైవన్నీ
6. టర్పెంటైన్‌ను కింది ఏ చెట్టు నుంచి సేకరిస్తారు?
ఎ) విల్లో బి) పైనస్ సి) అకేసియ డి) హివియా
7. 'లవంగం' మొక్కలోని ఏ భాగం?
ఎ) మొగ్గ బి) వేరు
బి) ఫలం
డి) పుష్ప విన్యాసం



8. మిరియాలు మొక్కలోని ఏ భాగం?
ఎ) మొగ్గ బి) ఫలం సి) వేరు డి) కాండం
9. చాక్లెట్ల తయారీలో ఉపయోగించే కోకోవాను మొక్కలోని ఏ భాగం నుంచి సేకరిస్తారు?
ఎ) ఫలం బి) మొగ్గ సి) విత్తనాలు డి) కాండం
10. కింది ఏ సుగంధ ద్రవ్యాన్ని విత్తనాల నుంచి సేకరిస్తారు?
ఎ) యాలకులు బి) లవంగం
సి) దాల్చిన చెక్క డి) పైవన్నీ
11. గుండె జబ్బు చికిత్సలో ఉపయోగించే ఔషధ మొక్క?
ఎ) యూకలిప్టస్ బి) డిజిలాలిస్
సి) బెల్లడోనా డి) క్వినైన్
12. సింకోనా అనే ఔషధ మొక్కలోని ఏ భాగం నుంచి మలేరియా చికిత్సలో ఉపయోగించే క్వినైన్ అనే ఔషధాన్ని సేకరిస్తారు?
ఎ) వేరు బి) బెరడు సి) పత్రం డి) విత్తనాలు
13. 'ముల్లంగి' మొక్కలోని ఏ భాగం?
ఎ) దుంప కాండం బి) నిల్వ చేసే వేరు
సి) ఫలం డి) పుష్ప విన్యాసం
14. కింది వాటిలో ఏక దళ బీజ మొక్క?
ఎ) చిక్కుడు బి) గోధుమ సి) బఠాని డి) ఏదీకాదు
15. అల్లం : భూగర్భ కాండం :: బీట్‌రూట్ : ....
ఎ) వేరు బి) ఫలం సి) లశునం డి) కొమ్ము
16. కింది వాటిలో చిరుధాన్యం?
ఎ) వరి బి) గోధుమ సి) రాగి డి) పైవన్నీ
17. విత్తన సుప్తావస్థను కలుగజేసే ఫైటోహార్మోన్?
ఎ) ఆక్సిన్ బి) సైటోకైనిన్
సి) జిబ్బరెల్లిన్ డి) అబ్‌సైసికామ్లం
18. కింది వాటిలో సంయుక్త ఫలం ఏది?
ఎ) పైనాపిల్ బి) సీతాఫలం
సి) కొబ్బరి డి) మామిడి
19. గోల్డెన్ రైస్ అనేది ఒక ....
ఎ) కీటక నిరోధకత కలిగిన మొక్క
బి) నీటి ఎద్దడిని తట్టుకోగలిగే మొక్క
సి) బీటా కెరోటిన్‌ను కలిగిన జన్యుపరివర్తన మొక్క
డి) పైవన్నీ

జనరల్ స్టడీస్ - బయాలజీ

20. ఊడ వేర్లను కలిగి ఉన్న చెట్టు?
ఎ) మొక్కజొన్న బి) చెరకు సి) మర్రి డి) పైవన్నీ
21. ఆడమ్స్ ఫిగ్, ఆపిల్ ఆఫ్ పారడైజ్ అనే ప్రతి నామాలు కలిగిన ఫలం?
ఎ) మామిడి బి) అరటి సి) జామ డి) సీతాఫలం
22. బంగినపల్లి, సువర్ణరేఖ అనేవి ఏ ఫలంలోని రకాలు?
ఎ) మామిడి బి) అరటి సి) జామ డి) పైనాపిల్
23. చక్కెరకేళి, అమృతపాణి అనేవి ఏ ఫలంలోని రకాలు?
ఎ) సీతాఫలం బి) జామ సి) మామిడి డి) అరటి
24. స్వర్ణ, మొతి అనేవి ఏ ధాన్యంలోని రకాలు?
ఎ) వరి బి) గోధుమ సి) జొన్న డి) సజ్జ
25. మర్రి చెట్టు జీవితకాలం?
ఎ) 50 సంవత్సరాలు బి) 80 సంవత్సరాలు
సి) 200 - 300 సంవత్సరాలు
డి) 100 - 150 సంవత్సరాలు
26. ఏనుగు సాధారణ శరీర ఉష్ణోగ్రత?
ఎ) 35.9°C
బి) 25°C
సి) 42.9°C డి) 51°C



27. కుక్క సాధారణ శరీర ఉష్ణోగ్రత?
ఎ) 125°F బి) 84 - 92°F
సి) 100 - 102.5°F డి) 110 - 114°F
28. గుర్రం సాధారణ శరీర ఉష్ణోగ్రత ఎంత?
ఎ) 99.5° - 101,5°F బి) 82° - 85°F
సి) 74.3° - 76.5°F డి) 105° - 107°F
29. నీలి తిమింగలం గుండె బరువు?
ఎ) 50 కి.గ్రా. బి) 150 కి.గ్రా.
సి) 750 కి.గ్రా. డి) 78 కి.గ్రా.
30. ఏనుగు గుండె సుమారుగా ఎన్ని కిలో గ్రాముల బరువు ఉంటుంది?
ఎ) 12 - 21 కి.గ్రా. బి) 5 - 6 కి.గ్రా.
సి) 35 - 39 కి.గ్రా. డి) 50 - 56 కి.గ్రా.
31. ఏనుగు గుండె నిమిషానికి ఎన్ని సార్లు కొట్టుకొంటుంది?
ఎ) 76 బి) 46 సి) 26 డి) 06
32. నీలి తిమింగలం గుండె నిమిషానికి ఎన్ని సార్లు కొట్టుకొంటుంది?
ఎ) 76 బి) 46 సి) 16 డి) 07
33. జంతువుల్లో ఎత్తయినది ఏది?
ఎ) ఏనుగు బి) జిరాఫీ సి) గుర్రం డి) గేదె
34. జలగ ఏ వర్గానికి చెందిన జీవి?
ఎ) మొలస్కా బి) నిడేరియ సి) అనెలిడా డి) కార్డేటా
35. 'గుడ్లగూబ' ఒక ....
ఎ) పక్షి
బి) క్షీరదం
సి) సరీసృపం
డి) అకశేరుకం



36. కింది వాటిలో స్వీయ మలభక్షక జంతువు?
ఎ) పంది బి) కుక్క సి) కుందేలు డి) ఏదీకాదు
37. సీతాకోకచిలుక జంతురాజ్యంలోని ఏ వర్గానికి చెందుతుంది?
ఎ) ఆర్థ్రోపొడా బి) మొలస్కా సి) అనెలిడా డి) కార్డేటా
38. ఏ జంతువు కంటిలో టపేటమ్ లుసిడమ్ ఉంటుంది?
ఎ) పిల్లి బి) కుక్క సి) గుర్రం డి) పైవన్నీ
39. ఊసరవెల్లి ఏ తరగతికి చెందిన జంతువు?
ఎ) క్షీరదం బి) సరీసృపం
సి) ఉభయచరం డి) అకశేరుకం
40. కింది ఏ జంతువు కళ్లు పరస్పరం స్వతంత్రంగా (రెండోదానితో సంబంధం లేకుండా) పనిచేస్తాయి?
ఎ) ఊసరవెల్లి బి) కుందేలు సి) గుడ్లగూబ డి) పిల్లి
41. కింది ఏ జంతువులో మూడు కనురెప్పలు ఉంటాయి?
ఎ) ఏనుగు బి) ఒంటె సి) గుర్రం డి) జిరాఫీ
42. పిల్లికి సుమారు ఎన్ని ఎముకలు ఉంటాయి?
ఎ) 230 - 250 బి) 310 - 330
సి) 196 - 205 డి) 260 - 270
43. కుక్కకి సుమారు ఎన్ని ఎముకలు ఉంటాయి?
ఎ) 220 - 225 బి) 290 - 296
సి) 319 - 321 డి) 200 - 206
44. ఎక్కువ జీవిత కాలాన్ని కలిగి ఉన్న జంతువు?
ఎ) టర్టిల్ బి) ఏనుగు సి) తిమింగలం డి) పులి
45. పులి జీవితకాలం ఎన్ని సంవత్సరాలు?
ఎ) 30 బి) 10 సి) 45 డి) 12
46. కింది ఏ జంతువు జీవితకాలంలో దంతాలు ఒకసారి మాత్రమే ఏర్పడతాయి?
ఎ) కుక్క బి) మానవుడు సి) ఎలుక డి) పైవన్నీ
47. కింది ఏ జంతువులో రథనికలు, అగ్ర చర్వణకాలు ఉండవు?
ఎ) కుందేలు బి) గేదె సి) ఎలుక డి) పైవన్నీ
48. ఒకే రకమైన దంతాలను కలిగి ఉన్న జంతువు?
ఎ) కుక్క బి) కుందేలు సి) మానవుడు డి) డాల్ఫిన్
49. దంతాలు లేని సరీసృపం?
ఎ) తాబేలు బి) బల్లి సి) టర్టిల్ డి) తాబేలు, టర్టిల్
50. కింది వాటిలో కీటకం?
ఎ) సిల్వర్ ఫిష్ బి) డాగ్ ఫిష్
సి) డేవిల్ ఫిష్ డి) ఏదీకాదు
51. కింది వాటిలో క్షీరదం?
ఎ) గబ్బిలం బి) డాల్ఫిన్ సి) డుడాంగ్ డి) పైవన్నీ
52. జతపరచండి.
1. ఉల్లి ఎ. కొమ్ము
2. బంగాళదుంప బి. లశునం
3. అల్లం సి. దుంపకాండం
డి. కందం
ఎ) 1-ఎ, 2-బి, 3-డి బి) 1-బి, 2-సి, 3-ఎ
సి) 1-బి, 2-సి, 3-డి డి) 1-ఎ, 2-సి, 3-డి
53. కింది వాటిలో సరైన జత కానిది?
మొక్క - క్రోమోజోముల సంఖ్య
1. ఉల్లి - 16
2. వరి - 24
3. యాపిల్ - 34
ఎ) 1, 3 బి) 2, 3 సి) 3 డి) ఏదీకాదు
54. కుంకుమ పువ్వును మొక్కలోని ఏ భాగం నుంచి సేకరిస్తారు?
ఎ) పుష్పం బి) వేరు సి) బెరడు డి) ఫలం
55. కింది ఏ జంతువు నీరు తాగకుండా ఎక్కువ రోజులు ఉంటుంది?
ఎ) గుర్రం బి) ఏనుగు సి) ఒంటె డి) గేదె

సమాధానాలు

1) ఎ	9) సి	17) డి	27) సి	37) ఎ	47) సి
2) డి	10) ఎ	18) ఎ	28) ఎ	38) డి	48) డి
3) సి	11) బి	19) సి	29) సి	39) బి	49) డి
4) డి	12) బి	20) సి	30) ఎ	40) ఎ	50) ఎ
5) బి	13) బి	21) బి	31) బి	41) బి	51) డి
6) బి	14) బి	22) ఎ	32) డి	42) ఎ	52) బి
7) ఎ	15) ఎ	23) డి	33) బి	43) సి	53) డి
8) బి	16) సి	24) సి	34) సి	44) ఎ	54) ఎ
		25) సి	35) ఎ	45) ఎ	55) సి
		26) ఎ	36) సి	46) సి	

అడ్మిషన్స్

ఉస్మానియా యూనివర్సిటీ

ఉస్మానియా యూనివర్సిటీ వర్కింగ్ ఎగ్జిక్యూటివ్స్ కోసం నిర్వహించే ఎంబిఏ కోర్సులో ప్రవేశానికి ప్రకటనను విడుదల చేసింది.
ఆఫర్ చేస్తున్న కోర్సులు: ఎంబిఏ (టెక్నాలజీ మేనేజ్‌మెంట్- ఈవెనింగ్ సెషన్)
ప్రవేశం: రాత పరీక్ష ద్వారా
ఎంబిఏ (ఈవెనింగ్-పార్ట్‌టైమ్)
ప్రవేశం: టిఎస్‌ఐసెట్-2017 ద్వారా
దరఖాస్తుకు చివరి తేదీ: ఆగస్టు 11, 2017
రాత పరీక్ష తేదీ: ఆగస్టు 13, 2017
వెబ్‌సైట్: http://www.ouadmissions.com/

సరోజినీ దేవి నేత్ర వైద్యశాల

సరోజినీ దేవి నేత్ర వైద్యశాల-హైదరాబాద్, డిప్లొమా ఇన్ ఆప్టోమెట్రీ కోర్సులో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది.
అర్హత: ఇంటర్మీడియెట్ (బయాలజీ/మేథ్స్, ఫిజికల్ సైన్స్)
వయసు: 17-25 సంవత్సరాలు
దరఖాస్తు: సూపరింటెండెంట్, సరోజినీ దేవి నేత్ర వైద్యశాల-హైదరాబాద్ పేరిట రూ.100 డిడిని తీసి నిర్దేశిత చిరునామాకు పంపి దరఖాస్తును పొందొచ్చు. కవర్ మీద అభ్యర్థి వివరాలు రాయాలి.
దరఖాస్తుకు చివరి తేదీ: ఆగస్టు 16, 2017
చిరునామా: సూపరింటెండెంట్, సరోజినీ దేవి నేత్ర వైద్యశాల-హైదరాబాద్,
పిన్: 500028.

బార్క్‌లో డిప్లొమా

బాబా అటామిక్ రీసెర్చ్ సెంటర్ (బార్క్) డిప్లొమా ఇన్ రేడియోలాజికల్ ఫిజిక్స్ కోర్సులో ప్రవేశానికి దరఖాస్తులను ఆహ్వానిస్తోంది.
సీట్ల సంఖ్య: 30
అర్హత: 60 శాతం మార్కులతో మాస్టర్ డిగ్రీ (ఫిజిక్స్)
వయసు: 26 సంవత్సరాలు
దరఖాస్తు: ఆన్‌లైన్ ద్వారా
దరఖాస్తుకు చివరి తేదీ: ఆగస్టు 21, 2017
రాత పరీక్ష తేదీ: సెప్టెంబర్ 3, 2017
వెబ్‌సైట్: http://www.barc.gov.in/

జెఎన్‌టియు

జవహర్‌లాల్ నెహ్రూ టెక్నాలజికల్ యూనివర్సిటీ (జెఎన్‌టియు)-హైదరాబాద్, ఎంబిఏ కోర్సులో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది.
సీట్ల సంఖ్య: 20
అర్హత: 55 శాతం మార్కులతో ఏదైనా నాలుగేళ్ల డిగ్రీ
దరఖాస్తు: ఆఫ్‌లైన్ ద్వారా
దరఖాస్తు ఫీజు: రూ.1,000
ప్రవేశం: రాత పరీక్ష ద్వారా
దరఖాస్తుకు చివరి తేదీ: ఆగస్టు 10, 2017
వెబ్‌సైట్: http://jntuh.ac.in/admissions
చిరునామా: డైరెక్టరేట్ ఆఫ్ ఎగ్జామినేషన్, జెఎన్‌టియూ, కూకట్‌పల్లి, హైదరాబాద్-85.

స్కాలర్‌షిప్

రాష్ట్రీయ శాన్‌స్క్రిట్ సంస్థాన్

న్యూఢిల్లీలోని రాష్ట్రీయ శాన్‌స్క్రిట్ సంస్థాన్ - సంస్కృత విద్యాభివృద్ధిలో భాగంగా ఉద్దేశించిన **'మెరిట్ స్కాలర్‌షిప్స్'**నకు ప్రకటన విడుల చేసింది. ఇందుకు ఎంహెచ్‌ఆర్‌డి సహకారాన్ని అందిస్తోంది.
శాన్‌స్క్రిట్/ పాళి/ ప్రాకృత్‌లను మెయిన్/ ఆప్షనల్ సబ్జె క్టులుగా శాన్‌స్క్రిట్ పాఠశాల/ శాన్‌స్క్రిట్ మహా విద్యా లయ/ శాన్‌స్క్రిట్ విశ్వవిద్యాలయాల్లో చదువుతు న్నవా రు అర్హులు. పూర్వ మాధ్యమ(ప్రథమ సంవత్సరం)/ తొమ్మిదో తరగతి పూర్వ మాధ్యమ (రెండో సంవత్సరం)/ పదోతరగతి ఉత్తర మాధ్యమ, ప్రక్షస్త్రీ(మొదటి సంవ త్సరం), పదకొండో తరగతి ఉత్తర మాధ్యమ, ప్రక్షస్త్రీ(రెండో సంవత్సరం), పన్నెండో తరగతి శస్త్రీ, బిఏ/ ఆచార్య ఎమ్మే/ విద్యావారధి/ పిహెచ్‌డి చదువుతున్నవారు దరఖాస్తు చేసుకోవచ్చు.
విద్యా సంస్థల ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్‌కు ఆఖరు తేదీ: ఆగస్టు 30
అభ్యర్థుల స్కాలర్‌షిప్ రిజిస్ట్రేషన్‌కు ఆఖరు తేదీ: సెప్టెంబరు 10
వెబ్‌సైట్: www.sanskrit.nic.in, www.scholarship.rsks.in

చెత్త నుంచి సంపదకు శ్రీకారం

కోవూరు: లేగుంటపాడు గ్రామంలో చెత్తనుంచి సంపద సృష్టించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు తహసీల్దార్ రామలింగేశ్వరరావు తెలిపారు. గ్రామంలోని 262 సర్వే నెంబరులో 15 సెంట్ల భూమిని శుక్రవారం ఆయన పంచాయతీ కార్యదర్శి ఉషారాణికి స్వాధీనం చేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆశయం మేరకు గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుపరచాలన్నారు. చెత్తను కూడా సంపదగా భావించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో సర్పంచు సుజాత, వీఆర్వో లక్ష్మి, ఈవోపీఆర్డీ శ్రీనివాసులు, పడుగుపాడు సొసైటీ అధ్యక్షుడు జెట్టి రాజగోపాల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సరస్వతీ విగ్రహం ఆవిష్కరణ

బుచ్చిరెడ్డిపాళెం: స్థానిక సరస్వతీ శిశు మందిర్ ఆవరణంలో శుక్రమారం సరస్వతీ అమ్మవారి విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జొన్నవాడ దేవస్థాన చైర్మన్ పుట్టా సుబ్రహ్మణ్యంనాయుడు, ధర్మకర్త తిరివీధి రాధాకృష్ణయ్య, పమిడి రవికుమార్‌చౌదరి, ఆర్‌ఎస్‌ఎస్ నాయకులు బయ్యా వాసు, బాలనరసింహ, గుర్రం నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

నరసాపురంలో గ్రామ సభ

ఇందుకూరుపేట : నరసాపురం గ్రామంలో తహసీల్దారు వెంకట నారాయణమ్మ శుక్రవారం గ్రామ సభ నిర్వహించారు. ఇటీవల గ్రామంలో ఇళ్లు లేని దరఖాస్తు చేసి ఉన్నారని, ఎంత మందికి ఇళ్లు అవసరమో గుర్తించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు గ్రామ సభలు నిర్వహిస్తూ సర్వే చేపట్టామని, గ్రామాల వారిగా ఇళ్లు లేని వారి జాబితాను రూపొందిస్తున్నామని చెప్పారు.

పీఈటీకి సన్మానం

బుచ్చిరెడ్డిపాళెం: మలేషియాలో జరిగిన 31వ అంతర్జాతీయ క్రీడల్లో బుచ్చిరెడ్డిపాళెంలోని బెజవాడ బుజ్జమ్మ జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలకు చెందిన వ్యాయామ ఉపాధ్యాయురాలు ఎం దేవిక ప్రతిభ కనబరిచారు. జూలైలో జరిగిన ఈ పోటీల్లో ఆమె షార్ట్‌పుట్‌లో మూడవ స్థానం సాధించింది. ఈ సందర్భంగా దేవికను స్కూల్ ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు,విద్యార్థులు పాల్గొన్నారు.

రైసుమిల్లులో కార్మికుడికి గాయాలు

ఇందుకూరుపేట : జగదేవిపేట గ్రామంలోని జగదాంబ రైసుమిల్లులో ఓ కార్మికుడికి గాయాలయ్యాయి. లోడింగ్ సమయంలో ఈ ప్రమాదం జరిగినట్లు తెలిసింది. శ్రీకాకుళంకు చెందిన దుర్గయ్య లారీలో బస్తాలను లోడింగ్ చేస్తుండగా చెక్క విరిగి పైన పడడంతో నడుమలు విరిగిపోయాయి. దీంతో హుటాహుటిన నెల్లూరులోని ప్రైవేట్ వైద్యశాలకు తరలించారు. గురువారం జరిగిన ఈ సంఘటనపై శుక్రవారం హాస్పిటల్ నుంచి సమాచారం అందడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఇన్‌చార్జి ఎస్సై మధుసూదన్‌రావు తెలిపారు.

వీధికి కొత్త పేరు పెట్టడంపై ఫిర్యాదు

బుచ్చిరెడ్డిపాళెంరూరల్ : ఇస్కపాళెం పంచాయతీ పరిధిలోని అంబేద్కర్‌నగర్‌లో రెండవ వీధికి కొత్తపేరుతో బోర్డు ఏర్పాటు చేయడంపై ఆ వీధిలోని 20కుటుంబాలకు ప్రజలు అభ్యంతరం వ్యక్తం చేస్తూ స్థానిక పంచాయతీ కార్యదర్శికి శుక్రవారం ఫిర్యాదు చేశారు. తమ వీధికి కొత్త పేరు పెట్టేందుకు తాము ఏఅధికారిని కోరలేదని, ప్రజామోదం లేకుండా పాత వీధికి కొత్తగా పేరు పెట్టి బోర్డు ఏర్పాటు చేయడంపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ కలెక్టర్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు వారు తెలిపారు.

వైభవంగా వరలక్ష్మీ పూజ



ఇందుకూరుపేట: గంగపట్నం ఆలయంలో భక్తుల రద్దీ



కోవూరు: వరలక్ష్మీ వ్రతం చేస్తున్న మహిళలు

బుచ్చిరెడ్డిపాళెంరూరల్ : మండలంలోని జొన్నవాడ ఆలయం భక్తులతో కిటకిటలాడింది. శ్రావణ శుక్రవారం వరలక్ష్మీ వ్రతం సందర్భంగా ఆలయానికి అధిక సంఖ్యలో వచ్చిన మహిళలు ప్రత్యేక పూజలు చేశారు. ఈసందర్భంగా ఓ భజన బృందం ఆలయం ముందు చేసిన పండరి భజన భక్తులను అలరించింది. ఆలయం వెనుకవరకు రెండువైపులా బారులు తీరడంతో భక్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. దీంతో ఆలయ కమిటీ చైర్మన్, కమిటీ సభ్యులు తమ వంతు సేవలందించారు. భక్తులకు తగు సౌకర్యాలు కల్పించి దర్శన ఏర్పాట్లు చేశారు.

రాత్రి ఆలయంలో అశేష భక్తజనం నడుమ అమ్మవారికి పల్లకిసేవలు నిర్వహించిన అనంతరం అమ్మవారికి ప్రత్యేకంగా సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. అదేవిధంగా వరలక్ష్మీ వ్రతం సందర్భంగా పలువురు ఇళ్లల్లో అమ్మవారికి పూజలు నిర్వహించారు.

కోవూరు: పట్టణంలోని శ్రీకోదండరామ స్వామి ఆలయంలో శుక్రవారం వరలక్ష్మీ వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వరలక్ష్మీ వ్రత విశిష్టతను ఆలయ ప్రధాన అర్చకులు శ్రీకాంతాచార్యులు వివరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ట్రస్టు బోర్డు మాజీ అధ్యక్షుడు పోలిదాసు వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు. పాటూరు రోడ్డులోని రాజరాజేశ్వరి ఆలయంలో అర్చకులు మనోహర్ శర్మ ఆధ్వర్యంలో భక్తులు వ్రత దీక్షను పూర్తి చేశారు. రైల్వేఫీడర్స్ రోడ్డులోని శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో శుక్రవారం అమ్మవారిని బంగారుచీరతో అలంకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్ వెంకటేశ్వర్లు, కార్యదర్శి రమేష్‌బాబు, ట్రస్టు బోర్డు సభ్యులు పాల్గొన్నారు.

కొడవలూరు: మోనేగుంటపాడులోని మాలక్ష్మమ్మకు వరలక్ష్మీవ్రతంను పురస్కరించుకుని శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా కుంకుమార్చన, అభిషేకాలు పూజా కార్యక్రమాలు జరిగాయి. ఈ కార్యక్రమంలో కార్యనిర్వాహకులు రమణయ్య, బాల భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఇందుకూరుపేట : గంగపట్నం చాముండేశ్వరి ఆలయం భక్తులతో పోటెత్తింది. శుక్రవారం శ్రావణ మాసం, వరలక్ష్మి వ్రతం కావడంతో జిల్లా నలుమూలల నుంచి భక్తులు, వాహనాల ద్వారా భక్తులు అత్యధికంగా తరలి రావడంతో సముద్ర తీరమంతా కిటకిటలాడింది. ఉదయం నుంచే అమ్మవారికి విశేష పూజలు జరిగాయి. అదేవిధంగా ఇందుకూరుపేట లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో సామూహిక వ్రతాలు నిర్వహించారు. ప్రధాన అర్చకుడు ఉదయగిరి శేషాచార్యులు ఆధ్వర్యంలో వ్రత ఏర్పాట్లు చేశారు.

విడవలూరు: మండలంలోని రామతీర్థం, విడవలూరు, పార్లపల్లి, వావిళ్ల, ముదివర్తి వావిళ్ల, ఊటుకూరులోని అమ్మవారి దేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. సూర్యోదయానికి మునుపు ఉపవాసాలు ఉన్న మహిళలు వరలక్ష్మీ వ్రతం చేపట్టారు.

● అమ్మణ్ణి ఆలయాల్లో భక్తుల రద్దీ




బుచ్చిరూరల్ : కామాక్షితాయిని దర్శించుకుంటున్న భక్తులు



కొడవలూరులో..

పోస్టుమార్టం గదిపై అపోహలు వద్దు :డీఎంహెచ్‌వో

కోవూరు: ప్రభుత్వ వైద్యశాలలో నిర్మించతలపెట్టిన పోస్టుమార్టం గదిపై స్థానికులు అపోహలు పెంచుకోవద్దని డీఎంహెచ్‌వో వరసుందరం కోరారు. స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిని శుక్రవారం ఆయన ఆకస్మికంగా పరిశీలించారు. ప్రభుత్వ నిధులతో ఆసుపత్రి ఆవరణలో నిర్మిస్తున్న పోస్టుమార్టం గదిని తనిఖీ చేశారు. నివాసప్రాంతానికి 50 అడుగుల దూరంలో పోస్టుమార్టం గది నిర్మిస్తారని చెప్పారు. స్థానికులు అపోహలకు గురై పోస్టుమార్టం గది నిర్మాణాన్ని అడ్డుకోవడం సబబు కాదన్నారు. ప్రభుత్వ స్థలంలో మూడు ఇళ్లను నిర్మించిన వ్యక్తులు పోస్టుమార్టం గది నిర్మాణంపై వ్యతిరేకత వ్యక్తం చేయడం తగదన్నారు. ఆయన వెంట వైద్యులు విజయలక్ష్మీ, సురేష్, కిరణ్మయి తదితరులు ఉన్నారు.



వైద్యసిబ్బందితో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో వరసుందరం

పర్వతారోహితుడికి ఆర్థిక సాయం



సూర్యప్రకాష్‌కు నగదు అందజేస్తున్న ప్రైవేటు స్కూల్ కరస్పాండెంట్లు

బుచ్చిరెడ్డిపాళెం: బుచ్చిరెడ్డిపాళెం అపస్మా గ్రూప్ స్కూల్స్ నిర్వాహకుడు శుక్రవారం పెనుబల్లి గ్రామానికి చెందిన పర్వతారోహితుడు కోరికల వెంకటసూర్యప్రకాష్ రూ.13,000 ఆర్థిక సహాయం అందజేశారు. పెనుబల్లి గ్రామానికి చెందిన సూర్యప్రకాష్ ఆగస్టు 15వ తేదీన దక్షిణాఫ్రికాలోని కిలిమంజారో పర్వతాన్ని అధిరోహించి అక్కడ జాతీయ జెండాను ఎగురవేయాలని ఆయన చేస్తున్న ప్రయత్నం విజయవంతం కావాలని ఈ సందర్భంగా పలు ప్రైవేటు స్కూల్స్ యాజమాన్యాలు ఆకాంక్షించారు. మల్లి మస్తాన్‌బాబులాగా సూర్యప్రకాష్ గిన్నీస్‌బుక్, వరల్డ్‌రికార్డు సాధించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అపస్మా కోవూరు నియోజకవర్గ అధ్యక్షుడు వీవీ కృష్ణారెడ్డి, ప్రైవేటు స్కూళ్ల కరెస్పాండెంట్లు ఎన్ శ్రీధర్, షేక్ మస్తాన్‌సాహెబ్, ఎం గణేష్, అయూబ్‌ఖాన్, మల్లేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముర్రుపాలు బిడ్డకు ఆరోగ్యం

విడవలూరు: ప్రసవం తరువాత ఇచ్చే ముర్రుపాలు బిడ్డకు ఆరోగ్యకమరమని అంగన్‌వాడీ కార్యకర్త శిరీష అన్నారు. దండిగుంట దళితవాడలోని అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులు, బాలింతలు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. పాలు, గుడ్లు, ఆకుకూరలు, పండ్లు అధికంగా తీసుకోవాలన్నారు. బాలింతలు పోషకాలతో కూడిన ఆహారం తీసుకుంటే పాల రూపంలో బిడ్డ పెరుగుదలకు దోహదపడతాయన్నారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించి గర్భిణులకు సీమంత కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఇందుకూరుపేట : స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కొరుటూరులో శుక్రవారం తల్లిపాల వారోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని గర్భిణులు, బాలింతలకు ప్రత్యేక పౌష్టికాహారాన్ని అందజేశారు. ఈ సందర్భంగా అధికారి సునీలత మాట్లాడుతూ తల్లిపాలు శ్రేష్టమైనవని చెప్పారు. బిడ్డల భవిష్యత్‌కు ఆరోగ్యాన్ని అమృతధారగా నిలుస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచు వెంకమ్మ, సిబ్బంది అనూరాధ, జ్యోతి, సులోచన, రమణి, భారతి తదితరులు పాల్గొన్నారు.



విడవలూరు: తల్లిపాల విశిష్ఠతను వివరిస్తున్న శిరీష

పేదలకు చీరల పంపిణీ

కొడవలూరు: మీ కోసం మేము ఫౌండేషన్ ఆధ్వర్యంలో గనకాల సుమంత ఆర్థిక సహకారంతో మండలంలోని నార్తురాజుపాళెంలో రైల్వేగేటు సమీపంలోని పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ అధ్యక్షుడు సునీల్, సభ్యులు కార్తీక్, సుమలత, హరి, భార్గవ్ తదితరులు పాల్గొన్నారు.

జీ.చెరువుపల్లిలో గ్రామసభ

ఉదయగిరి: మండల పరిధిలోని జీ.చెరువుపల్లి గ్రామంలో శుక్రవారం గ్రామసభ నిర్వహించారు. సర్పంచ్ కప్పా శ్రీనివాసులు ఆధ్వర్యంలో జరిగిన గ్రామసభలో ప్రత్యేకాధికారి షేక్ జహీర్ పాల్గొన్నారు. పల్స్ సర్వే ప్రకారం పక్కాగృహాల లబ్ధిదారుల ఎంపిక జాబితాను గ్రామసభలో చదివి విని పించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శేఖర్ తదితరులు పాల్గొన్నారు.


గ్రామసభలో మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి జహీర్

రికార్డుల ప్యూరిఫికేషన్‌పై సమీక్ష


సమీక్షిస్తున్న స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రమణారెడ్డి

ఉదయగిరి: స్థానిక తహసీల్దారు కార్యాలయంలో శుక్రవారం రెవెన్యూ సిబ్బందితో తెలుగుగంగ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ బి.వెంకటరమణారెడ్డి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రికార్డుల ప్యూరిఫికేషన్‌తో రైతుల సమస్యలు చాలా వరకు పరిష్కారమవుతాయని తెలిపారు. ఎక్కువగా అక్షర దోషాలు, అనుభవ స్వభావం, మెట్ట, మాగాణి తప్పులను గుర్తించాలన్నారు. చుక్కల భూములు, అసైన్డ్‌మెంట్ ప్రైవేటు వ్యక్తుల అధీనంలో, పరిశ్రమలకు కేటాయించిన తదితర నాలుగు రకాల భూములను గుర్తించాలని వివరించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారులు టి.వెంకటసునీల్, కోటేశ్వరరావు, రామకృష్ణ, శ్రీనివాసులు, ఆర్ఐలు శివప్రసాద్, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

16వ రోజుకు ఎమ్మార్పీఎస్ దీక్ష


తహసీల్దారుకు వినతిపత్రం అందచేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

వింజమూరు/ ఉదయగిరి: ఎస్సీ వర్గీకరణ కోసం సాగుతున్న నిరసన దీక్ష శుక్రవారంతో 16వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు పందిటి అంబేద్కర్ మాట్లాడుతూ వర్గీకరణ సాధించే వరకు పోరాటం జరుగుతుందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వర్గీకరణ పట్ల నిర్లక్ష్యం వహిస్తే మాదిగల ఆగ్రహానికి గురి కావాల్సి వస్తుందన్నారు. అనంతరం తహసీల్దారు మస్తానయ్యకు వినతిపత్రం అందచేశారు. ఈ కార్యక్రమంలో మురళి, నరసింహులు, చినమాలకొండయ్య, యాకోబ్, వీరరాఘవులు, ఏ.నాగేష్ తదితరులున్నారు.

ఉదయగిరిలో: ముఖ్యమంత్రి చంద్రబాబు మాదిగలకు ఎన్నికల సమయంలో ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని ఎమ్మార్పీఎస్ నాయకులు బెజవాడ బాలగురవయ్య, బకీరు రమణయ్యలు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు నప్పెర్ల మరియదాసు, నాగేశ్ మనీష్, సిసింద్రీ, రాజశేఖర్, రమేష్, చినపెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

బయోమెట్రిక్ ద్వారా ఎరువుల పంపిణీ

ఉదయగిరి రూరల్: ఎరువుల దుకాణాల యజమానుల బయోమెట్రిక్ మిషన్ల ద్వారానే ఎరువుల పంపిణీ చేయాలని మండల వ్యవసాయాధికారి షేక్ జహీర్ శుక్రవారం సూచించారు. తొలుత మన గ్రోమోర్ కేంద్రంలో బయోమెట్రిక్‌తో ఎరువుల పంపిణీ ప్రారంభించామని, త్వరలో అన్ని ఎరువుల దుకాణాల్లో బయోమెట్రిక్ యంత్రాలు ఏర్పాటు చేసి ఎరువులు పంపిణీ చేసేలా చర్యలు తీసుకోంటామన్నారు.

తల్లిపాలు భగవంతుడి వరప్రసాదం

వింజమూరు: బిడ్డకు తల్లిపాలు భగవంతుని వరప్రసాదమని విశ్రాంత డీఎంహెచ్‌వో కె.మాశిలామణి పేర్కొన్నారు. తల్లిపాల వారోత్సవాల సందర్భంగా మాట్లాడుతూ తల్లిపాల వలన బిడ్డకు ఎముకల పుష్టి, మెదడు బాగా పెరిగి ఆరోగ్య శక్తి ఏర్పడుతుందన్నారు. తల్లికి కూడా గర్భసంచి, రొమ్ము క్యాన్సర్ తోపాటు గుండెజబ్బులు దూరమవుతాయన్నారు. రోజుకు కనీసం 450-600 ఎంఎల్ తల్లిపాలు ఇవ్వాలన్నారు. పోషకాలు కలిగిన తల్లిపాలు బిడ్డకు భగవంతుని ప్రసాదమని తెలిపారు.


బాలింతలకు సూచనలిస్తున్న మాశిలామణి

భక్తి శ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతం


ప్రత్యేక అలంకరణలో సంతానలక్ష్మి

ఉదయగిరి: స్థానిక సంతానలక్ష్మి, దుర్గంపల్లి ఉదయలక్ష్మి ఆలయాల్లో శుక్రవారం వరలక్ష్మీవ్రతం పండుగను పురస్కరించుకొని ప్రత్యేక పూజలు జరిగాయి. అర్చకులు అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు అమ్మవారికి కాయాకర్పూరం సమర్పించి మొక్కులు తీర్చుకొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

దుత్తలూరు: మండలంలోని ప్రముఖ ఆలయాల్లో శ్రావణ శుక్రవారం, వరలక్ష్మీవ్రతాన్ని భక్తులు వైభవంగా నిర్వహించారు. ముఖ్యంగా నర్రవాడలోని శ్రీవెంగమాంబ పేరంటాల ఆలయంలో ఆలయ కార్యనిర్వాహణాధికారి వెంకటేశ్వర్లు ప్రత్యేకంగా కుంకుమ పూజా కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. పూజా కార్యక్రమానికి అధికసంఖ్యలో మహిళలు హాజరై అమ్మవారిని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయాన్ని గాజుల అలంకారంలో తీర్చిదిద్దారు. ఈ సందర్భంగా భక్తులు కాయాకర్పూరం అందచేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. అలాగే మండలంలోని దుత్తలూరు శ్రీరాజరాజేశ్వరి ఆలయంలో దుర్గామాతకు ప్రత్యేక పూజలు చేపట్టారు.


కుంకుమపూజలో పాల్గొన్న భక్తులు


ప్రత్యేక పూజల్లో శ్రీవింధ్యపరమేశ్వరి అమ్మవారు

వింజమూరు: వింజమూరులో శుక్రవారం వరలక్ష్మీ వ్రతం పర్వదినాన్ని మహిళలు భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. ఆలయాలకు వేకువజామునే మహిళలు చేరుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. తిరుమలనగర్‌లో శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక అలంకరణలతో స్వామి వారికి ప్రత్యేక పూజలు చేపట్టారు. అలాగే వింజమూరు కొండపై వెలిసి ఉన్న శ్రీవింధ్యపరమేశ్వరి అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు చేపట్టారు. భక్తులు అధిసంఖ్యలో హాజరై స్వామివార్లను దర్శించుకొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

పక్కాగృహాలకు లబ్ధిదారుల ఎంపిక

వరికుంటపాడు: మండల పరిధిలోని మహమ్మదాపురం పంచాయతీలో శుక్రవారం పక్కాగృహాలకు లబ్ధిదారుల ఎంపిక కోసం గ్రామసభలు నిర్వహించారు. ఎన్టీఆర్, ప్రధాన మంత్రి అవాస్ యోజన పథకం కింద ఇళ్ల నిర్మాణానికి దరఖాస్తు చేసుకొన్న వారితో అధికారులు సమీక్ష జరిపారు. ప్రభుత్వం నిర్దేశించిన 13 అంశాల్లో లబ్ధిదారులు ఎవరైనా ఉన్నారనే దానిపై ఆరాతీసి గ్రామసభలో వారి పేర్లను చదివి వినిపించారు. ఏమైనా అభ్యంతరాలుంటే తెలపాలని గ్రామస్తులను కోరారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు, రెవెన్యూ, హౌసింగ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


గ్రామసభలో మాట్లాడుతున్న తహసీల్దారు శ్రీనివాసులు

డీబీటీపై అవగాహన సదస్సు

వింజమూరు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఎరువులను డీబీటీ ద్వారా ఎలా అమ్మకాలు చేయాలో డీలర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సు నెల్లూరు సస్యరక్షణ సహాయ సంచాలకుల ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమానికి స్టేట్ కన్సల్టెంట్ మురళి ఎరువులు డీబీటీ ద్వారా ఎలా విక్రయించాలో తెలిపారు. టెక్నికల్ ఏవో వేణుగోపాల్ పీవోఎస్ మిషన్ల ద్వారా అవి పనిచేసే విధానం, వాడాల్సిన విషయం తెలియచేశారు. డీలర్లకు పలు సమస్యలను నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ సత్యనారాయణచౌదరి, వింజమూరు, ఆత్మకూరు, ఉదయగిరి సబ్ డివిజన్ల పరిధిలో వ్యవసాయాధికారులు, స్థానిక సుబ్రహ్మణ్యం, సుధారాణి తదితరులున్నారు.


డీలర్లకు అవగాహన కల్పిస్తున్నా అధికారులు

తల్లిపాలతోనే పిల్లలకు ఆరోగ్యం

ఉదయగిరి రూరల్: తల్లిపాలు తీసుకున్న పిల్లలు ఆరోగ్యవంతంగా ఉంటారని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కోటేశ్వరి పేర్కొన్నారు. మండల పరిధిలోని గంగిరెడ్డిపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా గర్భవతులు, బాలింతలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తల్లిపాలలో వ్యాధినిరోధకశక్తి ఉంటుందన్నారు. కేంద్రాల్లో అందించే పౌష్టికాహారం తీసుకొని ఆరోగ్యవంతమైన బిడ్డకు జన్మనివ్వాలన్నారు. బిడ్డకు ముర్రుపాలు తాగించడం మంచిదన్నారు. గర్భవతులు ప్రభుత్వ వైద్యశాలల్లోనే కాన్పులు చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, గర్భవతులు, బాలింతలు తదితరులున్నారు.


గర్భిణులకు అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ కోటేశ్వరి

ఉదయగిరిలో తేలికపాటి వర్షం


ఉదయగిరిలో కురుస్తున్న వర్షం

ఉదయగిరి: ఉదయగిరి ప్రాంతంలో శుక్రవారం తేలికపాటి వర్షం కురిసింది. ఆకాశంలో మేఘాలు కమ్ముకొని వర్షం కురవడంతో వాతావరణం చల్లబడింది. గత వారం రోజులుగా ఎండల తీవ్రతకు జనం ఉక్కపోతతో అల్లాడుతున్న తరుణంలో వర్షం కురవడం కొంత ఉపశమనం కలిగింది. అలాగే మండలంలో రైతులు సాగు చేసిన పొద్దుతిరుగుడు, సజ్జ పంటలకు మేలు చేకూరింది. బత్తాయి, నిమ్మ, బొప్పాయి, మామిడి చెట్లకు కొంత ఊరటనిచ్చింది.

● ఇంటర్వ్యూ



తాగునీటి సమస్యల పరిష్కారానికి కృషి

డి.ఖాజారంతుల్లా, కార్యదర్శి

?: గుండెమడగల, నల్లగొండ్ల పంచాయతీలో తాగునీటి సమస్య ఉందా.

!: ఆయా పంచాయతీల్లో ఇంతవరకు తాగునీటి సమస్య తలెత్తలేదు. ముందుగానే తగు చర్యలు తీసుకొని తాగునీటి ఎద్దడి లేకుండా చూశాం.

?: పంచాయతీలో ఇంటి పన్ను బకాయి లేకుండా వసూలు చేశారా.

!: మా పరిధిలోని పంచాయతీ గ్రామాల్లో ముందస్తుగా నోటీసులు జారీ చేసి బకాయిలు లేకుండా నూరు శాతం పన్నులు వసూలు చేశాం.

?: పారిశుధ్యానికి ఏలాంటి చర్యలు తీసుకొంటున్నారు.

!: ఎప్పటికప్పుడు మురుగు నీటి కాలువల పూడిక తీయించి అవసరమైన చోట బ్లీచింగ్ చల్లించాం. సమస్య ఏర్పడితే వెంటనే స్పందిస్తున్నాం.

వింజమూరు

దినఫలాలు

అదృష్టసంఖ్యలు : 5, 8

మేషరాశి: (మార్చి21-ఏప్రిల్20): చిన్నారుల విషయాలపై దృష్టి సారిస్తారు. సృజనాత్మకంగా వ్యవహరించి వృత్తి, వ్యాపారాల్లో లక్ష్యాలు సాధిస్తారు. ఉన్నత పదవులు అందుకుంటారు. పిల్లల విజయం ఆనందం కలిగిస్తుంది.

వృషభరాశి: (ఏప్రిల్21-మే20): కుటుంబ సభ్యులతో ప్రయాణాలు ఉల్లాసం కలిగిస్తాయి. చర్చలు, సమావేశాలకు ఏర్పాట్లు చేస్తారు. విద్యార్థులకు శుభప్రదం. ఇంట్లో ఆహ్లాదకర వాతావరణం నెలకొంటుంది. సంకల్పం నెరవేరుతుంది.

మిథునరాశి:(మే21-జూన్21): పూర్వ మిత్రులను కలుసుకుంటారు. పెట్టుబడులకు సంబంధించిన సమాచారం సేకరిస్తారు. మ్యూచువల్ ఫండ్స్, బీమా వ్యవహారాలు ఒక కొలిక్కి వస్తాయి. ఆర్థిక విషయాల్లో సోదరీ, సోదరుల సహకారం లభిస్తుంది.

కర్కాటకరాశి:(జూన్22-జూలై23): స్పెక్యులేషన్లు లాభిస్తాయి. ఆర్థిక విషయాల్లో భాగస్వామి సహకారం అందుకుంటారు. జన సంబంధాలు విస్తరిస్తాయి. ప్రియతముల కోసం విలువైన వస్తువులు కొనుగోలు చేస్తారు. ఆర్థిక పరిస్థితి ప్రోత్సాహకరం.

సింహరాశి:(జూలై24-ఆగస్ట్23): వ్యవసాయ, పరిశ్రమల రంగాల వారు కీలక నిర్ణయాలు తీసుకుంటారు. ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపిస్తారు. కొత్త పనుల ప్రారంభానికి అనుకూలం. కొత్తగా ఆలోచించి వృత్తి, వ్యాపారాల్లో వికాసం సాధిస్తారు.

కన్యారాశి: (ఆగస్ట్24-సెప్టెంబర్23): దూరంలోఉన్న ప్రియతముల నుంచి సంతోషకరమైన సమాచారం అందుకుంటారు. ఉన్నత విద్యకు అవసరమైన నిధులు సమకూరుతాయి. రాజకీయ, సినీ రంగాల వారికి కొత్త ఆలోచనలు స్ఫురిస్తాయి.

తులారాశి: (సెప్టెంబర్24-అక్టోబర్23): బంధుమిత్రులతో ఇంట్లో సందడి వాతావరణం నెలకొంటుంది. ప్రియతముల ప్రవర్తనలో మార్పు గమనిస్తారు. రియల్ ఎస్టేట్, గృహ నిర్మాణ రంగాల వారికి ఆర్థికంగా ప్రోత్సాహకరం.

వృశ్చికరాశి: (అక్టోబర్24-నవంబర్22): ఇంటర్వ్యూలలో విజయం సాధిస్తారు. విద్యార్థులకు లక్ష్య సాధనలో పెద్దల సహకారం లభిస్తుంది. స్టేషనరీ, ఏజెన్సీ, రవాణా రంగాల వారికి శుభప్రదం. సోదరీ, సోదరుల విషయాల్లో శుభపరిణామాలు సంభవం.

ధనూరాశి: (నవంబర్23-డిసెంబర్21): ఆదాయం పెంపొందించుకునేందుకు కొత్త వ్యూహాలు ఆలోచిస్తారు. సంకల్పం నెరవేరుతుంది. పెట్టుబడులు, పొదుపు పథకాల గురించి సమాచారం సేకరిస్తారు. ప్రయాణాలు, సమావేశాలకు అనుకూలం.

మకరరాశి: (డిసెంబర్22-జనవరి21): పెట్టుబడుల గురించి ఆరా తీస్తారు. బీమా, పింఛన్, మ్యూచ్యువల్ ఫండ్స్ వ్యవహారాలకు అనుకూలం. సంస్మరణల్లో పాల్గొంటారు. ఇన్‌స్టాల్ మెంట్స్‌పై వస్తువులు కొనుగోలు చేస్తారు.

కుంభరాశి: (జనవరి22-ఫిబ్రవరి18): ఉన్నత విద్య, విదేశీ వ్యవహారాలకు అనుకూలం. బంధుమిత్రులతో ప్రయాణాలు ఉల్లాసం కలిగిస్తాయి. జన సంబంధాలు విస్తరిస్తాయి. శ్రీవారు, శ్రీమతి అంతరంగం తెలుసుకుని మసలుకుంటారు.

మీనరాశి: (ఫిబ్రవరి19మార్చి20): ఆర్థిక విషయాల్లో సహోద్యోగుల సహకారం అందుకుంటారు. బంధుమిత్రులతో విందు, వినోదాల్లో పాల్గొంటారు. బ్యాంకులు, ఆర్థిక సంస్థలు, సహకార సంఘాల వారు లక్ష్యాలు సాధిస్తారు.

-బిజుమళ్ళ బిందుమాధవ శర్మ

త్వరలో నుడా పార్కులు

- నగరంలో ఫ్లైఓవర్ల నిర్మాణానికి ప్రతిపాదనలు
- లే అవుట్లకు నిబంధనల మేర అనుమతులు
- నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి



కార్పొరేషన్ అధికారులతో సమీక్షిస్తున్న నుడా చైర్మన్ శ్రీనివాసులరెడ్డి, కమిషనర్

నెల్లూరు (సిటీ) : నుడా పరిధిలోని ప్రాంతాలలో పార్కుల ఏర్పాటుకు శ్రీకారం చుడుతున్నట్లు నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి తెలిపారు. కార్పొరేషన్ కార్యాలయంలో నుడా సమావేశాన్ని శుక్రవారం ఆయన అధ్యక్షతన నిర్వహించారు. పలు అంశాలపై చర్చించారు. అనంతరం విలేఖరులతో మాట్లాడుతూ నుడా మాస్టర్ ప్లాన్‌కు ఇంకా సమయం పడుతున్నందున బిల్డింగులు, లే అవుట్‌లు తదితర వాటికి స్థానిక సంస్థల నిబంధనల ప్రకారమే నుడా అనుమతులు ఇస్తుందని చెప్పారు. 156 గ్రామాలు, 21 మండలాలు, 4 మున్సిపాలిటీలతో కలిపి ఏర్పాటైన నుడా ద్వారా జిల్లాను అన్ని విధాలా అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నిర్ణయించారన్నారు. దీంతో మంత్రులు, ఎమ్మెల్సీ బీదతో కలిసి జిల్లా అభివృద్ధికి భారీగా నిధులు తీసుకొచ్చేందుకు కృషి చేస్తామని తెలిపారు. నెల్లూరు నగరంలో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి బీవీనగర్, కొండాయపాళెం గేటు ప్రాంతాల్లో ఫ్లై ఓవర్ బ్రిడ్జిల నిర్మాణానికి ఆర్అండ్‌బీ శాఖ ఇప్పటికే ప్రతిపాదనలు పంపి ఉందని, తాజాగా ముత్యాలపాళెం ప్రాంతంలో మరో వంతెన ఏర్పాటుపై పరిశీలన చేయాల్సిందిగా అధికారులను ఆదేశించామన్నారు. ఆర్టీసీ బస్టాండు తరలింపునకు చర్యలు చేపడుతామన్నారు. నగరంలో రోజూ 1,525 బస్సులు తిరుగుతున్నాయని, అలాగే 3.28లక్షల వాహనాలున్నాయని, వీటికి అనుగుణంగా రోడ్ల వ్యవస్థను అభివృద్ధి చేయాల్సి ఉందన్నారు. రైల్వే లైన్ తూర్పు పక్క ఉన్న రోడ్డును నిర్వహణలోకి తీసుకొస్తామని చెప్పారు. నెల్లూరు కార్పొరేషన్ కమిషనరు, నుడా వీసీ ఢిల్లీరావు మాట్లాడుతూ అజెండాలోని ఏడు అంశాలపై చర్చించి ఆమోదించినట్లు తెలియజేశారు. నుడాకు శాశ్వత భవనం ఏర్పాటు కోసం స్థల సేకరణకు కలెక్టర్‌ను కోరుతూ లేఖ రాస్తున్నామని వెల్లడించారు. మేనకూరు గ్రామాన్ని నుడాలో కలపాలన్న ప్రతిపాదనను ప్రభుత్వానికి పంపుతామని చెప్పారు. ఈ సమావేశంలో నుడా డైరెక్టర్లు ఖాజావలి, దయాకర్ రెడ్డి, రంగారావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

'తారకేశ్వర'పై నివేదిక ఇవ్వండి

సూళ్లూరుపేటలో కాళంగి నదిపై తారకేశ్వర పరిశ్రమ ఏర్పాటుపై నివేదిక ఇవ్వాలని నుడా చైర్మన్ కోటంరెడ్డి ఆదేశించారు. ఆ పరిశ్రమ నెలకొల్పితే పరిసర ప్రాంతాలు ముంపునకు గురవుతాయంటూ ఇటీవల ఆంధ్రజ్యోతి కథనంపై నుడా సమావేశంలో చర్చ జరిగింది. టెక్స్‌టైల్ పార్కు ఏర్పాటుతో సూళ్లూరుపేటకు జలగండం ఉండడం వాస్తవమేనా అని పరిశ్రమల శాఖ జీఎం వేలాయిజంను నుడా చైర్మన్ ప్రశ్నించారు. దీనిపై జీఎం వివరణ ఇస్తూ వరదలు వచ్చినప్పుడు కొన్ని గంటలపాటు మాత్రమే ఇబ్బంది ఉంటుందని చెప్పారు. గ్రామాల ముంపునకు గంటలు చాలవా అని కోటంరెడ్డి ప్రశ్నించారు. పరిశ్రమలు ప్రాంతాల అభివృద్ధి, ప్రజల ఉపాధికి తోడ్పడాలే తప్ప గ్రామాలను ముంచే విధంగా ఉండకూడదన్నారు. దీనిపై వెంటనే తనకు నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. దీంతో పదిహేను రోజుల్లో నివేదిక ఇస్తామని జీఎం చెప్పగా పది రోజుల్లోనే ఇవ్వాలని కోటంరెడ్డి సూచించారు.

ఉపాధి కూలీల ఆధార్ అనుసంధానానికి శిబిరాలు

నెల్లూరు, (వెంకటేశ్వర పురం) : జిల్లాలో ఇప్పటి వరకు బ్యాంకు ఖాతాకు, జాబ్‌కార్డుకు ఆధార్ అనుసంధానం కాకుండా ఇబ్బందిపడుతున్న ఉపాధి హామీ పథకం కూలీల కోసం ఈ నెల 1 నుంచి ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేసినట్లు డ్వామా పీడీ హరిత తెలిపారు. శుక్రవారం నెల్లూరులోని డ్వామా కార్యాలయంలో ఆమె విలేఖరులతో మాట్లాడారు. ఇప్పటికీ 1.06 లక్షల మంది కూలీలకు ఆధార్, మొబైల్ నెంబర్ల అనుసంధానం జరగలేదని, ఈ నెల 14లోపు వాటన్నింటిని పూర్తి చేస్తామని ప్రకటించారు. ఈ కార్యక్రమాన్ని ఎంపీడీవో ఆధ్వర్యంలో ఉపాధి హామీ సిబ్బంది, బ్యాంకు అధికారులు నిర్వహిస్తారన్నారు. ఆధార్ అనుసంధానం కాకపోవడంతో సకాలంలో వేతనాలు అందుకోలేక కూలీలు ఇబ్బంది పడుతున్నారన్నారు. ఇటువంటి వారందరూ ఆయా గ్రామ పంచాయతీల్లో నిర్వహించే క్యాంపుల్లో తమ ఆధార్ కార్డు నకలు, బ్యాంక్ పాసు పుస్తకం నకలు అందజేయాలని కోరారు. ఒకవేళ బ్యాంకు ఖాతా లేకపోతే లబ్ధిదారులు రెండు పాస్‌పోర్టు సైజు ఫొటోలు, ఆధార్ కార్డు నకలుతో దరఖాస్తు అందజేస్తే బ్యాంకు ఖాతాను తెరుస్తారని చెప్పారు.

ఏపీడీలతో సమీక్ష



పీడీ హరిత

ఉపాధి హామీ పథకం కింద జరుగుతున్న పనుల పురోగతిని తెలుసుకునేందుకు పీడీ హరిత గురువారం తన కార్యాలయంలో ఏపీడీలతో సమావేశమయ్యారు. ఇప్పటి వరకు ఎంత శాతం పనులు జరిగాయి, భవిష్యత్ ప్రణాళికలపై సమీక్షించారు. కూలీలను పెంచడం, మరుగుదొడ్ల నిర్మాణం పూర్తి చేయడం, ఫారం పాండ్స్ నిర్మాణ లక్ష్యాలపై చర్చించారు. ఉద్యాన పంటల లక్ష్యం, అవెన్యూ ప్లాంటేషన్‌పై ఏపీడీలకు వివరించారు. ఎన్‌టీఆర్ జలసిరి పథకం కింద బోర్లు వేయడాన్ని వేగవంతం చేయాలని ఆదేశించారు. ఇప్పటికే పూర్తయిన పనులకు జియో ట్యాగింగ్ చేయాలని సూచించారు. జాబ్‌కార్డు కలిగిన కూలీలందరి ఫోన్ నెంబర్లు అనుసంధానం చేసేలా చూడాలని ఆదేశించారు. ఈ సమావేశంలో డీపీవో శ్రీహరి, ఏపీడీలు మృదుల, గోపి, వెంకట్రావు, శ్రీహరి, ఫైనాన్స్ మేనేజర్ ప్రభాకర్ పాల్గొన్నారు.

ఐఐటీటీఎంలో స్పాట్ అడ్మిషన్లకు దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు (సాంస్కృతికం) : భారత ప్రభుత్వ పర్యాటక శాఖ ఆధ్వర్యంలో వెంకటాచలం మండలం గొలగమూడిలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టూరిజం అండ్ ట్రావెల్ మేనేజ్‌మెంటు (ఐఐటీటీఎం)లో స్పాట్ అడ్మిషన్లకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆ సంస్థ కన్వీనర్ సంజీవరెడ్డి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. టూరిజం అండ్ ట్రావెల్ మేనేజ్‌మెంట్‌లో ఎంబీఏ, బీబీఏ కోర్సుల్లో సీట్లు భర్తీ చేస్తామన్నారు. రెండేళ్ల ఎంబీఏ కోర్సులో ప్రవేశానికి 50 శాతం మార్కులతో డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలని, మూడేళ్ల బీబీఏలో చేరడానికి ఇంటర్/+2 పాసై ఉండాలని తెలిపారు. స్పాట్ అడ్మిషన్లకు చివరి తేదీ ఈ నెల 14న అని, పూర్తి వివరాలకు 9866274850ను సంప్రదించాలని కోరారు.

సినీనటుడు నాగినీయుడుకి జీవన సాఫల్య పురస్కారం రేపు ప్రదానం



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

నెల్లూరు (సాంస్కృతిక ప్రతినిధి) : పవిత్రా చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ప్రముఖ సినీనటుడు, మర్యాదరామన్న ఫేమ్ నాగినీయుడుకు జీవన సాఫల్య పురస్కారం - 2017ను అందజేస్తున్నట్లు సంస్థ అధ్యక్షుడు గాలి కిరణ్‌కుమార్ వెల్లడించారు. శుక్రవారం సంస్థ కార్యాలయంలో జరిగిన విలేఖర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆదివారం సాయంత్రం నగర పురమందిరంలో మదర్ థెరిస్సా 107 జయంతి ఉత్సవాల సందర్భంగా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా సినీ నటుడు నాగినీయుడుకు ఈ పురస్కారాన్ని అతిరథ మహారథుల సమక్షంలో అందజేస్తామని వెల్లడించారు. ఇదే కార్యక్రమంలో నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డికి విశిష్ట పురస్కారాన్ని, జిల్లాలో ప్రముఖ సామాజిక కార్యకర్తలు గూడూరు ప్రభాకర్‌రెడ్డి, ఉపాధ్యాయుడు వెంకటేశ్వర్లు, పొత్తూరు శైలజ, ప్రముఖ కళాకారుడు సాయిరాంప్రసాద్‌కు ఈ పురస్కారాలు అందజేస్తామని వివరించారు. ఈ సందర్భంగా ప్రముఖ సినీ, టీవీ నాయకులు, నటులతో వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ సమావేశంలో పిన్ను గంగాధర్‌రెడ్డి, అపోలో ఆసుపత్రి రమేష్, అందె శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

బంగారం, వెండి ధరలు

22 క్యారెట్స్ బంగారం

గ్రాము ధర	-	2,730
సవర (8 గ్రాములు)	-	21,840
వెండి కిలో ధర	-	41,100
వెండి గ్రాము ధర	-	41.10

చికెన్ ధరలు

వెన్‌కాబ్..

బాయిలర్ రైతు ధర	79
లేయర్	75
స్కిన్ చికెన్	130
స్కిన్‌లెస్ చికెన్	153
లేయర్ మాంసం	125

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్..

బాయిలర్ లైవ్	87
లేయర్ లైవ్	77
స్కిన్ చికెన్	146
స్కిన్‌లెస్	170
లేయర్	130

నిమ్మ ధరలు (బస్తా) గూడూరు

పచ్చివి: రూ.1,200 నుంచి రూ. 2,200 వరకు

పండ్లు: రూ.800 నుంచి రూ.1,200 వరకు

జలాశయాల్లో నీటిమట్టాలు


సోమశిల

పూర్తి సామర్థ్యం:	78 టీఎంసీలు
ప్రస్తుత నీటినిల్వ:	7.01 టీఎంసీలు
ఇన్‌ఫ్లో :	------------
అవుట్‌ఫ్లో :	500 క్యూసెక్కులు
ఆవిరి :	56 క్యూసెక్కులు

సంగం ఆనకట్ట

నీటిమట్టం :	-------------
కనిగిరికాలువ :	-------------
ఎడమ కాలువ :	-------------
కనుపూరు కాలువ:	-------------
బీపీఆర్ కాలువ :	-------------
నెల్లూరుచెరువుకాలువ :	-----------

దారి కనుక్కోండి



సూక్తి

కోపం తెచ్చుకునే హక్కు ఎవరికైనా ఉండొచ్చు..
కానీ ఆ కోపంలో క్రూరంగా ప్రవర్తించే హక్కు మాత్రం ఎవరికీ లేదు.

టంగ్ ట్విస్టర్స్



1. If you're keen on stunning kites and cunning stunts,buy a cunning stunning stunt kite.
2. Sounding by sound is a sound method of sounding sounds.
3. Real rock wall, real rock wall, real rock wall



'పోలార్ పార్క్'లోకి అడుగుపెట్టగానే.. ముఖ్య అతిథిపై పూల వర్షం కురిపించినట్లు...వెన్నెల్లాంటి మంచు జల్లులా కురుస్తుంది. చాలా రోజుల తర్వాత కలిసినా ఆత్మీయుల్లా క్రూర మృగాలు ఆలింగనం చేసుకుంటాయి. ఎంతో ప్రేమతో ముద్దిస్తాయి. స్నేహితుల్లా కలిసిపోతాయి. వాటిని వదిలిపోతుంటే.. దీనంగా చూస్తుంటాయి.. ఈ పార్కుకు మీకు వెళ్లాలనుందా? అయితే చలో నార్వే!



ప్రేమతో ముద్దిచ్చే తోడేళ్లు

పోలార్ పార్కు దీన్నే 'పోలార్ జూ'గా కూడా పిలుస్తారు. ఇది 'ట్రోమ్స్' అనే చిన్న దేశంలో ఉంది. నార్వేలోని ప్రసిద్ధ పార్కుగా పేరు పొందింది. ఈ పార్కును 1994, జూన్ 18న ప్రారంభించారు. ఎలుగుబంట్లు, నక్కలు, తోడేళ్లు, పెద్ద అడవి పిల్లి(శివంగి), ధ్రువపు జింకలు, మూస్(లేడి వంటి జంతువు), ఎరుపు జింక, బ్రౌన్ ఎలుగుబంటి జంతువులు ఈ పార్కులో స్వేచ్ఛగా తిరుగాడుతుంటాయి. 112 ఎకరాల్లో ఉన్న ఈ పార్కుల్లో 'తోడేళ్ల క్యాంప్' ప్రత్యేక ఆకర్షణ. ఈ పార్కుకు 12 కిలోమీటర్ల దూరంలోనే 'రోహ్‌కున్ బొర్రి నేషనల్ పార్కు' ఉంది.

సెల్ఫీలకు పోజులు!

ఇక్కడి పార్కులోని తోడేళ్లు మనుషుల్ని చూసి భయపడవు. మనుషుల సమక్షంలో అవి ఆనందంగా గడుపుతాయి. సందర్శకులు తోడేళ్లతో ఎంచక్కా ఆడుకోవచ్చు. మనుషులతో అవి ఇట్టే కలిసిపోతాయి. ప్రేమతో ముద్దులు కూడా ఇస్తాయి. చుట్టూ చేరి తెగ సందడి చేస్తాయి. సెల్ఫీ తీస్తుంటే.. అందమైన పోజులిస్తాయి. అమ్మ ఒడిలో పడుకున్నట్లు.. వాటిపై హాయిగా పడుకున్నా అవి ఏమనవు. మిగతా జంతువులు కూడా సందర్శకులను ఏమీ చేయవు. సందర్శకులు వీటిని మచ్చిక చేసుకోవడానికి తోడేళ్ల ఎన్‌క్లోజర్‌లో గంటపాటు గడపవచ్చు. ఒక రోజు మొత్తం కూడా వాటిలో ఉండొచ్చు. మీతో పాటు తోడేళ్ల శిక్షకులు కూడా ఉంటారు. వాటితో ఎలా మెలగాలో, ఎలా మచ్చిక చేసుకోవాలో వారు సూచిస్తారు. అత్యుత్సాహంతో వాటిని బెదరకొట్టకూడదు. అవి దగ్గరికి వచ్చినప్పుడు నిండైన ఆత్మవిశ్వాసంతో ఉండాలి. ఎందుకంటే అవి భయాన్ని పసిగడతాయి. ఒక్కసారి మచ్చిక అయితే పెంపుడు జంతువుల్లా ఉంటాయి.



మొబైల్ రైడ్..

ప్రకృతి ప్రేమికులకు ఈ పార్కు వీనుల విందే. పార్కులో ఎటూ చూసినా అందాలే. మంచు దుప్పటి కప్పుకున్న పర్వతాలను,రకరకాల జంతువులను చూస్తూ... ఎరుపెక్కిన సూరీడు అందాల మాటున స్నో మొబైల్ వ్యానులో షికారు భలేగా ఉంటుంది.

ఎన్నో అరుదైన జంతువుల మధ్యలో హాయిగా గడపడం..ఓ అనిర్వచనీయమైన అనుభూతి. ఈ పార్కుకు వెళ్లాలంటే ఒకే ఒక్క కండీషన్. అదేంటంటే 15 సంవత్సరాల వయసు దాటిని వారినే ఇందులోకి అనుమతిస్తారు.

రంగులు వేయండి



నవ్వుల్ నవ్వుల్



తండ్రి : ఏరా! ఎన్నిసార్లు ఫోన్ మోగుతున్నా ఎత్తడం లేదు ఎందుకని?
బన్ను : నాన్నా! నన్ను డాక్టర్ బరువులు ఎత్తొద్దని చెప్పారు. అందుకనే!
తండ్రి : !!!!!!!!

=======

టీచర్ : టీవీ వల్ల హింసలు పెరుగుతున్నాయిట నిజమేనా?
చిన్ను : అవును టీచర్ నిజమే! నేను ఎప్పుడు టీవీ ఆన్ చేసినా మా నాన్న నన్ను కొట్టినంత పని చేస్తున్నారు.

చెప్పగలరా?

కూడులో ఉన్నా కానీ గూడులో లేను
తుదిలో ఉన్నా కానీ ఆదిలో లేను
రుచిలో ఉన్నా కానీ శుచిలో లేను
అయితే ఇంతకీ నేనెవర్నో చెప్పగలరా?

జంతర్‌మంతర్

ఈ కింది పదాలను సరిచేయండి


1. హాఆరం ▸ ....
2. ధుమరం ▸ ....
3. చాతిమం ▸ ....

జంబ్లింగ్ వర్డ్స్

ఈ కింది పదాలను సరిచేయండి

1. DSIE ▸ ....
2. FODO ▸ ....
3. RPEO ▸ ....

బొమ్మ గీయండి



మీకు తెలుసా?



సిగరెట్ లైటర్‌ని అగ్గిపుల్ల కంటే ముందే కనిపెట్టారు.


ఔనా!

స్టార్ ఫిష్‌కు మెదడు ఉండదు.

జవాబులు

చెప్పగలరా? : కూతురు
జంతర్‌మంతర్ :
1. ఆహారం
2. మధురం
3. చామంతి
జంబ్లింగ్ వర్డ్స్ :
1.SIDE
2.FOOD
3.ROPE

చుక్కలు కలపండి



సోమశిల.. వెలవెల



ఆత్మకూరు నియోజకవర్గంలోని సోమశిల జలాశయం నీటి మట్టం బాగా తగ్గి వెలవెలబోతోంది. కొంతకాలంగా పైతట్టు ప్రాంతాల నుంచి నీటి సరఫరా లేదు. ప్రస్తుతం జలాశయం నుంచి దిగువకు తాగునీటి అవసరాల నిమిత్తం 500 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు. జలాశయంలో శుక్రవారానికి 265.58 అడుగులతో 7.01 టీఎంసీల నీరు నిల్వ ఉంది. పర్యాటకుల సంఖ్య రోజురోజుకూ తగ్గుతుండడంతో జలాశయ ప్రాంగణం కళ తప్పినట్టయింది.

- అనంతసాగరం

ఉద్యోగ భద్రత కల్పించండి



నిత్యం దుర్గంధాల మధ్య జీవించే తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని పారిశుధ్య కార్మికులు నిరసన వ్యక్తం చేశారు. జీవోనెంబరు 279, 159, 160లకు నిరసనగా శుక్రవారం నాయుడుపేట గాంధీమందిరం పార్కు వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో పారిశుధ్య కార్మికులు కళ్లకు నల్లగంతలు కట్టుకుని నిరసన తెలియజేశారు. మున్సిపాలిటీలలో దాదాపు పాతికేళ్లుగా పనులు చేస్తున్నప్పటికీ ఉద్యోగ భద్రత లేదని వాపోయారు. సీఐటీయూ మండల కార్యదర్శి శివకవిముకుంద, పారిశుధ్య కార్మికుల నాయకులు ఆదెమ్మ, లక్ష్మమ్మ, సుబ్రహ్మణ్యం, శీనయ్య, పెంచలయ్య ఉన్నారు.

- నాయుడుపేటరూరల్

ప్రదర్శనలతోనే సృజనాత్మక, విజ్ఞానం పెంపు

● కరెన్సీ, స్టాంపుల ఎగ్జిబిషన్ ప్రారంభం ● నేడు, రేపు కూడా నిర్వహణ



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న బ్రాహ్మణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చంద్రమౌళి



ప్రదర్శనను తిలకిస్తున్న విద్యార్థులు

నెల్లూరు (సాంస్కృతికం) : కరెన్సీనోట్లు, నాణేలు, పురాతన వస్తువులు, పోస్టల్ స్టాంపుల ప్రదర్శనల వల్ల యువత, విద్యార్థులలో విజ్ఞానం, సృజనాత్మక ఆలోచనలు పెరుగుతాయని ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వీ చంద్రమౌళి తెలిపారు.శుక్రవారం నెల్లూరులోని టీవీఎస్ కళ్యాణ సదన్‌లో జాతీయ స్థాయి ఎగ్జిబిషన్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ ఎగ్జిబిషన్‌ను ప్రతి కుటుంబం చూడాలన్నారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న జిల్లా పోస్టల్ సూపరింటెండెంట్ పీ విశ్వనాథం మాట్లాడుతూ పాతనోట్లు, నాణేలు,. స్టాంపులు, చారిత్రాక వస్తువులు సేకరించడం, భద్రపరచడం ఓ అపూర్వ కళ అని అన్నారు. దీన్ని తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు. పోస్టల్ డిప్యూటీ సూపరింటెండెంట్ డీ హనుమంతరావు మాట్లాడుతూ ఈ ఎగ్జిబిషన్‌లో మై స్టాంపును ఏర్పాటు చేశామన్నారు. తమ ఫొటోను స్టాంపుల పక్కన ముద్రించుకునేందుకు మై స్టాంప్ పథకాన్ని కేంద్రం ప్రవేశ పెట్టిందన్నారు. దీన్ని అందరూ వినియోగించుకోవాలని కోరారు.

నేడు, రేపు కూడా ఎగ్జిబిషన్

సింహపురి న్యూమిస్మ్యాటిక్ అండ్ ఫిలాటిలిక్ అసోసియేషన్ అధ్యక్షుడు జె రాజేష్, కార్యదర్శి సతీష్‌కుమార్ మాట్లాడుతూ ఈ ప్రదర్శన శని, ఆదివారాలు కూడా ఉంటుందన్నారు. ఈ ప్రదర్శనలో చెన్నై, గుజరాత్, ముంబాయి, కేరళ, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్నాటక, రాష్ట్రాల నుంచి సేకరణకర్తలు వచ్చారని, వారు తమ స్టాళ్లను ఏర్పాటు చేశారన్నారు. ఈ కార్యక్రమంలో మై స్టాంప్ బిజినెస్ ఎగ్జిక్యూటివ్ ఎంవీ సుధాకర్‌రావు, అసోసియేషన్ ఉపాధ్యక్షుడు వీ ప్రభాకర్‌రెడ్డి, జాయింట్ సెక్రటరీ టీ నాగరాజు, కోశాధికారి బీ .మధుసూదనరావు, కేపీ తిలక్‌బాబు, బీ సాయి మనోహర్, తదితరులు పాల్గొన్నారు.

ఏమేమి ఉన్నాయంటే..

ప్రదర్శనలో ఏమున్నాయంటే.. 1000 ఏళ్ల క్రితం, అంతకుముందు చెలామణిలో ఉన్న నాణేలు, నోట్లు, స్టాంపులు, విదేశాలలో చెలామణిలో ఉన్న కరెన్సీ, పురాతన వస్తువులు ఉన్నాయి. పురాతన వస్తువులు కూడా ఉన్నాయి.

ప్రిస్ సర్వేపై సమీక్ష

నెల్లూరు(జడ్పీ): పంచాయతీలను డిజిటలైజేషన్ చేయడంలో భాగంగా ఇళ్లు, రోడ్లు, భవనాలను ఆన్‌లైన్ చేసేందుకు ప్రభుత్వం ప్రిస్ సర్వే చేపట్టింది. దీనిపై జిల్లా పంచాయతీ అధికారి శ్రీహరి శుక్రవారం స్థానిక శాఖ కార్యాలయంలో ఈవోపీఆర్‌డీలు, కార్యదర్శులతో సమావేశమయ్యారు. సర్వే ఏ పంచాయతీలో ఎంత వరకు వచ్చిందన్న దానిపై సమీక్షించారు. కొన్ని గ్రామాల్లో ఇంకా సర్వే ప్రారంభం కాలేదని, మరికొన్ని గ్రామాల్లో ప్రారంభమైనా నత్తనడకన సాగుతోందని దీనిని వేగవంతం చేయాలని ఆయన సూచించారు. ఈ సందర్భంగా కార్యదర్శులు పలు సమస్యలను డీపీవో దృష్టికి తీసుకొచ్చారు. ఈ కార్యక్రమంలో అధికారులు పాల్గొన్నారు.

టీడీపీ ప్రభుత్వంలో క్రీడలకు పెద్దపీట

- బడ్జెట్‌లో రూ.200 కోట్లు కేటాయింపు
- రాజధాని నిర్మాణ కమిటీ సభ్యుడు బీదమస్తాన్‌రావు
- అంతర్ జిల్లా మినీ వాలీబాల్ చాంపియన్‌షిప్ పోటీలు ప్రారంభం

ఓజిలి: తెలుగుదేశం ప్రభుత్వం క్రీడలకు పెద్దపీట వేసిందని రాజధాని నిర్మాణ కమిటీ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే బీద మస్తాన్‌రావు అన్నారు. ఓజిలి మండలం పెద్దపరియ క్రాస్ రోడ్డు వద్ద శివంతి ఆదిత్యాన్ స్పోర్ట్స్ అకాడమీలో శుక్రవారం అంతర్ జిల్లా మినీ వాలీబాల్ చాంపియన్‌షిప్ పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ పోటీలలో 13 జిల్లాలకు చెందిన క్రీడాకారులు పాల్గొన్నారు. ఈసందర్భంగా జరిగిన సభలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు.రాష్ట్ర విభజన నేపథ్యంలో ఆర్థిక వనరులు అంతంతమాత్రంగా ఉన్నా క్రీడలపట్ల ప్రభుత్వం చిత్తశుద్ధితో వ్యవహరించిందని అన్నారు. అందులో భాగంగానే బడ్జెట్‌లో 200 కోట్ల రూపాయలను కేటాయించి క్రీడాభివృద్ధికి చర్యలు తీసుకున్నట్లు వివరించారు. మరోవైపు రాష్ట్ర స్థాయిలో అండర్-14 మినీ వాలీబాల్ చాంపియన్‌షిప్ పోటీలు జిల్లాలోని ఓజిలికి సమీపంలో జరగటం జిల్లా విశిష్టతగా చెప్పారు. కార్యక్రమలో పాల్గొన్న అర్జున, ద్రోణాచార్య అవార్డుల గ్రహీత రమణారావును ఉద్దేశించి మాట్లాడుతూ శిష్యుడు, గురువు కలగలిసిన వ్యక్తి ఇక్కడ ఉండటం రాష్ట్రానికే గర్వకారణమన్నారు. క్రీడాకారులు పోటీలో పాల్గొనటమే ముఖ్యమని గెలుపు ఓటమిలు తరువాత అంశంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో అర్జున, ద్రోణాచార్య అవార్డుగ్రహీత, ఏపీ వాలీబాల్ అసోసియేషన్ కార్యదర్శి ఏ రమణారావు, జిల్లా స్పోర్ట్స్ డెవలప్‌మెంట్ అధికారి పీవీ రమరణయ్య, వైస్ ప్రెసిడెంట్ జీ నారాయణరాజు, ఏపీ బీచ్ వాలీబాల్ కమిటీ చైర్మన్ శ్రీనివాసరెడ్డి, మాలకొండయ్య, జి నాగేశ్వరరావు, వాలీబాల్ అసోసియేషన్ నేతలు టీడీ భగవాన్‌దాస్, రవూఫ్, కోదండరెడ్డి, కమలాకర్‌రెడ్డి, కమిటీ సభ్యులు, రెఫరీలు, క్రీడాధికారులు, కోచ్‌లు పాల్గొన్నారు. మూడు రోజులు జరిగే ఈ పోటీల్లో మొదటి రోజు బాలుర విభాగంలో 9 టీంలు గెలుపొందగా, బాలికల విభాగంలో 9 టీంలు గెలుపొందాయి.



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న బీద



తలపడుతున్న నెల్లూరు, కడప బాలికల జట్లు

నేటి నుంచి ఎస్జీటీల బదిలీలు



కౌన్సెలింగ్‌కు హాజరైన ఉపాధ్యాయులు



కౌన్సెలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న భార్గవ్

నెల్లూరు (క్యాంపస్) : ఉపాధ్యాయుల బదిలీల్లో భాగంగా ఎస్జీటీల కౌన్సెలింగ్ శనివారం నుంచి జరగనుంది. అయితే బదిలీ ప్రక్రియ గందరగోళాల మధ్య కొనసాగుతోంది. డీఈవో మువ్వా రామలింగం ప్రకటించిన షెడ్యూల్‌లో మార్పులు చేయగా ఆ సమాచారం లేక ఉపాధ్యాయులు అయోమయానికి గురయ్యారు. శుక్రవారం అర్ధరాత్రి వరకు స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయుల కౌన్సెలింగ్ ప్రక్రియ కొనసాగింది. షెడ్యూల్ ప్రకారం ఎస్ఏ ఇంగ్లీష్, ఎస్ఏ పీఎస్‌లకు కౌన్సెలింగ్ జరగాల్సి ఉంది. కౌన్సెలింగ్ త్వరగా ముగించాలన్న ఉన్నతాధికారుల ఆదేశాలతో ఎస్ఏ ఫిజిక్స్, ఎస్ఏ గణితం, ఎస్ఏ ప్రభుత్వ క్యాటగిరిలకు సంబంధించిన కౌన్సెలింగ్‌ను నూతన జడ్పీ కార్యాలయంలోని రెండు కేంద్రాల్లో నిర్వహించారు. మూలాపేట బాలికల ఉన్నత పాఠశాలలో ఎస్ఏ ఇంగ్లీష్ కౌన్సెలింగ్ నిర్వహించారు. ఆ మూడు కేంద్రాల్లో ఒక్కసారిగా 1800 మందికి కౌన్సెలింగ్ నిర్వహించడంతో అర్ధరాత్రి వరకు ప్రక్రియ సాగింది. బాలికల పాఠశాలలో కౌన్సెలింగ్‌కు వసతులు లేక ఉపాధ్యాయులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. దీనికితోడు సీనియారిటీ జాబితా ప్రకారం ఏఏ తేదీల్లో ఎవరికి కౌన్సెలింగ్ నిర్వహిస్తారు అన్న సమాచారం ఇప్పటి వరకు ఉపాధ్యాయులకు అందలేదు. ఇంకా చెప్పాలంటే, కౌన్సెలింగ్ జరిగే ముందురోజు రాత్రి వరకు అధికారులకే స్పష్టత ఉండడం లేదు. కాగా, ఎగ్జామ్‌నేషన్స్ బోర్డు డైరెక్టర్ భార్గవ్ జిల్లాలో జరుగుతున్న కౌన్సెలింగ్‌ను పరిశీలించారు. మూడు కేంద్రాలను ఆయన సందర్శించి డీఈవో రామలింగం నుంచి వివరాలు తెలుసుకున్నారు. కౌన్సెలింగ్ త్వరగా పూర్తి చేయాలని సూచించారు.


కౌన్సెలింగ్‌లో నేడు...

నూతన జడ్పీ కార్యాలయంలో ఒక కౌన్సెలింగ్ కేంద్రంలోనే శనివారం కౌన్సెలింగ్ జరగనుంది. ఎస్‌జీటీ తెలుగు (ఎల్‌బీ) 1 నెంబరు నుంచి 250 వరకు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కౌన్సెలింగ్ నిర్వహిస్తారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి నెంబరు 251 నుంచి 500 వరకు కౌన్సెలింగ్ జరుగుతుంది. మూలాపేటలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో ఎస్‌జీటీ ఉర్దూలకు కౌన్సెలింగ్ జరుగుతుంది.

వీఆర్‌వోల అరెస్ట్ అన్యాయం

సంగం: పసుపు కుంభకోణం కేసులో వీఆర్‌వోలను ఉదయగిరి పోలీసులు అరెస్ట్ చేయడం అన్యాయమని సంగం మండల వీఆర్‌వో సంఘం నాయకులు ఖండించారు. వారు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. వీఆర్‌వోలను అరెస్ట్ చేసి దొంగలుమాదిరిగా కస్టడీలో పెట్టడం దారుణమని పేర్కొన్నారు. వారిని విడుదల చేయాలని డిమాండు చేశారు. ప్రకటన విడుదల చేసిన వారిలో ఆ సంఘం నాయకులు రామకృష్ణారెడ్డి, శ్రీనివాసులురెడ్డి, ప్రసాద్, పుల్లయ్య, ఉన్నారు.

• ఇంటర్వ్యూ



కార్పొరేట్‌కు దీటుగా ఫలితాల సాధనకు కృషి

మాల్యాద్రి, హెచ్‌ఎం

? ప్రభుత్వ పాఠశాల పట్ల తల్లిదండ్రుల ఆదరణ తగ్గుతోందని ఆరోపణలు వస్తున్నాయి.

! ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లీషు మాధ్యమం ప్రవేశపెట్టాక ఆదరణ పెరిగింది. గతంలో ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లీషు మాధ్యమం లేకపోవడంతో ఇంగ్లీష్లు మీద మోజుతో తల్లిదండ్రులు పిల్లలను ప్రైవేటు పాఠశాలల్లో చేర్పించేవారు. ఇప్పుడు అలాంటి పరిస్థితి లేదు.

? పాఠశాలలో ఎంత మంది విద్యార్థులు ఉన్నారు. గతేడాది కంటే పెరిగారా, తగ్గారా.

! సంగం ఉన్నత పాఠశాలలో ప్రస్తుతం 486 మంది విద్యార్థులు ఉన్నారు. 6 నుంచి 10 తరగతులు నడుస్తున్నాయి. ప్రతి తరగతిలోనూ రెండు సెక్షన్‌లు ఉన్నాయి. గతేడాది కంటే ఈ ఏడాది వివిధ తరగతుల్లో 36 మంది విద్యార్థులు ఎక్కువగా చేరారు.

? ఉత్తమ ఫలితాల కోసం ఎటువంటి ప్రణాళికలు అమలు చేస్తున్నారు.

! ఉత్తమ ఫలితాలు సాధించేందుకు విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాం. ప్రతి రోజూ ఉదయం, సాయంత్రం గంట చొప్పున ప్రత్యేక తరగతు నిర్వహించేందుకు ప్రణాళికలు చేశాం.

? పాఠశాలలోని సమస్యలను ఎలా అధిగమిస్తారు.

! పాఠశాలలో పెద్ద సమస్యలంటూ ఏమీ లేవు. ప్రస్తుతం అన్ని సబ్జెక్టులకూ ఉపాధ్యాయులు ఉన్నారు. గదుల సమస్య లేదు. చిన్నచిన్న సమస్యలను పరిష్కరించుకొని ముందుకు పోయి ఉత్తమ ఫలితాలు సాధిస్తాం.

- సంగం

దర్గాసిబ్బందిపై దౌర్జన్యాలు అరికట్టాలి

ఏఎస్‌పేట: ఏఎస్‌పేటలోని శ్రీశ్రీశ్రీహజరత్ సయ్యద్ ఖాజానాయబే రసూల్ దర్గాలో పని చేసే తమపై జరిగే దౌర్జన్యాలను అరికట్టాలని శుక్రవారం సిబ్బంది గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. దర్గాలో మతిస్థిమితం లేని ఓ వ్యక్తి భక్తులపై ఇటీవల దాడికి పాల్పడుతుంటే అడ్డుకున్న సిబ్బందిపై కొందరు గ్రామస్తులు దురుసుగా ప్రవర్తించారన్నారు. తరచూ దర్గాసిబ్బందితో బయట వ్యక్తులు ఇలా దౌర్జన్యాలకు దిగుతున్నారని ఫిర్యాదులో వారు పేర్కొన్నారు. వాటిని అరికట్టాలని కోరారు.

భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతం

● పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు ● మహిళలతో కిటకిటలాడిన దేవాలయాలు



ఆత్మకూరు శివాలయంలో పూజలు చేస్తున్న మహిళలు

ఆత్మకూరు: శుక్రవారం వరలక్ష్మీ వ్రతాన్ని మహిళలు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఇంటి వద్ద వరలక్ష్మీవ్రతం ఆచరించడానికి వీలుకాని మహిళల కోసం పలు దేవాలయాల్లో సాముహిక వర లక్ష్మీవ్రతాలను ఏర్పాటు చేశారు. పట్టణంలోని పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. కన్యాకపరమేశ్వరి, వెంకటేశ్వ రస్వామి, శివాలయం, అలఘునాథ స్వామి ఆలయాల్లో నిర్వహించిన సామూహిక వరలక్ష్మీవ్రతంలో మహిళలు అధికసంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కొందరు తమ ఇళ్ల వద్దకు ముత్తయిదువులను ఆహ్వానించి వారికి తాంబూలాలు ఇచ్చి ఆశీర్వాదాలు పొందారు.

పెరిగిన పూజాసామగ్రి ధరలు

అసలే శ్రావణమాసం... అందులో వరలక్ష్మి వ్రత పర్వదినం కావడంతో పూజాసామగ్రి ధరలు విపరీతంగా పెరిగాయి. వ్రతానికి కావాల్సిన పూలు, పండ్లు, టెంకాయలు, జాకెట్ ముక్కలకు బాగా గిరాకీ పెరిగింది. కొందరు వ్యాపారులు రెట్టింపు ధరలకు విక్రయించారు.

పురోహితులకు భలే గిరాకీ

ఎక్కువ మంది తమ ఇళ్లల్లో శాస్త్రోక్తంగా, సంకల్పసహితంగా వరలక్ష్మీవ్రతాన్ని చేసుకోలేరు. దాంతో చాలామంది మహిళలు పురోహితులను ఆశ్రయిస్తుంటారు. ఒక వైపు వివాహాలు, గృహప్రవేశాలు వంటి శుభకార్యాలతో పురోహితులు బిజీగా ఉన్నారు. అందువల్ల వరలక్ష్మీవ్రతాన్ని జరిపించడానికి అందుబాటులో ఉన్న పురోహితులు తక్కువగా ఉండడంతో వారికి డిమాండ్ ఏర్పడింది.

అనంతసాగరం: మండలంలోని కచ్చిరిదేవరాయపల్లి సంతానవేణు గోపాలస్వామి ఆలయం, అనంత సాగరంలోని ఆంజనేయస్వామి, రామాలయాల్లో వరలక్ష్మి వ్రతాన్ని అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. మూడు చోట్ల ఆలయ అర్చకులు భానుప్రకాష్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేపట్టారు. వరలక్ష్మి అమ్మవారు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శన మిచ్చారు. అధికసంఖ్యలో మహిళ భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

సంగం: శ్రీకామాక్షిదేవి సమేత సంగమేశ్వరస్వామి ఆలయంలో గీతా జ్ఞాన పరిషత్ ఆధ్వర్యంలో వరలక్ష్మీవ్రతాన్ని ఘనంగా నిర్వహించారు. స్వామి, అమ్మవార్లకు క్షీర, పంచామృ తాభిషేకాలు చేశారు. అనంతరం మహిళలు సామూహిక వరలక్ష్మీ వ్రత పూజలు చేశారు. ఆలయ అర్చకులు గోపాలకృష్ణమూర్తి భక్తుల కు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమం లో గీతాజ్ఞాన పరిషత్ నిర్వాహకులు, ఆలయ ట్రస్ట్‌బోర్డు ఛైర్మన్ గిరి, భక్తులు పాల్గొన్నారు.



అనంతసాగరంలో వరలక్ష్మీవ్రతం చేస్తున్న భక్తులు



సంగంలో సామూహిక వరలక్ష్మీ వ్రతానికి హాజరైన మహిళలు

అభివృద్ధి పనులు వేగవంతం

● రోడ్డు నిర్మాణాన్ని పరిశీలించిన డాక్టర్ ఆదిశేషయ్య

ఆత్మకూరు: మున్సిపాలిటీలో అభివృద్ధి పనులు వేగవంతమయ్యాయని టీడీపీ పట్టణాధ్యక్షులు డాక్టర్ సీహెచ్ ఆదిశేషయ్య అన్నారు. శుక్రవారం ఆయన ఆత్మకూరు మున్సిపాలిటీ పరిధిలోని 14వ వార్డులో జరుగుతున్న సిమెంట్‌రోడ్డు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆనం రామనారాయణరెడ్డి ప్రత్యేక చొరవతో ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్, 14వ ఆర్థికసంఘం నిధులు రూ.20 కోట్లు విడుదలయ్యాయని తెలిపారు. పనుల నాణ్యతలో రాజీపడకుండా అన్ని ప్రాంతాల్లో సిమెంట్‌రోడ్ల నిర్మాణం వేగవంతమవుతోందన్నారు. నత్తనడకన సాగుతున్న డ్రైనేజీ పనులను సైతం వేగవంతం చేయకపోతే కాంట్రాక్ట్ రద్దు చేసే దిశగా చర్యలు చేపట్టేందుకు ప్రభుత్వం వెనుకాడబోదన్నారు. కోటి రూపాయలతో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం త్వరలో ప్రారంభమవుతుందని తెలిపారు. మున్సిపాలిటీలో లబ్ధిదారులకు 1028 పక్కా గృహాలను మంజూరు చేశామన్నారు. స్థలం ఉన్న వారికి సైతం గృహాలు మంజూరు చేసి రూ.3.50 లక్షల నిధులను ప్రభుత్వం అంద జేస్తుందన్నారు. ఆత్మకూరు అభివృద్ధికి పాటుపడుతున్న ఆనం రామనారాయణ రెడ్డిని వచ్చే ఎన్నికల్లో అత్యధిక మెజార్టీతో గెలిపించే దిశగా అందరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో జన్మభూమి కమిటీ సభ్యుడు పీ వెంకటేశ్వర్లునాయుడు, బీజేపీ మండల మాజీ అధ్యక్షులు పెంచలయ్య యాదవ్, తదితరులు పాల్గొన్నారు.



14వ వార్డులో సిమెంట్‌రోడ్డు పనులను పరిశీలిస్తున్న డాక్టర్ సీహెచ్ ఆదిశేషయ్య

జగన్ దిష్టిబొమ్మ దహనం

ఆత్మకూరు: ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడును నడిరోడ్డుపై కాల్చేయండి అంటూ ప్రతిపక్షనాయకుడు జగన్మోహన్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలకు నిరసనగా శుక్రవారం ఆత్మకూరులో టీఎన్‌ఎస్‌ఎఫ్ కార్యకర్తలు జగన్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఆర్యవైశ్య సంఘం మాజీ అధ్యక్షులు, రాష్ట్రకార్యవర సభ్యుడు కొల్లా నాగరాజారావు, టీఎన్‌ఎస్‌ఎఫ్ నేతలు మాట్లాడుతూ గత ఎన్నికల్లో రాష్ట్ర ప్రజలు జగన్‌కు బుద్ధి చెప్పినా ఆయనలో మార్పు రాకుండా అధికారకాంక్షతో సైకోలా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. పేదప్రజల అభ్యున్నతే లక్ష్యంగా పలు సంక్షేమ కార్యక్రమాలను చేపడుతున్న సిఎం చంద్రబాబునాయుడును అలా మాట్లాడితే ప్రజలు సహించబోరని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టీఎన్‌ఎస్‌ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు మొగల్ యస్దానీ, నియోజకవర్గ ఇన్‌చార్జి నెల్లూరు శివారెడ్డి, పలువురు టీఎన్‌ఎస్‌ఎఫ్ నేతలు పాల్గొన్నారు.



జగన్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కార్యకర్తలు

రుణాలు సక్రమంగా చెల్లించాలి

●ఎస్‌ఎఫ్‌డీ సంస్థ సీఈవో కలివెల ఎలీషాకుమార్

ఆత్మకూరు: నాబార్డు ద్వారా తీసుకున్న రుణాలను తిరిగి సక్రమంగా చెల్లించాలని ఎస్‌ఎఫ్‌డి సంస్థ సీఈవో కలివెల ఎలీషాకుమార్ తెలిపారు. శుక్రవారం మున్సిపాలి టీలోని వెంకట్రావుపల్లి గిరిజన కాలనీలో తెల్లపాడు వాటర్‌షెడ్ పరస్పర సహాయక సహకార సంఘం ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాబార్డు ఎస్‌ఎఫ్‌డి సంస్థ నుంచి రుణాలు పొందిన పేదలు పలు రకాల వ్యాపారాలు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారన్నారు. మాక్స్ నియమనిబంధనలకు లోబడి ఆ రుణాలు తిరిగి నిర్ణీత కాలంలో చెల్లించాల్సి ఉందన్నారు. ప్రతినెలా 10వ తేదీ లోపు చెల్లిస్తే మరికొందరికి జీవనోపాధి కల్పించే అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో మాక్స్ కమిటీ సభ్యులు వి.సుమతి, వి.అంకమ్మ, వి.వెంగమ్మ, నారాయణరెడ్డి, రఫీ, పి.పుల్లయ్య పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎలీషాకుమార్

దర్గాకు పోటెత్తిన భక్తజనం

ఏఎస్‌పేట: ఏఎస్‌పేటలోని శ్రీహజరత్ సయ్యద్ ఖాజానాయబే రసూల్ దర్గాకు శుక్రవారం అత్యధిక సంఖ్యలో భక్తులు రావడంతో దర్గా ప్రాంగణం కిటకిటలాడింది. దేశ నలుమూలల నుంచి వచ్చిన యాత్రికులు దర్గాలోని స్వామి, అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. యాత్రికులకు దర్గా సజ్జాదా, ముతవలి షాగులాం నక్షబంద్ హఫీజ్‌పాషా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. యాత్రికులతో దుకాణాలు కళకళలాడాయి. గ్రామ వీధులు భక్తులతో కిటకిటలాడాయి. యాత్రికులు ఒకరికొకర్ని పలుకరించుకొని ఆనందాన్ని పంచుకున్నారు.

బడి బయటే చిన్నారులు

అనంతసాగరం: బడికి వెళ్లి విద్యాబుద్ధులు నేర్చుకోవాల్సిన చిన్నారులు మండలంలోని పలుచోట్ల బడిబయటే తారసపడుతున్నారు. గిరిజన కుటుంబాలు ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో బడిఈడు పిల్లలు బడికి వెళ్లడంలేదు. అర్ధాకలి, పేదరికం కారణంగా కొందరు చిన్నారులు చిత్తుకాగితాలు ఏరుకుంటూ దయనీయ స్థితిలో ఉన్నారు. మండలంలోని సోమశిలలో గిరిజన గురుకుల పాఠశాల ఉన్నప్పటికీ పలువురు చిన్నారులు బడికి దూరంగా ఉండడం గమనార్హం. గిరిజనకాలనీల్లో బడిఈడు పిల్లలను గుర్తించి వారి బంగారు భవిష్యత్తుకు బాటలు వేసేలా అధికారులు చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

క్రైస్తవులను దళితులుగా గుర్తించాలి

సంగం: క్రైస్తవులను దళితులుగా గుర్తించాలని ఆల్ ఇండియాక్రిస్టియన్ రాష్ట్ర కార్యదర్శి సురేష్‌బాబు కోరారు. శుక్రవారం ఆయన సంగంలోని రక్షణసువార్త ప్రార్థన మందిరంలో పాస్టర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొందరు దళితులు క్రైస్తవ మతాన్ని స్వీకరిస్తే వారిని బీసీలుగా పరిగణిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. క్రైస్తవ మతం స్వీకరించినా వారిని దళితులుగానే గుర్తించాలన్నారు. ఈనెల 10వ తేదీన నెల్లూరులో ఆల్ ఇండియాక్రిస్టియన్ ఆధ్వర్యంలో జరిగే బహిరంగర్యాలీ, సభకు క్రైస్తవ సోదరులంతా తరలిరావాలని కోరారు. ఈ కార్యక్రమంలో రక్షణసువార్త ప్రార్థనమందిరం పాస్టర్ నెహమ్య, పలువురు ఫాస్టర్లు పాల్గొన్నారు.

వైభవంగా ఇంద్రాక్షాంభిక ఉత్సవాలు



చుంచులూరులో ఇంద్రాక్షాంభిక ఆలయం వద్ద పొంగళ్లు పొంగిస్తున్న మహిళలు

మర్రిపాడు: మండలంలోని చుంచులూరు గ్రామంలో మూడ్రోజుల నుంచి ఇంద్రాక్షాంభిక ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఈ సందర్భంగా శ్రావణ శుక్రవారం మహిళలు ఉపవాసాలు ఉండి అమ్మవారికి పొంగళ్లు పెట్టి నైవేద్యాలు సమర్పించారు. అనంతరం అమ్మవారికి కుంకుమార్చన, చందన అలంకరణ, పాలాభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు. ఉత్సవాలను తిలకించేందుకు కదిరినాయుడుపల్లి, పడమటినాయుడుపల్లి, కుంటనీళ్లపాడు, అనంతపురం, రాజుపాళెం, గంగపాళెం, అగ్రహారం, బొమ్మవరం, తదితర గ్రామాల నుంచి భక్తుల అత్యధిక సంఖ్యలో తరలివచ్చారు. భక్తులకు ఆలయ కమిటీ వారు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. శనివారంతో గ్రామోత్సవం ముగియనున్నది.



50 గ్రాములకుగాను 30 గ్రాములే ఉన్న గుడ్డు



అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా అయిన కోడిగుడ్లు

గోలీగుడ్లు సరఫరా

- 50 గ్రాములకు గాను 35..
- మారని కాంట్రాక్టర్ల తీరు
- పట్టించుకోని అధికారులు
- మంత్రి ఆదేశాలూ బేఖాతరు

చేజర్ల: అంగన్‌వాడీ కేంద్రాలకు నిబంధనలకు విరుద్ధంగా కోడిగుడ్లను సరఫరా చేస్తున్నారు. 50గ్రాముల బరువు గల కోడిగుడ్లకు బదులు 35 గ్రాముల గోలీ ఆకారంలో ఉండే వాటిని సరఫరా చేస్తున్నారు. తక్కువ బరువు కలిగిన కోడిగుడ్లను సరఫరా చేస్తే కాంట్రాక్టర్లపైనా, సీడీపీవోలపైనా, కార్యకర్తలపైనా చర్యలు తీసుకుంటామని రాష్ట్ర స్త్రీ, శిశుసంక్షేమ శాఖ మంత్రి పరిటాల సునీత ఇటీవల హెచ్చరించారు. మంత్రి ఆదేశాలను ఖాతరు చేయకుండా కాంట్రాక్టర్లు చిన్నసైజు గుడ్లను సరఫరా చేస్తూ అవినీతికి పాల్పడుతున్నారనే ఆరోపణలు న్నాయి. అధికారుల తోపాటు అంగన్‌వాడీ కార్యకర్తలూ మౌనంగా ఉంటున్నారు. ఐసీడీఎస్ ప్రాజెక్టుల్లో అంగన్‌వాడీ కేంద్రాలలో ప్రభుత్వం అన్న అమృతహస్తం పథకాన్ని అమలు చేస్తోంది. ఈ పథకం కింద కేంద్రాలకు వచ్చే గర్భిణులకు, తల్లులకు కోడిగుడ్లను అందజేయాల్సి ఉంది. ఈ పథకం ద్వారా అంగన్‌వాడీ కేంద్రాల చిన్నారులకు పౌష్టికా హారం, కోడిగుడ్లను కూడా అందించాల్సి ఉంది. కోడిగుడ్ల సరఫరా టెండర్లు దక్కించుకున్న కాంట్రాక్టర్లు నిబం. దనలకు తిలోదకాలిస్తున్నారు. 50గ్రాముల బరువు కోడిగుడ్లు సరఫరా చేయాలి. తక్కువ బరువున్న గోలీ వంటి కోడిగుడ్లను అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా చేస్తున్నారు. నెలవారీ లక్షలాది రూపాయలు దోపిడీ చేస్తున్నారు. వారి అవినీతికి అడ్డూ అదుపు లేదనే ఆరోపణలు వినవస్తున్నాయి.

చోద్యం చూస్తున్న అధికారులు

అంగన్‌వాడీ కేంద్రాలకు కాంట్రాక్టర్లు గోలీ వంటి గుడ్లను సరఫరా చేస్తున్న స్త్రీ, శిశుసంక్షేమ శాఖాధికారులు చోద్యం చూస్తున్నారు. వారి వ్యహారం అనుమానాలకు తావిస్తోంది. కాంట్రాక్టరు నుంచి అధికారులకు భారీగా ముడుపులు అందుతున్నాయనే ఆరోపణలు వెల్లువెత్తున్నాయి. గతంలోనూ తక్కువ బరువుతో కోడిగుడ్లు వచ్చిన విషయం తెలిసిందే. ఇకనైనా ఉన్నతా. దికారులు స్పందించి అంగన్‌వాడీ కేంద్రాలకు సక్రమంగా నిబంధనల ప్రకారం గుడ్లను అందించేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

ఏఎస్‌పేటలో అధ్వానంగా పారిశుధ్యం

- ఇళ్లలోకి చేరుతున్న మురుగు నీరు
- జనం అవస్థలు

ఏఎస్‌పేట: ఏఎస్‌పేటలో పారిశుధ్యం అధ్వానంగా తయారైంది. గ్రామంలోని ఆనకట్టవీధి, హరిజనవాడ, షఫాబావిసెంటర్, తదితర ప్రాంతాల్లో మురుగుకాలువలు చెత్తాచెదారాలతో నిండిపోయాయి. మురుగు నీరు పోయే దారిలేక పొర్లి రోడ్లపై ప్రవహిస్తోంది. ఆ నీరు ఇళ్లలోకి చేరి మడుగులా మారుతోంది. దుర్గంధం వెదజల్లుతోంది. దీంతో అంటువ్యాధులు ప్రబలుతాయని గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే మురుగు కాలువలు పొంగిపొర్లుతున్నాయనీ, వర్షం కురిస్తే పరిస్థితి మరీ దారుణమై ఒక్కసారిగా విషజ్వరాలు, అతిసారా వంటి వ్యాధులు వస్తాయనీ ఆవేదన చెందుతున్నారు. ప్రతి రోజూ వందల సంఖ్యలో యాత్రికులు వచ్చే గ్రామంలో పారిశుధ్యంపై దృష్టిసారించకపోవడం దారుణమని పలువురు విమర్శిస్తున్నారు. అద్దె రూముల్లో ఉంటున్న వారు చెత్తాచెదారాలను ఇళ్ల మధ్య ఖాళీస్థలాల్లో పడేస్తుండడంతో అవి డంపింగ్‌యార్డులను తలపిస్తున్నాయి. అవి పందులకు ఆవాసంగా మారాయి. వాటిని దూర ప్రాంతాలకు తరలించాలని ప్రజలు కోరుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. పారిశుధ్యం క్షీణిస్తోంది. వర్షాకాలంలో జ్వరాల సీజన్. చికున్ గున్యా, డెంగ్యూ వంటి జ్వరాలు ప్రబలే అవకాశం ఉంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రామంలో పారిశుధ్యపనులు చేపట్టి ఇళ్లలోకి మురుగునీరు రాకుండాతగిన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



ఏఎస్‌పేటలో ఇళ్ల మధ్య చేరిన మురుగునీరు

అద్దె పేర చేతివాటం

వాహనాల అద్దె పేరుతో అధికారులు నిధులు భోంచేస్తున్నారు. వాహన కొనుగోలు, డ్రైవర్ల జీతాలు, పెట్రోల్, డీజిల్ కొనుగోలు, మరమ్మతుల కారణంగా ఆర్థిక భారం పడుతుందని ప్రభుత్వం అద్దె వాహనాలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. కొందరు అధికారులు సొంత వాహనాలను ఉపయోగిస్తూ అధికంగా అద్దె సొమ్మును గుంజుతున్నారనే ఆరోపణలున్నాయి.

- వాటి స్థానంలో సొంత వాహనాలు
- అద్దె పెంపుతో అధిక మొత్తంలో బిల్లులు
- కానరాని పసుపురంగు బోర్డులు

చేజర్ల : జిల్లాలో వివిధ శాఖల అధికారులు ~200 నుంచి 300వరకూ అద్దె వాహనాలు ఉపయోగిస్తున్నారు. ఇందులో సగానికి పైగా సొంత వాహనాలనే ఉన్నట్టు సమాచారం. ప్రభ్వుం జిల్లాలో వివిధ ఇంజనీరింగ్ శాఖల్లో పనిచేస్తున్న డీఈ స్థాయి నుంచి ఉన్నతాధికారుల వరకూ అద్దె వాహనాలను ఇచ్చింది. అధికారులు ఎక్కువ బిల్లులుపెట్టి సొమ్మును సొంతం చేసుకుంటున్నారు. నిబంధనల ప్రకారం అద్దెకు పెట్టాలంటే వాహనం ట్యాక్సీ బోర్డు పసుపు రంగు బోర్డు కలిగి ఉండాలి. చాలా మంది అధికారులు తమ కుటుంబ సభ్యులు, బంధువులకు సంబంధించిన ఓన్‌బోర్డు తెలుపు రంగు సొంతవాహనాలను వాడుతున్నారు.

ప్రమాదం జరిగితే ప్రమాదమే...

సాధారణంగా అధికారులు వాడే అద్దె వాహనాలకు పసుపు రంగు బోర్డు ఉండాలి. ఏ సందర్భంలోనైనా ఇబ్బంది పడే పరిస్థితి ఉండదు. తెలుపు రంగు బోర్డు వాహనంలో ప్రయాణం చేసేటప్పుడు రోడ్డు ప్రమాదం జరిగితే ఫస్ట్ పార్టీ బీమా మాత్రమే వర్తిస్తుంది. అదే పసుపు రంగు బోర్డుకైతే వాహనంతో పాటు డ్రైవర్, ప్రయాణం చేసే వారికి మూడో పార్టీ బీమా వర్తిస్తుంది.

వాహనాల అద్దె పెంచుతూ ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం జివో నెంబరు87ను విడుదల చేసింది. గతంలో రూ.పది లక్షల లోపు విలువైన వాహనాలకు 2500 కిమీటర్ల వరకూ రూ. 24000 చెల్లించేది. అంతకుమించి తిరిగితే కిలో మీటరుకు మరికొంత అదనంగా చెల్లించేది. కొత్త జీవో ప్రకారం రూ. 15లక్షల విలువైన వాహనం 2500 కిలోమీటర్లు తిరిగితే నెలకు రూ. 60వేలు, పరిమితి దాటితే కిలోమీటరుకు అదనంగా రూ. 15 ఇస్తున్నారు. రూ.10-15లక్షలలోపు వాహనాలకు నెలకు రూ.45వేలు అదనంగా కిలోమీటరుకు రూ.12 అందించనున్నారు. రూ. 10లక్షలలోపు వాహ0నానికి నెలకు రూ. 35వేలు పరిమితి దాటితే కిలోమీటరుకు రూ. 10అదనంగా చెల్లించేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. దాంతో సొంత వాహనాలనే అద్దె వాహనాలుగా వాడుకుంటే నెలకు మరికొంత ఆదాయం వస్తుందని ఆశపడుతున్నారు.

జగన్ దిష్టిబొమ్మ దహనం

గూడూరు: సీఎం చంద్రబాబు నాయుడిపై ప్రతిపక్ష నాయకుడు వైఎస్ జగన్మోహన్‌రెడ్డి నంద్యాలలో చేసిన అనుచిత వాఖ్యలు అభ్యంతరకరంగా ఉన్నాయని వాటిని ఖండిస్తున్నామని టీఎన్ఎస్ఎఫ్ పట్టణ కార్యదర్శి వెంకటేష్ అన్నారు. శుక్రవారం స్థానిక టవర్‌క్లాక్ కేంద్రం వద్ద టీఎన్ఎస్ఎఫ్ ఆధ్వర్యంలో జగన్ దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మోడీసాయి, నవీన్, వెంకీ, సాయి పాల్గొన్నారు.



భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీ వ్రత పూజలు



గూడూరు: రాజరాజేశ్వరి దేవస్థానంలో పోటెత్తిన భక్తులు

గూడూరు: శ్రావణ శుక్రవారం, వరలక్ష్మీవ్రతాన్ని పురస్కరించుకుని పట్టణంలో అమ్మవార్ల ఆలయాల్లో శుక్రవారం ప్రత్యేక పూజలు, వ్రతాలు నిర్వహించారు. మహిళలు వేకువనే లేచి స్నానాలు ఆచరించి అమ్మవారిని దర్శించుకుని వ్రతాల్లో పాల్గొన్నారు. స్థానిక రాజరాజేశ్వరి అమ్మవారు ప్రత్యేక అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. విశేష పూజలు నిర్వహించి సామూహిక కుంకుమ పూజలు చేశారు. ఆరాయణమ్మ పేరంట్రాళ్లు, కన్యకా పరమేశ్వరి, గంగమ్మ, మహాలక్ష్మమ్మ ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేసి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. స్థానిక సాయి సత్సంగ నిలయంలో నిర్వాహకులు కోట సునీల్‌కుమార్, కోట ప్రకాశంల ఆధ్వర్యంలో ఉదయం అమ్మవారికి అభిషేకం, అష్టోత్తర పూజ, సామూహిక వరలక్ష్మి వ్రత పూజలు వైభవంగా నిర్వహించారు.

చిల్లకూరు: తూర్పుకనుపూరు ముత్యాలమ్మ అమ్మవారి ఆలయంలో అమ్మవారిని ప్రత్యేకాలంకారంలో ఉంచి విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వరలక్ష్మి వ్రతం సందర్భంగా 200 మంది మహిళా భక్తులు సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ఈవో కోవూరు జనార్దన్‌రెడ్డి ఆధ్వర్యంలో భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

వాకాడు: శ్రావణ శుక్రవారం, వరలక్ష్మీవ్రతం మండలంలోని పలు ప్రాంతాల ప్రజలు భక్తిశ్రద్ధలతో ఆచరించారు. వాకాడు గొల్లపాళెంలో చతుర్భుజ మహాలక్ష్మి ఆలయం, గంగనపాళెం మహాలక్ష్మమ్మ, తూపిలి పోలేరమ్మ, నెల్లిపూడి దేశమ్మ, వాకాడు నాగార్పమ్మ తదితర ఆలయాల్లో మహిళా భక్తులు సమూహిక వ్రతం చేశారు. ఈసందర్భంగా ఆయా ఆలయాలలో అమ్మవార్లు ప్రత్యేక అలంకరణతో భక్తులకు దర్శనమిచ్చారు. అధిక సంఖ్యలో భక్తులు వ్రతంలో పాల్గొని తీర్థప్రసాదాలను స్వీకరించారు.

కోట: మండలంలోని పలు గ్రామాలలో అమ్మవారి ఆలయాల్లో వరలక్ష్మీవ్రతం వేడుకలు వైభవంగా నిర్వహించారు. కోట గ్రామదేవత కోటమ్మ, గూడలిలో పర్వతవర్ధిని భీమేశ్వర ఆలయం, కామాక్షిదేవి, చాముండేశ్వరీ ఆలయాల్లో మహిళలు వరలక్ష్మి వతం పూజలు నిర్వహించారు. ఆలయాల ప్రాంగణాల్లో దీపాలు వెలిగించి భక్తిశ్రద్ధలతో అమ్మవారిని దర్శించుకుని మొక్కలు తీర్చుకున్నారు. అర్చకులు మహిళా భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు.



గూడూరు: సాయిసత్సంగ నిలయంలో వ్రత పూజల్లో భక్తులు



గూడూరు: నారాయణమ్మ ఆలయంలో ..



చిల్లకూరు: ప్రత్యేక అలంకారంలో ముత్యాలమ్మ



వాకాడు: ప్రత్యేక అలంకరణలో చతుర్భుజ మహాలక్ష్మి



చిల్లకూరు: కుంకుమ పూజల్లో భక్తులు

గురుకులాల అభివృద్ధికి నిధులు మంజూరు చేయండి

గూడూరు: నియోజకవర్గంలోని గురుకుల పాఠశాలల అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని రాష్ట్ర మంత్రి నక్కా ఆనంద్‌బాబుకు ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ శుక్రవారం ఏపీ సచివాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీల్‌కుమార్ మాట్లాడుతూ నియోజకవర్గంలో పేద విద్యార్థులు చదివేందుకు గురుకుల పాఠశాలలను బలోపేతం చేసేలా కృషి చేస్తున్నామన్నారు. నియోజకవర్గంలోని గురుకుల పాఠశాలలను సందర్శించి పలు అభివృద్ధి పనుల శంకుస్థాపనలకు రావాలని మంత్రిని ఆహ్వానించినట్లు తెలిపారు.

ఎమ్మార్పీఎస్ నాయకుల నిరసన దీక్ష

గూడూరు(రూరల్): స్థానిక గ్రామసేవకుల భవనం వద్ద ఎమ్మార్పీఎస్ నాయకులు నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షలు శుక్రవారం 14వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షా శిబిరంలో నాయకులు మోకాళ్లపై నిలబడి తమ నిరసనను వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రచార కార్యదర్శి మంద కృష్ణయ్య మాట్లాడుతూ వర్గీకరణ బిల్లు అమలు అయ్యేంత వరకు ఉద్యమిస్తామన్నారు. శీతాకాల పార్లమెంట్ సమావేశాలలో వర్గీకరణ బిల్లుకు చట్టభద్దత కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు పెంచలయ్య, శ్రీనివాసులు, నాగరాజు, రవి తదితరులు పాల్గొన్నారు.

పోటుపాళెంలో తల్లిపాల వారోత్సవాలు

గూడూరు(రూరల్): పోటుపాళెం అంగన్వాడీ కేంద్రం పరిధిలో శుక్రవారం తల్లిపాలఎ ారోత్సవాలలో భాగంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్వైజర్ మహబూబీ మాట్లాడుతూ పుట్టిన బిడ్డకు గంటలోపు తల్లి ముర్రుపాలు తాగించాలన్నారు. దీంతో చిన్నారులకు రోగనిరోధక శక్తి పెరిగి ఆరోగ్యంగా ఉంటారన్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది ఉష, పరమేశ్వరి, మల్లీశ్వరి, గర్భిణులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

కక్కయ్యస్వామి ఆరాధన గోడపత్రిక ఆవిష్కరణ



గోడపత్రిక ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

గూడూరు(టౌన్): పట్టణంలోని ఆరుంధతీయవాడలో శుక్రవారం ఆదిజాంబవ ధర్మరక్ష సమితి ఆధ్వర్యంలో నిర్వహించనున్న కక్కయ్యస్వామి, ముత్తెమ్మల ద్వితీయ ఆరాధన మహోత్సవానికి సంబంధించిన గోడపత్రికను శుక్రవారం నిర్వాహకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సమితి జిల్లా ప్రచార కార్యదర్శి గూడూరు గోపాల్ మాట్లాడుతూ వీరబ్రహ్మేంద్రస్వామి ప్రియశిష్యుడైన కక్కయ్యస్వామి, ముత్తెమ్మల ద్వితీయ ఆరాధన మహోత్సవం ఈ నెల 17 నుంచి 19వ తేదీ వరకు నిర్వహించనున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ గోవిందు మస్తానమ్మ, మమూడూరు హరికృష్ణ, హరి, రమణయ్య, గోవిందయ్య, రవి, పెంచలయ్య, ఏడుకొండలు పాల్గొన్నారు.

గురుకులం విద్యార్థులకు ఎమ్మార్ వ్యాక్సిన్

కోట: పట్టణంలోని శ్రీలక్ష్మమ్మ గిరిజనకాలనీ, శ్యామసుందరపురం, ఎస్సీ, బీసీ గురుకుల పాఠశాలల్లో చిన్నారులకు శుక్రవారం ఎమ్మార్ వ్యాక్సిన్ వేశారు. చిట్టేడు పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ ఇందీవర ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో గురుకులాల ప్రిన్సిపాళ్లు నోవాబాబు, సుబ్బారావు పాల్గొన్నారు.

డ్రైనేజీ సమస్య పరిష్కారానికి కృషి

గూడూరు(టౌన్): పట్టణంలోని కోనేటిమిట్టలో నూతనంగా నిర్మించిన డ్రైనేజీ కాలువ సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని మున్సిపల్ కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం కాలువను ఆయన పరిశీలించి మాట్లాడుతూ డ్రైనేజీ కాలువ గుండా ప్రవహించే మురుగు ఆసుపత్రి రోడ్డులో ఉన్న ప్రధాన కాలువకు అనుసంధానం చేస్తూ డ్రైనేజీ కాలువను నిర్మించామన్నారు. అయితే నిర్మాణంలో లోపం కారణంగా మురుగు ప్రధాన డ్రైనేజీ కాలువకు చేరుకోలేని పరిస్థితి ఏర్పడిందని స్థానికులు తన దృష్టికి తీసుకువచ్చారన్నారు. దీంతో ఈ కాలువను సరి చేసి మురుగు నిల్వ చేరకుండా చర్యలు చేపడుతామన్నారు. ఈ మేరకు అధికారులను చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పిళ్లెళ్ల శ్రీనివాసులు, కొణతం సురేష్ తదితరులు పాల్గొన్నారు.



స్థానికులతో మాట్లాడుతున్న కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్రగాయాలు

చిల్లకూరు: రామారెడ్డిపాళెం గ్రామ సమీపంలో ఉన్న వంతెనను బైకు ఢీకొన్న సంఘటనలో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికుల కథనం మేరకు.. అంకులపాటూరు గ్రామానికి చెందిన ఆశోక్, కిషోర్, చందు అనే యువకులు శుక్రవారం బైకుపై చింతవరం వెళ్లి తిరిగి గ్రామానికి వస్తూ రామారెడ్డిపాళెం గ్రామ సమీపంలో ఉన్న వంతెన గోడను అదుపు తప్పి ఢీకొని పడ్డారు. దీంతో వీరికి తీవ్రగాయాలయ్యాయి. గాయపడిన వీరిని చికిత్సనిమిత్తం 108 సిబ్బంది కృష్ణ, ప్రసాద్‌లు గూడూరు ఏరియా ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకు తరలించారు.



రక్తగాయాలతో ఆశోక్



తీవ్రంగా గాయపడిన కిషోర్

సినిమాగైడ్

గూడూరు

శ్రీనివాస్ తేజ:	డీజే
సుందరమహల్:	వాసుకి
సీవీ :	ఫిదా
సంగం:	గౌతమనంద

కోట

ఆర్ఆర్‌టి :	ఫిదా
రామ్‌రాజ్:	దండుపాళ్యం -2
అరుణ:	గౌతమనంద

వృద్ధులకు దుప్పట్ల పంపిణీ

కోట: పట్టణంలోని సారంగంవారివీధిలో శుక్రవారం 350 మంది నిరుపేద వృద్ధులకు దుప్పట్లను టీడీపీ నాయకులు తీగల సురేష్‌బాబు పంపిణీ చేశారు. సురేష్‌బాబు తల్లి తీగల భువనేశ్వరి ప్రథమ వర్ధంతిని పురస్కరించుకొని స్థానిక దళిత, గిరిజనవాడలకు చెందిన వృద్ధులకు దుప్పట్లను అందజేశారు. ఇలాంటి సేవా కార్యక్రమాలను తన తల్లిపేరుతో ప్రతి ఏటా కొనసాగిస్తామని తీగల సురేష్‌బాబు తెలిపారు. వృద్ధులకు సేవ చేయడం ద్వారా ఆత్మ సంతృప్తి కలుగుతుందన్నారు. అనంతరం ఆయా ప్రాంతాల పేదలకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో తీగల కృష్ణయ్య, న్యాయవాది అత్తికాయల మోహన్ తదితరులు పాల్గొన్నారు.

అధికారుల నిర్లక్ష్యంతో అందని వేట విరామ నగదు

వాకాడు: మత్స్యశాఖ అధికారుల నిర్లక్ష్యం కారణంగా వేట విరామ నగదు ఇంతవరకు అందలేదని టీడీపీ బీసీసెల్ నాయకులు వళ్లీ ప్రసాద్ ఆధ్వర్యంలో మత్స్యకారులు శుక్రవారం మండల కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని 9 పంచాయతీల్లో మత్స్యకారులు సముద్రంలో చేపల వేటే జీవనాధారంగా జీవిస్తున్నారని, అయితే ప్రతి ఏటా మత్స్యశాఖ అధికారుల నిర్లక్ష్య వైఖరితో రెండేళ్లగా విరామ నగదు సక్రమంగా అందడం లేదని వాపోయారు. ఈ ఏడాది కూడా వేట విరామ సమయం ముగిసి 2 నెలలు కావస్తున్నా ఇంత వరకు పరిహారం నగదు తమకు అందలేదన్నారు. ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు, స్టేట్ బ్యాంకులలో ఖాతా ఉన్న మత్స్యకారులకు మాత్రమే నగదు జమ అయిందని, ఆంధ్రాబ్యాంకులో ఖాతా కలిగిన సుమారు 1000 మందికి పైగా మత్స్యకారులకు నగదు అందలేదని, అధికారులను అడిగితే పొంతన లేని సమాధానాలు చెబుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి నగదు పరిహారం అందేలా చూడాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో మత్స్యకారులు పాల్గొన్నారు.

● ఇంటర్వ్యూ



ఎరువుల విక్రయానికి బయోమెట్రిక్ తప్పనిసరి

● విజయభారతి, వ్యవసాయాధికారి

? ఎరువుల విక్రయానికి బయోమెట్రిక్ విధానం అమవుతుందా.

! రైతులకు అవసరమైన ఎరువులకు బయోమెట్రిక్ విధానం గత నెలలోనే అమల్లోకి వచ్చింది. ఈ విధానంపై డీలర్లకు ఉన్నతాధికారులు ప్రస్తుతం రెండో విడత శిక్షణ ఇస్తున్నారు. ఇప్పటికే 50 శాతం ఈ-పాస్ మిషన్లు కూడా డీలర్లకు పంపిణీ చేశారు.

? బయోమెట్రిక్ విధానం ద్వారా రైతులకు ఎలాంటి ప్రయోజనాలు చేకూరుతాయి.

! రైతులు సాగు చేసిన పంటకు అవసరానికి మించి రసాయనిక ఎరువులు వాడుతున్నారు. వీటి వాడకాన్ని తగ్గించడానికి ప్రభుత్వం ఇలాంటి విధానాన్ని ప్రవేశపెట్టింది. దీని ద్వారా వ్యవసాయ భూమికి కీడు తగ్గి సారవంతంగా మారి అధిక దిగుబడి వస్తుంది.

? మండలంలో ఎంతమంది రైతులకు సబ్సిడీపై వ్యవసాయ పరికరాలు అందించారు.

! మండలంలోని 225 మంది రైతులకు రోటావేటర్, తైవాన్ స్ప్రేయర్, ట్రాక్టర్ సంబంధిత వస్తువులు, టార్పలిన్ వంటి వ్యవసాయ పరికరాలు సబ్సిడీపై అందించాం.

- వాకాడు



పేదలకు నిత్యావసర వస్తువులు తక్కువ ధరకు అందజేసేందుకు నిర్దేశించి ఏర్పాటు చేసిన చౌకధరల దుకాణాల్లో ప్రజలకు నిత్యావసర వస్తువులు లభించడం లేదు. దశలవారీగా వస్తుల సరఫరాలో కోత విధిస్తున్న ప్రభుత్వం ఇప్పటికే పప్పులు, గోధమ పిండి, పామాయిల్ తదితర వస్తువులకు ఎప్పుడో మంగళం పాడిన ప్రభుత్వం రెండు నెలల క్రితం కిరోసిన్ సరఫరా నిలిపివేసింది. ప్రస్తుతం చక్కెర కట్ చేసింది. ఇలా నెలకొక వస్తువును నిలిపివేస్తూ ప్రజా పంపిణీ వ్యవస్థను నిర్వీర్యం చేస్తోంది. రేషన్ షాపుల్లో ప్రస్తుతం బియ్యం ఒక్కటే చౌకగా లభిస్తున్నాయి. ఎప్పటికప్పుడు ఒక్కో వస్తువును కట్ చేస్తున్న ప్రభుత్వం బియ్యం కూడా నిలిపివేస్తుందేమోనన్న అనుమానాలు వ్యక్తమవుతోన్నాయి. ఇదే పరిస్థితి కొనసాగితే పేదలకు గుక్కెడు గంజి దొరకడం కూడా గగనమవుతోంది. - వాకాడు

బియ్యమే 'చౌక'..!

- రేషన్‌షాపుల్లో అందని నిత్యావసరాలు
- రెండు నెలల క్రితం కిరోసిన్ నిలిపివేత
- ఈ నెల చక్కెర కట్
- ప్రజా పంపిణీ వ్యవస్థ నిర్వీర్యం

ప్రభుత్వ విధానాలతో ప్రజా పంపిణీ వ్యవస్థ నిర్వీర్యమవుతోంది. దీంతో తెల్లరేషన్ కార్డులు తెల్లబోతున్నాయి. చౌకధరల దుకాణాలు కేవలం బియ్యంకే పరిమితమయ్యాయి. గతంలో పంపిణీ చేస్తున్న చక్కెర, కిరోసిన్, గోధమపిండి, పామాయిల్ వస్తువులు నెలకొకటిగా పంపిణీ జరగకుండా ఆగిపోతున్నాయి. ఈ నెలలో కేవలం అంత్యోదయ కార్డులకు మాత్రమే కిలో చక్కెర అందజేసి మిగిలిన కార్డుదారులకు చక్కెరకు బ్రేక్ వేశారు. ఫలితంగా చౌక ధరల దుకాణాలు కేవలం బియ్యం పంపిణీకే పరిమితమయ్యాయి. జిల్లాలో 29,980 రేషన్ షాపులకుగాను 1,42,09,657 రేషన్ కార్డులున్నాయి. అందులో వాకాడు మండలంలో 32 షాపులకుగాను 12,643 రేషన్ కార్డులున్నాయి. అయితే వాటిలో 754 అంత్యోదయ కార్డులకు మాత్రమే చక్కెర పంపిణీ చేస్తున్నారు. గత ఎన్నికల్లో రూ.185కే 9 రకాల సరుకులు పంపిణీ చేస్తామన్న చంద్రబాబు చేసిన వాగ్దానం గాలిలో దీపంలా మారింది. కొత్త సరుకులు పంపిణీ చేయకపోయినా పరవాలేదు, ఉన్న సరుకుల సరఫరాను నిలిపితే తమ బతుకులు ఎలా అని ప్రజలు వాపోతున్నారు. గతంలో కిరోసిన్, గోధమపిండి, పామాయిల్ (నూనె), చక్కెర పంపిణీ చేస్తుంటే పేదలు ఎంతో సంతోషించేవారు. ప్రస్తుతం అన్నీ నిలిపివేసి బియ్యం ఒక్కటే ఇస్తుండటంతో మిగిలిన వస్తువులకు అధిక మొత్తం లో నగదు వెచ్చించాల్సి రావడంతో లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు.

● మండుతున్న ధరలు

రేషన్ షాపులో అరకిలో చక్కెర రూ. 6.75, కిరోసిన్ లీటరు రూ.19, కిలో గోదుమ పిండి రూ.16కు అందజేసేవారు. వాటికి మంగళం పాడేయడంతో బహిరంగ మార్కెట్‌లో కిలో చక్కెర రూ. 40, కిరోసిన్ లీలరు రూ.60, గోదుమ పిండి కిలో రూ. 40, పామాయిల్ రూ.70 చొప్పు కొనుగోలు చేయాల్సి వస్తుందని రేషన్ లబ్ధిదారులు వాపోతున్నారు.

● పేదలకు తప్పని తిప్పలు

బహిరంగ మార్కెట్‌లో నిత్యావసర సరుకుల ధరలు నింగినంటుతుండటంతో పేదలు సరుకులు కొనలేని పరిస్థితులు నెలకొంటున్నాయి. ఈ క్రమం లో కొందరు పచ్చడి మెతుకులకు పరిమితం కాగా మరి కొందరికి గంజి కూడే గతవుతోందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా చౌక దుకాణాలలో మునుపటి వలె నిత్యావసర సరుకులు పంపిణీ చేయాలని రేషన్ లబ్ధిదారులు కోరుతున్నారు.



రేషన్ షాపులో సరుకులు తీసుకొంటున్న లబ్ధిదారులు

నిత్యావసర సరుకులు అందించాలి

చౌక ధరల దుకాణాల్లో ముందులాగానే అన్ని సరుకులు అందించాలి. అసలే 2 ఏళ్లుగా కరువుతో అల్లాడుతున్నాం. ఇలాంటి సమయంలో రేషన్ సరుకులు కూడా నిలిపివేస్తే ఎలా బతకాలి. ఒక్కొక్కటిగా నిలిపివేయడం ప్రభుత్వానికి తగదు. ఎప్పటిలాగే రేషన్ షాపులో రాయితీ సరుకులన్నింటిని తప్పని సరిగా అందించాలి.



- కావలి రవి

కేవలం బియ్యమేనా..

కూలీనాలీ చేసుకుని జీవనం సాగించే వారికి రేషన్ సరుకుల నిలిపివేత పెద్ద షాకనే చెప్పాలి. కేవలం రేషన్ షాపుల్లో వచ్చే సరుకులపైనే ఆధారపడి జీవించే వాళ్లు చాలామంది ఉన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఉన్నపలంగా పేద ప్రజల నోటికాడ కూడు లాగేయటం సరికాదు. ఇలాగైతే కేవలం రేషన్ బియ్యానికే చౌక దుకాణాలెందుకు.



- బుజ్జమ్మ

ప్రతిభ ఉంటేనే ఉద్యోగ అవకాశాలు

కోట: ఇంజనీరింగ్‌లో విద్యార్థులు తమ ప్రతిభా పాటవాలను నిరూపించుకుంటే భవిష్యత్తులో అపారమైన ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని ఎన్‌బీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాల డైరెక్టర్ డాక్టర్ విజయకుమార్‌రెడ్డి అన్నారు. మండలంలోని విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం టీసీఎస్ కంపెనీ నిర్వహించిన పోటీలలో ఎంపికైన విద్యార్థులను ఆయన అభినందించారు. ప్రతి సంవత్సరం ప్రతిష్ఠాత్మకంగా టీసీఎస్ కంపెనీ నిర్వహిస్తున్న కోడ్‌విట కోడింగ్ పోటీలలో భాగంగా ఈ ఏడాది కూడా ఆ సంస్థ కంప్యూటర్ సైన్స్ ఫైనల్ బీటెక్ చదువుతున్న విద్యార్థులకు ఈ పోటీలను నిర్వహించారని విజయకుమార్ తెలిపారు. ఈ పోటీలలో రాష్ట్ర స్థాయిలో కళాశాలలో ఫైనల్ బీటెక్ చదువుతున్న ఎం.రేవంత్ 133వ ర్యాంక్, శ్రీరామ్ లోకేష్ 491వ ర్యాంక్‌ను సాధించారన్నారు. దీంతో ఆ విద్యార్థులను అభినందిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా విజయకుమార్ మాట్లాడుతూ తమ కళాశాల నుంచి ఇలాంటి పోటీలలో విద్యార్థులు ఎంపికకావడం అభినందనీయమన్నారు. ఎంపికైన విద్యార్థులకు ప్రాంగణ ఎంపికలలో రాత పరీక్షలు లేకుండా నేరుగా ఇంటర్‌లోకి అనుమతిస్తారని ప్రాంగణ ఎంపికల అధికారి డాక్టర్ కిషందర్ తెలిపారు. కంప్యూటర్స్ విభాగాధిపతి మారుతీ పెరుమాల్ మాట్లాడుతూ తమ కళాశాలలో ఉన్న విద్యార్థులకు కోడింగ్‌పై ప్రత్యేక శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.



ఎంపికైన విద్యార్థులతో డైరెక్టర్ విజయకుమార్‌రెడ్డి

ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ పట్టివేత

కోట: గూడలి స్వర్ణముఖినది నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్లపై రెవెన్యూ అధికారులు దాడులు నిర్వహించారు. చిట్టేడుకు చెందిన ఒక ట్రాక్టర్ ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తుండటంతో వీఆర్‌వోలు శివయ్య, జగదీష్‌లు పట్టుకుని పోలీసులకు అప్పగించారు. పరిశీలించిన తహసీల్దారు రోజ్‌మాండ్ ఆ ట్రాక్టర్‌కు అనుమతి ఉన్నట్లు గుర్తించి వదిలివేశారు.

జాతీయ ఉపకార వేతనానికి విద్యార్థిని ఎంపిక

కోట: పట్టణంలోని ప్రగతి విద్యా సంస్థలో ఇంటర్మీడియట్ చదివిన బేబి విజయ ఇంటర్మీడియట్ ఎంపీసీ గ్రూపులో 987 మార్కులు సాధించి కేంద్ర ప్రభుత్వం ఇచ్చే జాతీయ ఉపకార వేతనానికి ఎంపికైంది. దీంతో ఆ విద్యార్థినిని విద్యాసంస్థల చైర్మన్ పసుపులేటి కిషోర్ శుక్రవారం అభినందించారు. ఈ విద్యార్థినిక ఏడాదికి రూ.80వేల వంతున 5 ఏళ్ల పాటు ఉపకార వేతనం అందుతుందని చైర్మన్ కిషోర్ తెలిపారు.



బేబి విజయ

7న మెగా జాబ్‌మేళా

నాయుడుపేటరూరల్ : నాయుడుపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆగస్టు 7వ తేదీ సోమవారం మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ జి. సరళ కుమారి శుక్రవారం తెలియజేశారు. ఐసీఐసీఐ బ్యాంక్, టీవీఎస్ సంస్థల ఆధ్వర్యంలో సేల్స్ ఆఫీసర్ ఉద్యోగాల కోసం ఈ జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఏదైనడిగ్రీ, పీజీ విద్యార్థులు అర్హుల న్నారు. అర్హత కలిగిన వారు ఒరిజనల్ సర్టిఫికెట్లు, ఆధార్‌కార్డు, రెండు పాసుపోర్టు సైజు ఫోటోలతో ఆ రోజు ఉదయం 9 గంటలకు హాజరుకావాలని తెలిపారు. మరెన్ని వివరా లకు 9491741151, 9492331003 నెంబర్లకు సంప్రదించవచ్చన్నారు.

'శ్రావణ' శోభ

● వైభవంగా వరలక్ష్మీ వ్రతాలు ● కిటకిటలాడిన ఆలయాలు


సూళ్లూరుపేట: గాజుల అలంకారంలో కన్యకా పరమేశ్వరి

నాయుడుపేట రూరల్: సామూహిక వరలక్ష్మీవ్రతం చేస్తున్న మహిళలు



భక్తులకు అంబలి పంపిణీ

నాయుడుపేట : హిందూ స్త్రీలకు ఎంతో ప్రీతిపాత్రమైన శ్రావణమాసంలో వచ్చే రెండవ శుక్రవారం వరలక్ష్మీ వ్రతం విశిష్టతను సంతరించుకుంది. నాయుడుపేట మండలం లోని అన్ని ఆలయాలలో అమ్మవార్లను ప్రత్యేక అలంకరణతో వరలక్ష్మీ వ్రతాలను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. శ్రావణమాసం అత్యంత పవిత్రమైందని, అందులో ఈ మాసంలో వచ్చే రెండో శుక్రవారం మహలక్ష్మీదేవికి అత్యంత ప్రీతిపాత్రమైందని ఆరోజు వరలక్ష్మీ వ్రతాలు చేస్తే ఆ ఇంట సిరిసంపదలు తులతూగుతా యని భక్తుల ప్రగాఢ విశ్వాసం. ఈ సందర్భంగా పట్టణంలోని గ్రామదేవత శ్రీ పోలేరమ్మ అమ్మవారిని గాజులతో ప్రత్యేకంగా అలంకరించారు. అమ్మవారికి వచ్చే భక్తులకు అంబళ్లు పంపిణీ చేశారు. శివాలయంవీధిలోని శ్రీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారిని వివిధ పుష్పాలతో విశేష అలంకరణ చేశారు. ఆలయంలో మహిళా భక్తులు భక్తి శ్రద్ధలతో సామూహిక వరలక్ష్మీ వ్రతాలను ఆచరించారు. మూకాంబిక ఆలయం, అంకమ్మ ఆలయంలో అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు.

సూళ్లూరుపేట : సూళ్లూరుపేట చిత్రకూటమి వద్ద ఉన్న కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారిని శుక్రవారం అమ్మవారికి గాజుల అలంకారం చేశారు. శ్రావణ శుక్రవారం సందర్భంగా ఈ ప్రత్యేక అలంకారం జరిగింది. ఉభయకర్తగా ఓరేటి సుబ్రహ్మణ్యం బ్రదర్స్ పాల్గొన్నారు. సాయంత్రం పల్లకీసేవ జరిగింది.

తడ : వరలక్ష్మీ వ్రతం పర్వదినాన్ని పురస్కరించుకొని పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి. మండల పరిధిలోని చినమాంబట్టు కాశీవిశ్వేశ్వర అన్నపూర్ణదేవి ఆలయంలో ఉదయం నుంచి ప్రత్యేక పూజలు జరిగాయి. ఈ సందర్భంగా ప్రత్యేకంగా అన్నపూర్ణాదేవికి కుంకుమపూజ జరిగింది. ఈ సందర్భంగా భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాలకు కుప్పంపాటి కృష్ణయ్య, నాగమ్మ దంపతులు ఉభయదాతలుగా వ్యవహరించారు. అనంతరం అన్నదాన శాశ్వతనిధికి 50వేల రూపాయల విరాళాన్ని ఉభయదాతలు ప్రకటించారు. ఈ కార్యక్రమాలను తిరుపతి సిమ్స్‌వైద్యులు అన్నదాన సమాజ వ్యవస్థాపకులు డాక్టర్ మునస్వామి, రిటైర్డ్ డీఎస్పీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

చిట్టమూరు: మండలంలోని అమ్మవారి ఆలయాలు శుక్రవారం కిటకిటలాడాయి. వరలక్ష్మీ వ్రతం సందర్భంగా మహిళలు అధిక సంఖ్యలో విచ్చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు.


తడ: వ్రతం చేస్తున్న మహిళలు


తడ: ఆరూరు దేవాలయంలో భక్తుల రద్దీ


తడ: భక్తులకు అన్నదానం

టపాకాయల తయారీని నిలిపివేయాలి

సూళ్లూరుపేట : సూళ్లూరుపేట, తడల్లో అక్రమంగా టపాకాయల తయారీని చేపడుతుంటే వెంటనే నిలిపివేయాలని సూళ్లూరుపేట అగ్నిమాపక దళ అధికారి సుధాకర్ ఓ ప్రకటనలో హెచ్చరించారు. ప్రభుత్వం అనుమతి లేకుండా టపాకాయలు తయారుచేయడం కానీ, అమ్మటం, నిల్వచేయడం చేయరాదని నిల్వగోదాములకు సైతం అనుమతులు ఉండాలని అలా లేనిచో కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన ఆ ప్రకటనలో హెచ్చరించారు.

రవాణా కార్యాలయాన్ని తనిఖీ చేసిన ఆర్టీవో



రవాణాశాఖ చెక్‌పోస్టు వద్ద గూడూరు ఆర్టీవో చందర్

తడ : గూడూరు ఆర్టీవో చందర్ శుక్రవారం భీములవారిపాళెం చెక్‌పోస్టు రవాణా శాఖ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యాలయంలో రికార్డులను తనిఖీ చేసిన అనంతరం సీజ్ చేసిన వాహనాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. వాటిపై తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. ఆర్టీవో వెంట ఎంవీఐ చంద్రశేఖర్‌రెడ్డి, ఏఎంవీఐ సుందరరావు, తదితరులు ఉన్నారు.

కారుపై మినీలారీ బోల్తా

తడ : రాంగ్‌రూట్‌లో వచ్చిన ఓ మిని లారీ కారుపై బోల్తాపడింది. వివరాలు ఇలా ఉన్నాయి. చిత్తూరుజిల్లా కాటూరు గ్రామానికి చెందిన రమేష్ తన సొంత కారులో శుక్రవారం సాయంత్రం చెన్నైకు బయలుదేరాడు. మార్గమధ్యలో తడ ఫ్లైవర్ బ్రిడ్జిపై వెళ్తుండగా చెన్నై నుంచి సూళ్లూరుపేట వైపు వెళ్తున్న చేపల లోడ్ మినీలారీ అదే దారిలో రాంగ్‌రూట్‌లో వస్తూ అదుపుతప్పి కారుపై బోల్తా కొట్టింది.

ఈ ప్రమాదంలో మినీలారీ కారుపై పడటంతో ముందుభాగం అంతా నుజ్జునుజ్జు అయ్యింది. కారులోని వ్యక్తులకు గాని, లారీ సిబ్బందికి కాని ఎటువంటి గాయాలు కాలేదు. వెంటనే హైవే అధికారులు రోడ్డుకు అడ్డంగా పడిపోయిన రెండు వాహనాలను పక్కకు తొలగించారు. దీంతో ట్రాఫిక్ సమస్య తొలగిపోయింది. పోలీసులు మినీ లారీ డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


కారుపై బోల్తా పడ్డ మినీ లారీ

హమ్మయ్య.. చల్లబడింది..!

నాయుడుపేట : వాతావరణంలో వచ్చిన మార్పుల కారణంగా శుక్రవారం సాయంత్రం నాయుడుపేటలో హఠాత్తుగా వర్షం పడింది. ఇటీవల మబ్బుల దోబూచులాటలో చినుకు జాడ కానరాలేదు. దీంతో ఎండలు రోజుకు రోజుకు పెరిగిపోయాయి. ఈ నేపథ్యంలో శుక్రవారం సాయంత్రం వాతావరణంలో మార్పులు చోటుచేసుకుని చల్లటి గాలులు వీయడంతోపాటు తేలికపాటి వర్షం కురిసింది. దీంతో ఒక్కసారిగా వాతావరణం చల్లబడింది. కాగా వరలక్ష్మీ వ్రతం సందర్భంగా ఆలయాలకు వెళ్లే భక్తులు ఇక్కట్లు పడ్డారు.


చిన్నదర్గావీధిలో కురుస్తున్న వర్షం

అర్హులందరికీ పక్కాగృహాలు : ఎంపీడీవో

నాయుడుపేటరూరల్ : అర్హత కలిగిన నిరుపేదలందరికి ప్రభుత్వం పక్కాగృహాలు మంజూరు చేస్తుందని నాయుడుపేట ఎంపీడీవో శివయ్య తెలిపారు. మండలంలోని భీమవరం గ్రామంలో శుక్రవారం లబ్ధిదారులకు పక్కాగృహాల ఎంపికపై ఎంపీపీ కన్నెమ్మ, సర్పంచి అనిత అధ్యక్షతన జరిగిన గ్రామసభలో ఆయన మాట్లాడారు. ఇంటింటా నిర్వహించిన పల్స్ సర్వే ప్రకారం నిరుపేదలందరికి అర్హతనుబట్టి ఇళ్లు మంజూరుచేసే అవకాశం ఉంటుందన్నారు. ఎంపీపీ కన్నెమ్మ మాట్లాడుతూ నిరుపేదలైన కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం పక్కాగృహాలను మంజూరు చేస్తుందని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి సుధీర్‌బాబు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎంపీడీవో శివయ్య

పర్వతారోహితుడికి ఆర్థిక సాయం

బుచ్చిరెడ్డిపాళెం: బుచ్చిరెడ్డిపాళెం అపస్మా గ్రూప్ స్కూల్స్ నిర్వాహకుడు శుక్రవారం పెనుబల్లి గ్రామానికి చెందిన పర్వతారోహితుడు కోరికల వెంకటసూర్యప్రకాష్ రూ.13,000 ఆర్థిక సహాయం అందజేశారు. పెనుబల్లి గ్రామానికి చెందిన సూర్యప్రకాష్ ఆగస్టు 15వ తేదీన దక్షిణాఫ్రికాలోని కిలిమంజారో పర్వతాన్ని అధిరోహించి అక్కడ జాతీయ జెండాను ఎగురవేయాలని ఆయన చేస్తున్న ప్రయత్నం విజయవంతం కావాలని ఈ సందర్భంగా పలు ప్రైవేటు స్కూల్స్ యాజమాన్యాలు ఆకాంక్షించారు. మళ్లి మస్తాన్‌బాబులాగా సూర్యప్రకాష్ గిన్నీస్‌బుక్, వరల్డ్‌రికార్డు సాధించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అపస్మా కోవూరు నియోజకవర్గ అధ్యక్షుడు వీవీ కృష్ణారెడ్డి, ప్రైవేటు స్కూళ్ల కరెస్పాండెంట్లు శ్రీధర్, మస్తాన్‌సాహెబ్, గణేష్, అయూబ్‌ఖాన్ పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ కమిటీ ఎన్నిక

సూళ్లూరుపేట : స్థానిక మహాదేవయ్యనగర్‌లోని ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో జరిగిన సూళ్లూరుపేట డివిజన్‌స్థాయి సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. ముఖ్య అతిథిగా జిల్లా ఎస్ఎఫ్ఐ కార్యదర్శి రమణ హాజరయ్యారు. అనంతరం చేపట్టాల్సిన కార్యక్రమాలపై చర్చ జరిపారు. ఈ కార్యక్రమంలో నూతనంగా ఎన్నికైన అధ్యక్ష కార్యదర్శులు గుణ, నాగరాజు ఎన్నికయ్యారు. వినోద్, సుమన్, చందులతోపాటు మరో 16 మందిని సభ్యులుగా ఎన్నుకున్నారు.

రసాయిన ఎరువులు వాడొద్దు

పెళ్లకూరు : రైతులందరూ ప్రకృతి వ్యవసాయం చేయాలని రసాయిన ఎరువుల వల్ల పర్యావరణం కలుషితమై పోతుందని వ్యవసాయాధికారులు అన్నారు. పాలచ్చూరు గ్రామంలో స్థానిక ఏడీఏ నర్సోజీరావు ఆధ్వర్యంలో నెల్లూరు రైతు శిక్షణా కేంద్రంవారు శుక్రవారం రైతులకు శిక్షణా కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో నర్సోజీరావు మాట్లాడుతూ రసాయన ఎరువులు ఎక్కువ వాడటం వలన సూక్ష్మజీవులు ఉనికి లేకుండా పోతుందన్నారు. రైతులు అధిక దిగుబడులకోసం విచక్షణారహితంగా రసాయన పురుగు మందులు వాడటం వల్ల భూమి, నీరు, గాలి, ఆహారపదార్థాలు కలుషితమై రసాయన అవశేషాలు శరీరంలోకి పోయి కేన్సర్ వంటి వ్యాధుల బారిన పడుతారన్నారు. ఈ కార్యక్రమంలో రైతు శిక్షణా కేంద్రం అధికారి రాజగోపాల్, సర్పంచ్, ఎంపీఈవోలు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో తల్లిపాల వారోత్సవాలు



తల్లిపాల విశిష్టతను వివరిస్తున్న సీడీపీవో ఈశ్వరమ్మ

దొరవారిసత్రం: మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో శుక్రవారం తల్లిపాలవారోత్సవాలు నిర్వహించారు. మైలాంగం అంగన్‌వాడీ కేంద్రంలో ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. సూళ్లూరుపేట ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీవో ఈశ్వరమ్మ ఈ కార్యక్రమంలో పాల్గొని పౌష్టికాహారం గురించి వివరించారు. బిడ్డకు తల్లిపాలు శ్రేయస్కరమని వివరించారు. అలాగే దొరవారిసత్రం, నేలపట్టు, నెల్లూరుపల్లి, మినమనమూడి, చందనమూడి గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు అంకమ్మ, కార్యకర్తలు పాల్గొన్నారు.

చిట్టమూరు : మండల పరిధిలోని పలు అంగనవాడీ కేంద్రాల్లో శుక్రవారం తల్లిపాలవారోత్సవాలు నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కృష్ణమ్మ, రత్నమ్మ ఆధ్వర్యంలో ఈ వారోత్సవాలు జరిగాయి. గునపాడు, గునపాటిపాళెం, బురదగాలి, కొత్తపాళెం తదితర గ్రామాల్లో ర్యాలీలు నిర్వహించి తల్లి పాల విశిష్టతను వివరించారు. ఈ కార్యక్రమంలో గర్భిణులు, బాలింతలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

బిరదవాడకు త్వరలో సోలార్ సొగసులు



మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

నాయుడుపేటరూరల్ : నాయుడుపేట మండలం జువ్వలపాళెం పంచాయతీలోని బిరదవాడ గ్రామానికి సోలార్ విద్యుత్‌దీపాలు ఏర్పాటు చేస్తున్నట్లు టీడీపీ సీనియర్ నాయకులు తంబిరెడ్డి జనార్దన్ రెడ్డి, టీడీపీ మహిళా జిల్లా ప్రధాన కార్యదర్శి, ఎంపీటీసీ భూలక్ష్మి తెలిపారు. జాతీయ రహదారి నుంచి బిరదవాడ వరకు ఏర్పాటు చేస్తున్న సోలార్ విద్యుత్‌దీపాలను శుక్రవారం వారు పరిశీలించారు. స్వర్ణటోల్‌వే ప్లాజా నిర్వహణ అధికారి దీపక్‌తో మాట్లాడి ఆమేర సోలార్ దీపాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. తద్వారా నిత్యం జాతీయ రహదారి నుంచి వచ్చే గ్రామస్థులకు రాకపోకలకు భద్రత ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో దీపక్, దయాకర్, సుబ్బయ్య, చెంగయ్య, పుట్టయ్య తదితరులు ఉన్నారు.

తడలో ఎస్పీ

- అర్ధరాత్రి వరకు మకాం
- పాత కేసులపై ఆరా
- హడలిపోతున్న సిబ్బంది



పోలీసుస్టేషన్‌లో ఎస్పీ రామకృష్ణ


తడ : అక్రమార్కుల భరతం పడుతున్న ఎస్పీ రామకృష్ణ తడలో అడుగుపెట్టాడు. శుక్రవారం సాయంత్రం ఆకస్మికంగా విచ్చేసిన ఎస్పీ అర్ధరాత్రి వరకు స్టేషన్‌లో మకాం వేశాడు. ఈ సందర్భంగా పాత కేసుల ఫైళ్లను పరిశీలించి వాటి పూర్వాపరాలు అడిగి తెలుసుకున్నాడు. దీంతో స్థానిక పోలీసులు హడలిపోతున్నారు. ఏటువంటి సమాచారం ఇవ్వకుండా స్థానిక పోలీస్ స్టేషన్‌కు విచ్చేయడంతో ఒక్కసారిగా పోలీసుల్లో కలకలం రేగింది. పలు కేసులపై వివరాలను అడుగుతూ ప్రతి రికార్డును క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం ఇసుక చెక్‌పోస్టు వద్దకెళ్లి అక్కడ తనిఖీ చేసిన అనంతరం ఎస్ఐ సురేష్‌బాబుపై కొంత అసహనం వ్యక్తం చేశారు. చెక్‌పోస్టు నిర్వహించేది ఇలాగేనా, అసలు ఇక్కడకు వస్తున్నావా అంటూ ప్రశ్నల వర్షం కురిపించారు. మరో వైపు అటవీ, గనులు, భూగర్భశాఖ అధికారులను పిలిచి ఇసుక, ఎర్రచందనం అక్రమరవాణా జరగకుండా చూసుకోవాల్సిన మీరు లోపల కూర్చోవడం ఏమిటని పోలీసులు మీ పని చేస్తున్నారని మీరు సైతం మావారితో కలసి తనిఖీలు చేయాలంటూ సున్నితంగా హెచ్చరించారు. అక్కడ నుంచి తిరిగి మరలా పోలీస్ స్టేషన్‌కు వచ్చి రికార్డుల తనిఖీలలో మునిగిపోయారు. దీంతో ఏక్షణం ఏం జరుగుతుందో నంటూ స్థానిక పోలీసుల్లో ఆందోళన చెందటం కన్పించింది.



ఎస్పీకి సమస్యలు వివరిస్తున్న తడకండ్రిగ సర్పంచు గుణసుందరి రామమూర్తి

చిరువ్యాపారులను తరలించండి : పోలీస్ స్టేషన్‌కు వచ్చిన ఎస్పీని తడకండ్రిగ సర్పంచు బి. గుణసుందరిరామమూర్తి కలుసుకున్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ పలు సమస్యలను ఎస్పీ దృష్టికి తీసుకువెళ్లారు. ప్రధానంగా బజారు కూడలిలో ఉన్న చిరువ్యాపారుల అందరిని ఖాళీ చేయించాలని వారి కోసం నిర్మించిన మార్కెట్‌లకు వెళ్లేలా వారిని చూడాలని సర్పంచ్ కోరడంతో స్పందించిన ఎస్పీ వెంటనే చర్యలు తీసుకోవాలని పోలీసులను ఆదేశించారు.

ఆత్మగౌరవంపై దృష్టి సారించాలి : ఆర్డీవో



అధికారులతో మాట్లాడుతున్న ఆర్డీవో శీనానాయక్

సూళ్లూరుపేట : మండలంలో ఆత్మగౌరవం కార్యక్రమం నత్తనడకన సాగుతుందని దీనిపై ప్రతి ఒక్కరు దృష్టి సారించాలని నాయుడుపేట ఆర్డీవో శీనానాయక్ తెలిపారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఆయన అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఈ కార్యక్రమం పై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. అంగన్‌వాడీ వర్కర్లు, మండలస్థాయి అధికారులందరూ దీనిపై దృష్టిసారించాలని కోరారు. సమావేశంలో ఆయనతోపాటు ఇన్‌చార్జ్ తహసీల్దార్ ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా చెంగాళమ్మ ఆలయ వార్షికోత్సవం



కలశాలు తీసుకొస్తున్న ఉభయకర్తలు

చిట్టమూరు : మండల పరిధిలోని ఆరూరు గ్రామంలో నిర్మించిన శ్రీ చెంగాళమ్మ పరమేశ్వరి ప్రథమ వార్షికోత్సవ సంబరాలు శుక్రవారం నుంచి వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆలయ కమిటీ ఛైర్మన్ ఉక్కు జనార్దన్, సుమతి, ఉభయకర్తలు కలశాలతో ఆలయం వద్దకు చేరారు. వేదపండితుల ఆధ్వర్యంలో విఘ్నేశ్వర పూజ, మహాశాంతిహోమం వైభవంగా నిర్వహించారు. మధ్యాహ్నం అమ్మవారికి ప్రత్యేక వివిధరకాల పూలతో అలంకరించారు. ఈ మేరకు భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. శ్రావణ శుక్రవారం కావడంతో ఆలయానికి భక్తులు అధిక సంఖ్యలు విచ్చేసి అమ్మవారిని దర్శించుకున్నారు. తహసీల్దార్ చంద్రశేఖర్, పలువురు అమ్మవారిని దర్శించుకున్నారు. ఎస్ఐ వేణుగోపాల్ తన సిబ్బందితో భక్తులకు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకున్నారు. ఈ సందర్భంగా మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. ఉత్సవాల సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. జబర్దస్త్ ఫేం రచ్చరవి చేసిన హాస్యవల్లరి పలువురికి ఆకట్టుకుంది.

ఒకరిపై హత్యాయత్నం

- స్థానికుల్లో భయాందోళన

నాయుడుపేటరూరల్ : నాయుడుపేట రైల్వేస్టేషన్ సమీపంలో గుర్తు తెలియని వ్యక్తిపై హత్యాయత్నం జరిగింది. దీంతో ఈ ప్రాంతవాసుల్లో కలకలం రేగింది. స్థానికుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. రైల్వేస్టేషన్ సమీపంలో ఉన్న ఓ వ్యక్తిపై ఒక్కసారిగా గుర్తు తెలియని మరో వ్యక్తి కత్తితో దాడి చేశాడు. కత్తిగాయాలైన వ్యక్తికి తీవ్రరక్తస్రావం కావడంతో ప్రాణాపాయస్థితిలో వెళ్లాడు. స్థానికులు అడ్డుకునేందుకు ప్రయత్నించగా నిందితుడు అక్కడి నుంచి పరారయ్యాడు. సమాచారం అందుకున్న 108 సిబ్బంది క్షతగాత్రుడిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఎస్ఐ రవినాయక్ ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి ఆ వ్యక్తితో మాట్లాడేందుకు ప్రయత్నించగా తన పేరు బాబు అని మాత్రమే సమాధానం చెబుతున్నాడు. ఇక ఎలాంటి సమాచారం ఇవ్వడం లేదని తెలిసింది. దాడి సంఘటనపై పోలీసులు ఆరాతీస్తున్నారు.



ప్రాణాపాయస్థితిలో ఉన్న గుర్తుతెలియని వ్యక్తి

మూడు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత



పోలీసుస్టేషన్లో ఇసుక ట్రాక్టర్లు

చిట్టమూరు : అక్రమంగా తరలిస్తున్న ఇసుక వాహనాలపై శుక్రవారం ఎస్సై వేణుగోపాల్ దాడులు నిర్వహించారు. చిట్టమూరు మండల పరిధిలోని పలు ప్రాంతాల్లో ఆంక్షలు ఉన్నప్పటికీ ఇసుక అక్రమ రవాణా చేస్తుండంతో ఎస్సై తన సిబ్బందితో దాడి చేసి 3 ట్రాక్టర్లను పట్టుకున్నారు. ఉప్పలమర్తి నుంచి నాయుడుపేట వైపు ఇసుక లోడ్ చేసుకొని తీసుకెళ్తుండగా గ్రామస్థుల సమాచారం మేరకు దాడి చేసినట్లు తెలిపారు. ఇసుక అక్రమ రవాణాపై కఠినంగా వ్యవహరించి నిఘా పెంచాలని వీఆర్వోలకు తహసీల్దార్ చంద్రశేఖర్ ఆదేశాలు ఇచ్చారు.

సినిమా గైడ్

నాయుడుపేట

సీఎస్‌తేజ :	దండుపాళ్యం
మురారి :	మాయమాల్
శ్రీవెంకటేశ్వర :	ఫిదా

సూళ్లూరుపేట

శ్రీలక్ష్మి :	ఫిదా
ఎన్‌వీఆర్ :	దండుపాళ్యం

తెలుగు రాష్ట్రాల్లో అస్తవ్యస్త పాలన : బీజేపీ

మనుబోలు : ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల్లో పాలన అస్తవ్యస్తంగా తయారైందని బీజేపీ మండలాధ్యక్షుడు బోలా శ్రీనువాసులు అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో శుక్రవారం పదాధికారుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నెల్లూరులో బెట్టింగ్, పసుపు కుంభకోణాలు, వైజాగ్‌లో భూ కుంభకోణాలు, హైద్రాబాద్‌లో డ్రగ్స్ కుంభకోణం తదితర అసాంఘీక కార్యక్రమాలతో రెండు రాష్ట్రాలు భ్రష్టు పట్టాయన్నారు. విచారించి దోషులను కఠినంగా శిక్షించాలన్నారు. ఈకార్యక్రమంలో బీజేపీ నాయకులు ఓడూరు శ్రీనువాసులురెడ్డి, సీతారామిరెడ్డి, కామంచి వెంకయ్య, కంటె సుధాకర్, శేఖర్, వీర ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

● ఇంటర్వ్యూ



రూ.కోటితో ఉపాధి హామీ పనులు

సాంకేతిక సహాయకుడు దాసరి బాబు

? : ఉపాధి హామీ పనుల పరిస్థితి ఏమిటి.

! : ముత్తుకూరు మండలంలో ఉపాధి హామీ పథకం కింద ఈ ఏడాది పనులు బాగానే జరుగుతున్నాయి. గత ఏడాది రూ.కోటీ 28 లక్షల పనులు చేపట్టగా, ఈ ఏడాది ఇప్పటివరకు రూ.కోటితో ఉపాధి పనులు జరిగాయి.

? : ఎందువల్ల ఎక్కువ పనులు చేయడంలేదు.

! : మండలంలో ప్రధానంగా కాలువల మరమ్మతులు మాత్రమే అధికంగా చేపడుతున్నారు. కొన్నిచోట్ల కాటిల్ పాండ్స్ చేపట్టాం. భూ విలువ పెరగడంతో పంట సంజీవిని పథకం కింద కుంటలు తవ్వుకునేందుకు రైతులు ముందుకు రావడం లేదు.

? : కూలి చెల్లింపులో జాప్యం జరుగుతోందంటున్నారు.

! : కూలి బ్యాంకు ఖాతాలో జమ చేస్తున్నారు. బాంకర్లు నగదు బదిలీ చేయడంలో ఆలస్యం అవుతోంది. బ్యాంకర్లతో మాట్లాడి త్వరగా వచ్చేలా చూస్తున్నాం. శాఖాపరంగా ఎలాంటి జాప్యం లేదు. ఎప్పటికప్పుడు వివరాలను నమోదు చేసి మూడు రోజుల్లో చెల్లించేలా చర్యలు తీసుకుంటున్నాం.

? : మేస్త్రీల వ్యవహార శైలితో ఇబ్బందులున్నాయా.

! : మండంలంలో కొన్ని చోట్ల మాత్రమే ఈ సమస్య ఎదురైంది. ఉపాధి పనులు, ఇతర నిబంధనల విషయంలో పరిజ్ఞానం లేకనే సమస్యలొచ్చాయి. మేస్త్రీలకు తగిన శిక్షణ ఇచ్చి సమస్య పరిష్కరించాం.

- ముత్తుకూరు



పొదలకూరు రామాలయంలో వ్రతం చేస్తున్న మహిళలు



అయ్యగారిపాళెం పార్వతీదేవి ఆలయంలో..



ముత్తుకూరు: కృష్ణపట్నం సిద్ధేశ్వరాలయంలో..

భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతం

● కిటకిటలాడిన ఆలయాలు ● ఊరూ-వాడా వెల్లివిరిసిన ఆధ్యాత్మిక శోభ

పొదలకూరు: మండలంలోని అన్ని ఆలయాల్లో శ్రావణ శుక్రవారం సందర్భంగా మహిళలు భక్తిశ్రద్ధలతో సామూహికంగా వరలక్ష్మీ వ్రతం ఆచరించారు. మండలంలోని పొదలకూరు-సంగం రహదారిలో అయ్యగారిపాళెం రోడ్డు వద్ద వేంచేసిన పార్వతీదేవి ఆలయంలో అమ్మవారికి ఏకరుద్రాభిషేకం, పంచామృత అభిషేకం, సహస్రనామ కుంకుమార్చన, పుష్పాభిషేకం నిర్వహించారు. అనంతరం కలశాన్ని స్థాపించి వరలక్ష్మీ వ్రతాన్ని జరిపించారు. ఈ కార్యక్రమానికి చెర్లోపల్లి గ్రామానికి చెందిన గూడూరు గోపాలరావు, సుబోధిని, గూడూరు రామయ్య, దోర సానమ్మ దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. భక్తులకు తీర్థప్రసాలు, అన్నప్రసాదం అందజేశారు. మండలంలోని అమ్మవార్ల ఆలయాలు మహిళలతో కిటకిటలాడాయి. పొదలకూరు పట్టణంలోని కామాక్షి సమేత రామలింగేశ్వర స్వామి శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరీ, శ్రీరామ మందిరం తదితర ఆలయాల్లో సామూహికంగా వరలక్ష్మీ వ్రతం ఆచరించారు. అయ్యప్పనగర్‌లోని శ్రీలక్ష్మీవేంకటేశ్వర ఆలయంలో సామూహిక కుంకుమార్చన చేశారు. పట్టణంలోని శ్రీనివాసా లేఅవుట్‌లోని లక్ష్మీ వెంకటేశ్వర ఆలయంలో శ్రావణ మాస పూజల్లో భాగంగా రెండో శుక్రవారం ఉదయం 9 గంటలకు లక్ష్మీదేవికి విష్వక్సేన పూజ, పుణ్యహావాచనం, సుగంధ పరిమళ ద్రవ్యాలు, పసుపు కుంకుమ, పంచామృతాలతో అభిషేకం జరిపించారు.

ముత్తుకూరు: కృష్ణపట్నం సిద్ధేశ్వరాలయంలో శుక్రవారం సామూహిక వరలక్ష్మీవ్రతం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి ఉదయం ఏకాదశి రుద్రాభిషేకాలు చేశారు. వరలక్ష్మీ అమ్మవారికి విశేషాలంకారంతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సామూహిక వరలక్ష్మీ వ్రతంలో పాల్గొనేందుకు మహిళలు అధిక సంఖ్యలో హాజరయ్యారు. ఆలయ ధర్మకర్తమండలి అధ్యక్షుడె ఏకొల్లు కోదండరామయ్య, కార్యనిర్వహణాధికారి పాయసం నాగేశ్వరరావు ఆధ్వర్యంలో భక్తుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. శైవాగమ ప్రతిష్టాచార్యులు నూతలపాటి సుబ్బయ్యశాస్త్రి ఆధ్వర్యంలో ప్రధాన అర్చకులు గూడలి సుబ్బరావుశర్మ, నగేష్ భక్తి శ్రద్ధలతో వరలక్ష్మీ వ్రత కల్పాన్ని కన్నుల పండువగా జరిపారు. పూజల అనంతరం అమ్మవారిని భక్తులు దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. సాయంత్రం వరలక్ష్మీ అమ్మవారి గ్రామోత్సం నిర్వహించారు.

మనుబోలు : మండలంలోని దేవీ ఆలయాలు శ్రావణమాసం రెండో శుక్రవారం కావడంతో మరింత శోభను సంతరించుకున్నాయి. దీనికి వరలక్ష్మీవ్రతం తోడవడంతో మహిళలు అధిక సంఖ్యలో ఆలయాలకు చేరుకున్నారు. మనుబోలులోని గంగమ్మ ఆలయంలో అమ్మవారికి అర్చకులు వేదమంత్రాలతో శాస్త్రోపేతంగా పంచామృతాభిషేకాలను నిర్వహించారు. అనంతరం కుంకుమ పూజలు చేశారు. ఈ పూజా కార్యక్రమాలకు వేణుంబాక కోటేశ్వరరావు శైలజ దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. సాయంత్రం విష్ణాలయంలో అర్చకులు మాధవగిరి హనుమాచార్యులు మహిళలచే సామూహిక లక్ష్మీ కుంకుమ పూజలు, వరలక్ష్మీ వ్రతం చేయించారు. పూజలు అనంతరం మహిళలు పరస్పరం వాయినాలు ఇచ్చుకున్నారు. అమ్మవారికి నైవేద్యాలు సమర్పించి మొక్కలు తీర్చుకున్నారు. తరువాత ఆలయాల అర్చకులు భక్తులకు తీర్థ, ప్రసాదాలు పంపిణీ చేశారు. ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

మొక్కల పెంపకంతోనే సంపూర్ణ ఆరోగ్యం

తోటపల్లిగూడూరు : ఇళ్ల పరిసరాల్లో మొక్కలు పెంచితే వాతావరణ కాలుష్యాన్ని నివారించడంతోపాటు సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉంటామని వెలుగు ఏరియా కో ఆర్డినేటర్ శ్రీనివాసులు పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని ఇస్కపాళెం గ్రామం నుంచి పాపిరెడ్డిపాళెం గ్రామం వరకు అవెన్యూ ప్లానిటేషన్ కార్యక్రమం ద్వారా మొక్కల పెంపకం కార్యక్రమాన్ని చేపట్టారు. ఆయన మాట్లాడుతూ మండలంలోని ప్రతి ఒక్క వెలుగు సీసీ తప్పనిసరిగా ఐదు కిలో మీటర్లలోపు దాదాపు 2000 మొక్కలు నాటాలన్నారు. మొక్కలు, పర్యావరణ పరిరక్షణకు సీసీలే బాధ్యత వహించాలన్నారు. భావి తరాలకు సంపూర్ణ ఆరోగ్యం అందించాలనే ఉద్దేశ్యంతోనే ప్రభుత్వం ఈ మొక్కల నాటే కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. మండలంలోని వెలుగు సీసీలకు సంబంధించి ఆ ఏరియా పరిధిలోని గ్రామాలలో మొక్కలు నాటుతారన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం సూరిబాబు, సీసీలు మణి, తిరుపతయ్య, పెంచలబాబు, సునీత, సావిత్రి తదితరులు పాల్గొన్నారు.

అక్షరాస్యత పెంపునకు దాతల సహకారం

వెంకటాచలం: అక్షరాస్యత పెంపునకు దాతలు తమ వంతు సహకారమందించాలని కోస్తాసేవా సమితి ప్రధాన కార్యదర్శి గురుప్రసాద్ పేర్కొన్నారు. కసుమూరు గ్రామంలో కోస్తా సేవా సమితి వారు నిర్వహిస్తున్న బాల కార్మిక పాఠశాలలోని 50 మంది విద్యార్థులకు నెల్లూరుకు చెందిన దుగ్గిరాల రమేష్ విరాళంగా ఇచ్చిన స్కూలు బ్యాగులను అందచేసిన అనంతరం ఆయన మాట్లాడారు. దేశంలో అక్షరాస్యత పెంపునకు ఎన్నో అవరోధాలు ఉన్నాయన్నారు. ముఖ్యంగా నిధుల కొరత తీవ్రంగా ఉందన్నారు. అందువల్ల అనుకున్న స్థాయిలో అక్షరాస్యత శాతం పెరగడం లేదన్నారు. కాబట్టి ప్రభుత్వ రంగంతో పాటు ప్రయివేటు రంగం కూడా విద్యారంగానికి తమ వంతు చేయూతను అందించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో దుగ్గిరాల రమేష్, కసుమూరు గ్రామ సీనియర్ టీడీపీ నేత లగుంసాని వెంకయ్య నాయుడు తదితరులు పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

కావలి(క్రైం): కావలి మద్దూరుపాడులో శుక్రవారం పుట్టంశెట్టి శ్రీకాంత్ ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. అతడు ఉరి వేసుకోవడాన్ని గమనించిన కుటుంబసభ్యులు ఉరి నుంచి తప్పించి 108 వాహానంలో కావలి ఏరియా వైద్యశాలకు తరలించారు. స్థానికంగా హోటల్‌లో పనిచేసే శ్రీకాంత్ కుటుంబ కలహాలు, అప్పుల బాధతో ఆత్మహత్యకు పాల్పడ్డాడని స్థానికులు తెలిపారు. బాధితుడి తరపు బంధువులు ఏరియా వైద్యశాల ఆవరణలో శ్రీకాంత్ బార్య శ్రీలక్ష్మిపై దాడి చేశారు.

పక్కాగృహాల లబ్ధిదారుల ఎంపిక

ముత్తుకూరు: ముత్తుకూరు మండలంలో శుక్రవారం పక్కా ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక నిర్వహించారు. నారికేళపలిల్లో వ్యవసాయాధికారి హరికరుణాకర్‌రెడ్డి, దువ్వూరువారిపాళెంలో తహసీల్దారు చెన్నయ్య, పాటూరువారికండ్రిగలో ఎంపీడీవో వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఎన్టీఆర్ గ్రామీణ గృహ నిర్మాణ సభలను నిర్వహించారు. అర్హులైన లబ్ధిదారుల వివరాలను అధికారులు సభలో వినిపించి అభ్యంతరాలు తెలపాలని కోరారు. ఈ సభల ద్వారా ఎంపికైన లబ్ధిదారులకు గృహనిర్మాణ శాఖ ద్వారా పక్కా ఇల్లు మంజూరు చేస్తారన్నారు.



నారికేళపల్లి సభలో లబ్ధిదారులను ఎంపిక చేస్తున్న అధికారులు

రాష్ట్రం నుంచి జగన్‌ను బహిష్కరించాలి

పొదలకూరు: రాష్ట్ర సీఎం చంద్రబాబుపై అనుచిత వ్యాఖ్యలు చేసిన ప్రతిపక్ష నేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డిని రాష్ట్రం నుంచి బహిష్కరించాలని కోరుతూ టీఎన్‌ఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో విద్యార్థి సంఘం నాయకులు శుక్రవారం పొదలకూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. టీఎన్‌ఎస్‌ఎఫ్ రాష్ట్ర అధికార ప్రతినిధి పీ అంజయ్య మాట్లాడుతూ నంద్యాల ఉప ఎన్నికల బహిరంగ సభలో వైఎస్ జగన్ పిచ్చిపట్టిన వాడిలా సహనం కోల్పోయి సీఎం చంద్రబాబును నడిరోడ్డుపై కాల్చి చంపాలని పిలుపునివ్వడం అతని ప్యాక్షన్ రాజకీయాలకు అద్దపడుతోందన్నారు. పోలీసులు జగన్ వ్యాఖ్యలను సుమోటాగా తీసుకొని కేసు నమోదుచేసి రాష్ట్ర బహిష్కరణ చేయాలని డిమాండ్ చేశారు. వైసీపీ అధికారంలోకి రాకుంటేనే జగన్ ఇలా మాట్లాడుతున్నారు, ఒక వేళ పొరపాటున అధికారంలోకి వస్తే బతకనిస్తాడా అని ప్రజలు ఆందోళన చెందుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కోవూరు వెంకటేశ్వర్లునాయుడు, టీఎన్‌ఎస్‌ఎఫ్ మండల అధ్యక్షుడు కలగట్ల సందీప్, తెలుగు యువత మండల ఉపాధ్యక్షుడు మన్నవరపు రవికుమార్‌యాదవ్, పల్లారపు కృష్ణ, విద్యార్థి సంఘం నాయకులు పాల్గొన్నారు.



పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న టీఎన్‌ఎస్‌ఎఫ్ నాయకులు

జగన్‌కు పట్టిన పిచ్చిని ప్రజలే వదిలిస్తారు

డక్కిలి: ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడిని నడిరోడ్డుపై కాల్చి చంపాలని నంద్యాలలో జగన్ చేసిన వ్యాఖ్యలు చూస్తుంటే ఆయనకు పిచ్చి బాగా ముదురిపోయినట్లు ఉందని, దానిని ప్రజలు వదిలిస్తారని టీడీపీ మండల అధ్యక్షుడు పోలంరెడ్డి కోటేశ్వరరెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన డక్కిలిలో విలేఖర్లతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబుపై జగన్ చేసిన వ్యాఖ్యలు చూస్తుంటే ఆయనలో ఫ్యాక్షనిస్టు బయటకొచ్చారని చెప్పారు. అధికారంలో లేకపోయినప్పుడే ఇలావుంటే అధికారంలో ఉంటే ఇక ఎలా ఉండేదో ప్రజలు అర్థం చేసుకోవాలన్నారు. జగన్ తాత రాజారెడ్డి ఫ్యాక్షనిజాన్ని పునికి పుచ్చుకొన్న జగన్ అధికారంలోకి వస్తే సామాన్య ప్రజల పరిస్థితి ఏమిటో ఒక్కసారి ఊహించుకోవాలంటేనే భయంగా ఉందన్నారు. ఈ లాంటి నాయకులు రాజకీయాల్లోకంటే జైల్లో ఉండటమే మంచిదని ప్రజలు అభిప్రాయపడుతున్నారన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పదేళ్ల పాటు ప్రతిపక్షంలో ఉన్నా ఏనాడు ఆయన హద్దులు దాటలేదన్నారు. ప్రతి పక్షనేతగా ఎంతో హోందాగా వ్యవహరించారని చెప్పారు. జగన్ తాత, తండ్రులకు హింస అలవాటేనన్నారు. నంద్యాల ఎన్నికల ఫలితాలు జగన్‌కు గుణపాఠం కావాలన్నారు. జగన్ నోరు అదుపులో పెట్టుకోకపోతే జనం ఆయన్ను రాళ్లతో కొట్టడం ఖాయమన్నారు. తండ్రి వయస్సున్న చంద్రబాబు నాయుడిని నడిరోడ్డులో కాల్చి చంపాలని జగన్ చేసిన వ్యాఖ్యలు ప్రజలు జీర్ణించుకోలేక పోతున్నారని చెప్పారు. ఎంతటి క్రూరత్వం ఉన్న వాళ్లు కూడా ఇలాంటి మాటలు మాట్లాడరని చెప్పారు.

సామూహిక వరలక్ష్మీ వ్రతం


రాపూరు: విశేషఅలంకారంలో ఆదిలక్ష్మి అమ్మవారు


రాపూరు: నందనవనంలో వరలక్ష్మి వ్రతంలో మహిళలు

- తిరుచ్చిపై ఊరేగిన ఆదిలక్ష్మి అమ్మవారు
- నందనవనంలో ప్రత్యేక పూజలు

రాపూరు: పెంచలకోన ఆదిలక్ష్మి అమ్మవారి ఆలయంలో శ్రావణ శుక్రవారం, వరలక్ష్మి వ్రతం సందర్భంగా సామూహిక వరలక్ష్మీ వ్రతం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం 5 గంటలకు అమ్మవారి అభిషేకంతో ప్రారంభమైన పూజలు, తిరుచ్చి ఉత్సవం, గిరి ప్రదక్షణలతో వైభవంగా ముగిశాయి. ఉదయం 10 గంటలకు శ్రీవారి నందనవనంలో అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ఉంచి పలు రకాల పుష్పాలు, పండ్లతో శోభయమానంగా అలంకరించారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో కోనకు చేరుకున్న మహిళలు నందనవనంలో వ్రతాలు నిర్వహించారు. అనంతరం అమ్మవారిని తిరుచ్చిపై ఉంచి ఊరేగించారు. ఈ వ్రతంలో పాల్గొన్న మహిళలకు దేవాదాయశాఖ అధికారులు జాకెట్, అమ్మవారి పసుపు, కుంకుమ, గాజులు, ప్రసాదాలు అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ పాలక మండలి ఛైర్మన్ తానంకి నానాజీ, ఆలయ ఈవో శనగవరం శ్రీరామమూర్తి తదితరులు పాల్గొన్నారు.


వెంకటగిరి(టౌన్): వరలక్ష్మీ వ్రతం నిర్వహిస్తున్న మహిళలు

రాపూరు శివాలయంలో ప్రత్యేక పూజలు..

రాపూరు శివాలయంలోని పర్వతవర్ధిని అమ్మవారి ఆలయంలో వరలక్ష్మీ వ్రతం పురస్కరించుకుని మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలువురు తమ నివాస గృహాల్లో వరలక్ష్మీ వ్రతం వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

డక్కిలి: మండలంలోని దేవుని వెల్లంపల్లి స్తంభాలగిరీశ్వరుడు, వెలుగొండ కొండల కింద ఉన్న యోగా లక్ష్మీ నరసింహస్వామి, కొలితోట చెంచమ్మ ఆలయాల్లో శ్రావణ శుక్రవార, వరలక్ష్మీ వ్రత పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. చుట్టుపక్కల గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో తరలి వచ్చి సమూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. ఆలయాల్లో అర్చకులు విశేష పూజలు నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. డక్కిలి ఎంపీపీ పోలంరెడ్డి వెంకటరెడ్డి, డీ వడ్డిపల్లి సర్పంచు వేపమాను చంచమ్మ దంపతులు యోగా లక్ష్మీ నరసింహ స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

కిక్కిరిసిన ఆలయాలు..

వెంకటగిరి(టౌన్): వరలక్ష్మీ వ్రతం సందర్భంగా పట్టణంలోని పలు ఆలయాల్లో భక్తులు వ్రత పూజలు చేశారు. దీంతో ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. కన్యకా పరమేశ్వరీదేవి, కాళీకామాత, పర్వతవర్ధిని, రామలింగేశ్వర స్వామి ఆలయాల్లో భక్తులు కిక్కిరిశాయి. మున్సిపల్ ఛైర్‌పర్సన్ దొంతు శారద, వైసీపీ పట్టణ కన్వీనర్ గుమ్మళ్లపు డిల్లీబాబు, మాజీ మంత్రి బల్లి దుర్గాప్రసాద్‌రావులతో పాటు పలువురు ప్రముఖుల నివాసాల్లో వరలక్ష్మీదేవి వ్రతం వైభవంగా నిర్వహించారు.


డక్కిలి: పూజలు చేస్తున్న ఎంపీపీ పోలంరెడ్డి


డక్కిలి: సామూహిక వ్రత పూజల్లో మహిళా భక్తులు

క్రీడలు కీర్తి కిరీటాలు

- మున్సిపల్ ఛైర్‌పర్సన్ దొంతు శారద
- అట్టహాసంగా ఇంటర్ స్కూల్ అథ్లెటిక్స్


క్రీడా జ్యోతి వెలిగిస్తున్న మున్సిపల్ ఛైర్‌పర్సన్ దొంతు శారద

వెంకటగిరి: క్రీడలు కీర్తి కిరీటాలన్న విషయం విద్యార్థుల తల్లిదండ్రులు భావించి తమ పిల్లను క్రీడల పట్ల ప్రోత్సహించాలని మున్సిపల్ ఛైర్‌పర్సన్ దొంతు శారద పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక విశ్వోదయ జూనియర్ కళాశాల క్రీడా ప్రాంగణంలో యువసేనా ఇంటర్ స్కూల్ అథ్లెటిక్ మీట్‌ను జాతీయ జెండా ఆవిష్కరించి, క్రీడా జ్యోతి వెలిగించి ప్రారంభించిన ఆమె విద్యార్థులు అందించిన గౌరవ వందనాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆమె మాట్లాడుతూ ఈ మీట్ నిర్వహణకు ఆర్థిక తోడ్పాటు అందించిన గునకల లక్ష్మీప్రసన్న చారిటబుల్ ట్రస్టు అధ్యక్షుడు గునకల ధనుంజయను, జీవిన్ఆర్ సర్వీస్ ట్రస్టు అధ్యక్షుడు గంగోటి నాగేశ్వరావుకు అభినందనలు తెలిపారు. అదేవిధంగా మీట్‌ను నిర్వహించిన యువసేనా అసోసియేషన్ నిర్వాహకులను అభినందించారు. తొలిరోజు మీట్‌లో పాల్గొన్న 21 పాఠశాలల విద్యార్థులకు 100, 200 మీటర్ల రిలే పరుగు పందేలు, షాట్‌పుట్, డిస్కస్‌త్రో, జావల్‌త్రో, లాంగ్ జంప్, హైజంప్ 13 ఈ వెంట్లలో పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన విశ్వోదయ ప్రభుత్వ డిగ్రీకళాశాల పీఈటీ సురేంద్రరెడ్డిని మున్సిపల్ ఛైర్‌పర్సన్ శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో గునకల ధనుంజయ, డాక్టర్ రవీంద్రబాబు, బంగారుపేట ఆర్వీఎం హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు మోహన్‌కృష్ణ, డక్కిలి పీఈటీ జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల నిరసన

వెంకటగిరి: ప్రభుత్వం అమలు పరిచిన 279 జీవోను నిరసిస్తూ శుక్రవారం మున్సిపల్ కార్మికులు నిరసన ప్రదర్శన నిర్వహించారు. మున్సిపల్ కార్యాలయం వద్ద నుంచి కార్మికులు నోటికి నల్ల రిబ్బనులు కట్టుకొని పురవీధుల్లో ప్రదర్శన నిర్వహిస్తూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కార్మిక సంఘ నాయకులు చలపతి మాట్లాడుతూ 279 జీవోను రద్దు చేయని పక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. అదేవిధంగా 151 జీవో ప్రకారం రూ. 18వేల వేతనాన్ని చెల్లించాలని, సుప్రీంకోర్టు తీర్పు మేరకు సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు.

ఆదమరిస్తే లోయలో పడాల్సిందే..

డక్కిలి: కండలేరు-పూండి కాలువ నుంచి కాలువ పొడవున రోడ్డు అంచులు ప్రమాద భరితంగా ఉన్నాయి. తరుచూ వాహన చోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. మండలంలోని కమ్మపల్లి రోడ్డు బ్రిడ్జి, దేవునివెల్లంపల్లి బ్రిడ్జి మధ్య కాలువ కట్టపై నిర్మించిన తారు రోడ్డు అంచున లోయ ఉంది. అక్కడ ఎలాంటి ప్రమాద సూచిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడంతో అటుగా వెళ్లే వాహన చోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. వాస్తవానికి కండలేరు-పూండి కాలువ నుంచి కాలువ పొడవున కాలువకు ఒక వైపు ట్రాక్‌పై తారు రోడ్డు నిర్మించారు. దీంతో రాపూరు-వెంకటగిరి మార్గంలో వాహన దారులు కాలువ కట్టపై నుంచి రాకపోకలు సాగిస్తున్నారు. కట్టపై రోడ్డు అంచులు ప్రమాద భరితంగా తయారైనా అధికారులు పట్టించుకోవడం లేదని మండల ప్రజలు వాపోతున్నారు.


తెలుగుగంగ కాలువపై ప్రమాదకరంగా రోడ్డు మార్జిన్

గృహ లబ్ధిదారుల ఎంపికకు గ్రామసభలు

బాలాయపల్లి: ప్రధాన మంత్రి ఆవాస యోజన గ్రామీణ పథకం ద్వారా స్మార్ట్ సర్వేలో స్వీకరించిన అర్జీలను గ్రామ సభల ద్వారా లబ్ధిదారులను ఎంపిక చేస్తామని తహసీల్దారు రాంబాబు అన్నారు. శుక్రవారం తహసీల్దారు అధ్యక్షతన జయంపు, పాకపూడి, హస్తకావేరి, వ్యవసాయ శాఖ అధికారిణి ప్రవీణ అధ్యక్షతన నిడిగల్లు, కాలగండ, అలిమిలి, మన్నూరు, నిండలి తదితర గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించి లబ్ధిదారులను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా తహసీల్దారు రాంబాబు మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలు అర్హులకు అందజేసేందుకు ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపడుతామన్నారు. లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ వెంకటేశ్వర్లు, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

- ఇంటర్వ్యూ



రైతులకు ఉచితంగా సూక్ష్మపోషకాలు

- వాసు, వ్యవసాయాధికారి

? రైతులకు ఏ విధంగా సూక్ష్మపోషకాలు అందజేస్తారు.

! భూసార పరీక్ష పత్రాలలో రైతు పొలంలో ఏమి లోపం ఉందో గుర్తించి నమోదు చేశాం. ఆ పత్రాల ఆధారంగా భూమిలో లోపాలను అధిగమించేందుకు వారికి అవసరమైన సూక్ష్మపోషకాలు ఉచితంగా ఇస్తాం.

? ఏఏ రకాల సూక్ష్మపోషకాలు ఇస్తారు.

! జింక్, జిప్సం, బోరాన్, మెగ్నీషియం అందజేస్తాం. జింక్ లోపం కల్గిన రైతులకు ఎకరాకు 20 కేజీల వంతున గరిష్ఠంగా 5 ఎకరాలకు 100 కేజీల జింక్ ఉచితంగా అందజేస్తాం. అలాగే పీహెచ్ శాతం 8కంటే ఎక్కువ ఉన్న భూమి గల రైతులకు జిప్సం ఉచితంగా ఇస్తాం. అలాగే బోరాన్, మెగ్నీషియం కూడా ఇస్తాం.

? రైతులు ఎవరిని సంప్రదించాలి.

! రైతులు భూసార పరీక్షల నిర్ధారణ పత్రం జెరాక్స్‌తో పాటు పట్టాదారు పాస్‌పుస్తకం తీసుకుని మండల వ్యవసాయాధికారి కార్యాలయంలో సంప్రదించాలి.

- కలువాయి

సినిమా గైడ్

వెంకటగిరి

త్రిభువని:	గౌతమనంద
జ్యోతిమహల్:	నాయకి
భ్రమరాంబ :	పిదా

రాపూరు

శ్రీనివాసమహల్:	గౌతమ్‌నందా
వెంకటేశ్వరమహల్:	ఫిదా